PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 132 | విజయవాడ, సోమవారం 15 డిసెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 15 December 2025 | Rs



ప్రజలను వర్గ పోరాటాల వైపు నడిపిన మేధావి ఎంబి

- మాకినేని బసవ పున్నయ్య జయంతిలో వక్తలు

2



సునాయాసంగా..

మూడో టి20లో భారత్ ఘన విజయం

8

ప్రజాస్వామ్య విలువలకు పాతర

బిజెపి సేవకులుగా ఎన్నికల కమిషనర్లు

- సత్యం, అహింసా మార్గాల్లోనే పోరాటం
- 'ఓటు చోర్..గద్దీ చోడ్' బహిరంగసభలో రాహుల్ గాంధీ



రాంలీలా మైదాన్‌లో నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన ప్రజలు (ఇన్‌సెట్‌లో) రాజ్యాంగ ప్రతిని చూపిస్తున్న కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) ప్రజాస్వామ్య విలువలకు పాతరేస్తోందని, ఇసి కమిషనర్లు బిజెపి సేవకులుగా పనిచేస్తున్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని, ఆర్‌ఎస్‌ఎస్ సైద్ధాంతిక ఉన్మాదాన్ని ఎదుర్కొనేందుకు సత్యం, అహింస మార్గాల్లోనే తమ పోరాటం సాగించి ఓడించి తీరుతామని ఆయన ఉద్ఘాటించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియ నేపథ్యంలోనూ, వివిధ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడి బిజెపికి అనుకూలంగా ఎన్నికల సంఘం పనిచేస్తున్న తీరును ఇదివరకే వివిధ రూపాల్లో రాహుల్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇటీవల జరిగిన బీహార్ శాసనసభ ఎన్నికల్లోనూ ఇలాంటి అక్రమాలకు పాల్పడ్డారనే విమర్శలు నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యాన ఆదివారం న్యూఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో 'ఓటు చోర్ ..గద్దీ చోడ్' (ఓట్ల దొంగా..పీఠం దిగిపో) పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వదేరా, సచిన్ పైలట్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హర్యానా మాజీ ముఖ్యమంత్రి భూపేంద్ర హుడా, లోక్‌సభలో కాంగ్రెస్ ఉపనేత గౌరవ్ గొగోయ్, నాయకులు కెసి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ..ఎన్నికల సంఘంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి బిజెపి సేవలో తరిస్తున్నారని పేర్కొన్నారు. బీహార్ ఎన్నికల సమయంలో బిజెపి, దాని కూటమి ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలు ఓటర్లకు రూ.10,000 చొప్పున బదిలీ చేస్తున్నా..ఇసి మిన్నకుండిపోయిందన్నారు. ప్రజాస్వామ్య విలువలకు పాతరేసిందన్నారు. ప్రస్తుతం మోడీ-ఆర్‌ఎస్‌ఎస్ అధికార అంధకారంలో మునిగిపోయారని, అందుకనే యథేచ్ఛగా ఓట్ల దొంగతనానికి పాల్పడుతూ అధికార పీఠాలకు హత్తుకుపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఓట్ల దొంగల్లారా.. పీఠాన్ని వదిలివెళ్లండి.. లేదంటే ప్రజాపోరుతో గద్దె దింపుతాం' అంటూ రాహుల్ నినదించారు. ప్రపంచంలోని ప్రతి మతం సత్యమే ప్రధానమని చెబుతుంటే..ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ మాత్రం.. 'ప్రపంచం సత్యం వైపు చూడదు.. అధికారం వైపే చూస్తుంది..అధికారం ఉన్నవాడినే గౌరవిస్తుంది' అంటున్నారని, అధికార గర్వంతో ఏమి మాట్లాడుతున్నారో మిగతా 7లో



గజ గజ..

- 2 నుంచి 4 డిగ్రీలు తగ్గనున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో చలి వాతావరణం క్రమంగా పెరుగుతోంది. కొన్ని రోజులుగా రాత్రి వేళల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుదల నమోదవుతోంది. దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో 10 నుంచి 15 డిగ్రీల మధ్య కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, ఉత్తరాంధ్ర, గిరిజన ప్రాంతాల్లో 5 నుంచి 15 డిగ్రీల మధ్య కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీనికితోడు మంచు కురవడం, ఫలితంగా చలి తీవ్రత అధికమవడంతో పలు ప్రాంతాల్లో రాత్రి వేళల్లో జన సంచారం తక్కువగా ఉంటోంది. రానున్న రెండు రోజులపాటు రాష్ట్రంలో అక్కడక్కడ కనిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీల వరకూ తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. గిరిజన ప్రాంతాలైన లంబసింగి, అరకు, పాడేరు, సీలేరు తదితర చోట్ల కొద్ది రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీలలోపు నమోదవుతున్నాయి. వాతావరణశాఖ తాజాగా వెల్లడించిన వివరాల ప్రకారం ఈ ప్రాంతాల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని పేర్కొంది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాం, దక్షిణ కోస్తా, రాయలసీమలో సోమవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది.

సెకీతో భారీగా మిగులు విద్యుత్

ఇది కాక 3,725 మెగావాట్ల పిఎం కుసుమ్

డిస్కమ్‌లపై తీవ్ర ఆర్థిక ప్రభావం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర విద్యుత్ సంస్థలు ఇప్పటికే మిగులు విద్యుత్‌ను కలిగి ఉన్నాయి. అవసరం లేకపోయినా చేసుకున్న అడ్డగోలు ఒప్పందాలతో డిస్కమ్‌లు ఆర్థిక భారంతో కుదేలవుతున్నాయి. ఈ ఆర్థిక భారాన్ని ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ పేర్లతో డిస్కమ్‌లు మోపడంతో విద్యుత్ వినియోగదారులు లబోదిబోమంటున్నారు. మిగులు విద్యుత్ ఉందంటూ ప్రభుత్వ ఆధ్వర్యాన నడుస్తున్న జెన్‌కో థర్మల్ ప్లాంట్లలో ఉత్పత్తి కూడా నిలిపివేయాల్సిన పరిస్థితి నెలకొంది. పరిస్థితి ఇలా ఉన్నా ఇంకా కొత్త ఒప్పందాలు చేస్తూనే ఉన్నారు. గత ప్రభుత్వంలో విద్యుత్ సంస్థలు సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీతో) 7 వేల మెగావాట్ల (మెవా)కు ఒప్పందం కుదుర్చుకున్నాయి. అదేవిధంగా ఇటీవల యాక్సిస్ కంపెనీకి చెందిన 600 మెవా ఒప్పందానికి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ఉత్తర్వులు విడుదల చేసింది. ఇప్పుడు పిఎం కుసుమ్ కింద కూటమి ప్రభుత్వంలో 3,725 మెవాలకు డిస్కమ్‌లు ఒప్పందాలు చేసుకునేందుకు సిద్ధమయ్యాయి. ఇటీవలే ఎపిఇఆర్‌సి వీటిపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. ఈ ఒప్పందాలు మొత్తం అమల్లోకి వస్తే భారీగా మిగులు విద్యుత్ ఉంటుందని, ఆ సమయంలో విద్యుత్ సంస్థల పరిస్థితి ఏంటనే ఆందోళన విద్యుత్ నిపుణులు, అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

డిస్కమ్‌లు ఇప్పటికే సుమారు 23 వేల మెగావాట్లకు ఒప్పందాలు చేసుకున్నాయి. ఒప్పందానికి తగ్గ డిమాండ్ ఇప్పటి వరకు రాలేదు. ఈ ఏడాది వేసవిలో 13 వేల మెగావాట్లకు గ్రిడ్ డిమాండ్ చేరుకుంది. రాష్ట్ర చరిత్రలో ఇప్పటి వరకు ఇదే అత్యధికం. నిరంతరం అందుబాటులో ఉండే థర్మల్ విద్యుత్ ఒప్పందాలు కేవలం 9 వేల మెగావాట్లలోపే ఉన్నాయి. మిగిలిన వాటిల్లో ఎక్కువగా సోలార్, పవన ఒప్పందాలు ఉన్నాయి. వేసవిలో మాత్రమే 11 వేల నుంచి 13 వేల మెగావాట్ల వరకు గ్రిడ్ డిమాండ్ ఉంటుంది. చలికాలంలో 8 వేల నుంచి 9 వేల మెగావాట్ల వరకు, మిగిలిన రోజుల్లో 9 వేల నుంచి 10 వేల మెగావాట్ల వరకు డిమాండ్ ఉంటుంది. విద్యుత్ వాడకం ఎక్కువగా ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 7 నుంచి 11 గంటల వరకు ఉంటుంది. ఈ సమయంలో పీక్ డిమాండ్ ఉంటుంది. పీక్ సమయంలో ఒప్పందాలు చేసుకున్న సోలార్ విద్యుత్ అందుబాటులో ఉండకపోవడంతో బహిరంగ విద్యుత్ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిందే. యూనిట్‌కు సుమారు రూ.10 పెట్టి కొంటున్న పరిస్థితులు ఉన్నాయి. ఈ అధిక ధరలే వినియోగదారులపై పడుతున్నాయి. 2024-25లో 5,282 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను మార్కెట్ నుంచి డిస్కమ్‌లు కొనుగోలు చేశాయి. సెకీతో చేసుకున్న 7వేల మెగావాట్లతో విద్యుత్‌లో కొంత జనవరి నుంచి అందుబాటులోకి వస్తుందని డిస్కమ్‌లు చెబుతున్నాయి. 1000 మెగావాట్లు వచ్చే ఏడాది జనవరి నుంచి, 167 మెగావాట్లు మార్చి నుంచి, 2,508 మెగావాట్లు డిసెంబర్ నుంచి వస్తుందని ప్రకటించాయి. సెకీ 7వేల మెగావాట్లు, పిఎం కుసుమ్ 3,725 మెగావాట్లు అందుబాటులోకి వస్తే సుమారు 8 వేల వరకు మిగులు విద్యుత్ ఉండే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వీటిని ఎలా సర్దుబాటు చేయాలో అర్థం కావడం లేదంటున్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా రామ్మోహన్, ప్రసన్నకుమార్

- 68 మందితో రాష్ట్ర కమిటీ



పి.రామ్మోహన్



కె.ప్రసన్నకుమార్

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్ తిరిగి ఎన్నికయ్యారు. తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో మూడు రోజులపాటు జరిగిన ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభ ఆదివారం ముగిసింది. 68 మందితో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఉపాధ్యక్షులుగా భగత్ రవి, ఒ.పరమేష్, జి.పల్లవి, సిహెచ్ వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా డి.రాము, వెంకటరమణ, శిరీష, సూరిబాబు, ప్రసాద్ సమీర్, ఎంఆర్ నాయక్, రంగప్ప ఎన్నికయ్యారు. నెల్లూరు జిల్లాలో గంజాయి గూండాల చేతిలో హత్యకు గురైన పెంచలయ్య స్ఫూర్తితో 'డ్రగ్స్ అంతం... ఎస్ఎఫ్ఐ పంతం' నినాదాన్ని తీసుకున్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అడ్డుకుంటాం

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్ చెప్పారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ మహాసభ విజయవంతమైందన్నారు. రాష్ట్రంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యార్థులపై జరుగుతున్న దాడులపై మహాసభలో చర్చించామని తెలిపారు. మొత్తం 19 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించినట్టు చెప్పారు. నూతన జాతీయ విద్యా విధానం పాఠశాలల వినాశనానికి దారితీస్తోందన్నారు. రాష్ట్రంలో 15 వేల ప్రభుత్వ పాఠశాలల ఏకోపాధ్యాయ ఉపాధ్యాయులతోనే నడుస్తున్నాయన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక వసతులు సరిలేక అనారోగ్యం బారిన పడి ఎనిమిది మంది విద్యార్థులు మృతి చెందారని, వారి మరణం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన కూడా విడుదల చేయకపోవడం దారుణమని అన్నారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 3,500 అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని, బలవర్ధకమైన మధ్యాహ్న భోజనం అందించాలని కోరారు. అర్హులైన వారిలో 40 శాతం మందికి తల్లికి వందనం పథకం డబ్బులు అందలేదని, తల్లుల ఖాతాలో వెంటనే డబ్బులు జమచేయాలని, అన్ని పాఠశాలల్లో ఆర్‌ఒ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని, నాణ్యమైన తాగునీరు అందించాలని, యూనివర్సిటీల్లో ర్యాగింగ్ నిరోధక కమిటీలు వేయాలని డిమాండ్ చేశారు.

మత విద్వేషాన్ని నిర్మూలిద్దాం

- తమిళనాడులో సిపిఎం పాదయాత్రలో నాయకుల పిలుపు
- ప్రజల నుంచి విశేష స్పందన
- 300 కిమీ మేర 9 రోజుల పాటు సాగనున్న యాత్ర



మయిలాడుతురై జిల్లాలో ఆదివారం సాగుతున్న పాదయాత్ర

మయిలాడుతురై : మతతత్వానికి వ్యతిరేకంగా.. రాష్ట్ర హక్కుల కోసం తమిళనాడులో సిపిఎం పాదయాత్రను ప్రారంభించింది. ఈ సందర్భంగా 'మత విద్వేషాన్ని నిర్మూలిద్దాం : ప్రజల ఐక్యతను బలోపేతం చేద్దాం : రాష్ట్ర హక్కులను కాపాడుకుందాం' అని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. తొమ్మిది రోజుల పాటు 300 కిలోమీటర్లు జరిగే ఈ పాదయాత్ర తరంబాడి తాలూకాలోని తిల్లాయడిలో ఆదివారం ఉత్సాహంగా ప్రారంభమయింది. మతతత్వానికి, బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఆదివారం ముందుగా గ్రామంలోని వల్లియమ్మాళ్ మెమోరియల్ వద్ద మహాత్మా గాంధీ, థిల్లయాడి వల్లియమ్మాళ్ విగ్రహాలకు సిపిఎం నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించిన తరువాత పార్టీ జిల్లా విభాగం ఈ పాదయాత్రను ప్రారంభించింది.

పాదయాత్ర లక్ష్యాలను వివరించడానికి తిల్లాయడి మండపం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు పార్టీ యూనియన్ కార్యదర్శి ఎ రవిచంద్రన్ అధ్యక్షత వహించారు. ఈ సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.శామ్యూల్‌రాజ్, జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసన్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి సింగరవేళన్ ప్రసంగించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లా యూనియన్ కమిటీ సభ్యులు, శాఖా కార్యదర్శులు, పార్టీ సభ్యులు, మద్దతుదారులు పాల్గొన్నారు. బాణసంచా కాల్చడం, కార్యకర్తల నినాదాల మధ్య కె.శామ్యూల్ రాజ్ ఎర్ర జెండాను ఎగురవేసి పాదయాత్రను ప్రారంభించారు. తొలిరోజున తిల్లయాడి నది ఒడ్డు, తిరువిడైకళి, కొంగరాయన్ మండపం, ఎరవంచెరి, తిరువిలైయట్టం, అరుంబాక్కం, పనంగుడి, నల్లడై మీదుగా సాగిన యాత్ర ఇలుప్పూర్ వద్దకు చేరుకుంది. ఇక్కడ బహిరంగ సభతో తొలిరోజు పాదయాత్ర ముగిసింది.

బిజెపి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబిన్



న్యూఢిల్లీ : బిజెపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బీహార్ మంత్రి నితిన్ నబిన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. నితిన్ నబీన్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ పార్టీ పార్లమెంటరీ బోర్డు ఆమోదం తెలిపిందని, ఆయన నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నితిన్ నబిన్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. నితిన్ శక్తి, అంకితభావం రాబోయే కాలంలో పార్టీని బలోపేతం చేస్తాయనే విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్‌షా ఫోన్ ద్వారా నబిన్‌ను అభినందించారు. నబిన్ గత 20 ఏళ్ల నుంచి బిజెపిలో పనిచేస్తున్నారు. ఐదుసార్లు బీహార్ అసెంబ్లీకి ఎమ్మెల్యేగా ఎన్నికైన నబిన్ ప్రస్తుతం ఆ రాష్ట్ర న్యాయ, పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు.

మామిడి రైతులకు మొండిచెయ్యి

- గుజ్జు ఫ్యాక్టరీలు తీవ్ర అన్యాయం
- కిలోకు రూ.8కుగానూ రూ.4, రూ.5 చెల్లింపు
- ఐదు నెలలుగా కాళ్లరిగేలా తిరుగుతున్న రైతులు
- 22న చిత్తూరు, తిరుపతి కలెక్టరేట్ల ముట్టడికి సమాయత్తం



మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని ఆందోళన చేస్తున్న రైతులు (ఫైల్)

ప్రజాశక్తి- యాదమరి (చిత్తూరు జిల్లా)

రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులకు ఇచ్చిన హామీ అమలు నోచుకోవడం లేదు. దీంతో, డబ్బుల కోసం రైతులు మామిడి గుజ్జు ఫ్యాక్టరీల చుట్టూ కాళ్లరిగే తిరగాల్సి వస్తోంది. వెంటనే ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. ఈ నెల 22న చిత్తూరు, తిరుపతి కలెక్టరేట్ల ముట్టడికి సమాయత్తం అవుతున్నారు. గత మామిడి సీజన్ ఆలస్యంగా జూన్, జులైల్లో ప్రారంభమైంది. గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగారు. దీంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. రైతులతోనూ, మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులతోనూ వేర్వేరుగా సమావేశమయ్యారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తోతాపురి రకానికి కిలోకు రూ.12 ధర ప్రకటించారు. ఇందులో ఎనిమిది రూపాయలు మామిడి గుజ్జు పరిశ్రమలు చెల్లిస్తాయని, మిగిలిన నాలుగు రూపాయలు రైతుల బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందని హామీ ఇచ్చారు. కిలోకు రూ.8 ధర ఇవ్వని పరిశ్రమలను మూయించేస్తామని ఈ సందర్భంగా యజమాను లను ఈ సందర్భంగా చంద్రబాబు హెచ్చ రించారు. చివరి కిలో వరకూ కొనుగోలు చేసి రైతు లకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తోతాపురి రకం మామిడికి గుజ్జు పరిశ్రమలు కిలోకు రూ.8 కచ్చితంగా చెల్లించాలని అనంతరం ప్రభుత్వ ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గత సీజన్లో మామిడి దిగుబడి ఆశాజనకంగా వచ్చింది. 34 ఫ్యాక్టరీలు 31,929 మంది మిగతా 7లో



ఇంధన సంరక్షణ అవార్డు ప్రదానం

- రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్న ఎస్‌పిడిసిఎల్ సిఎమ్‌డి శివశంకర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంధన పరిరక్షణ, సామర్థ్యంలో రాష్ట్రం సాధించిన జాతీయ ఇంధన సంరక్షణ అవార్డు-2025ను రాష్ట్రపతి చేతుల మీదుగా ఎస్‌పిడిసిఎల్ సిఎమ్‌డి ఎల్ శివశంకర్ అందుకున్నారు. జాతీయ ఇంధన సంరక్షణ దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. స్టేట్ డెసిగ్నేటెడ్ ఏజెన్సీ (ఎస్‌డిఎ) విభాగం గ్రూప్-2లో మొదటి బహుమతిని రాష్ట్రం సాధించింది.

ఆస్ట్రేలియాలో జడలు విప్పిన జాత్యహంకారం

- బాండీ బీచ్‌లో ఉన్మాద కాల్పులు
- 11 మంది మృతి, 29 మందికి గాయాలు

సిడ్నీ : ఆస్ట్రేలియాలో జాత్యహంకారం మరోమారు జడలు విప్పింది. సిడ్నీలోని బాండీ బీచ్‌లోకి చొరబడిన ఇద్దరు సాయుధులు విచక్షణరాహిత్యంగా కాల్పులు జరపడంతో 11 మంది అక్కడికక్కడే చనిపోయారు. మరో 29 మంది గాయపడ్డారు. అనంతరం పోలీసులు జరిపిన కాల్పుల్లో ఒక సాయుధుడు చనిపోయాడు. మరో సాయుధుడు నవీద్ అక్రమ్ (24)ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు. జాత్యహంకారంతోనే ఈ కాల్పులకు పాల్పడినట్లు భావిస్తున్నారు. స్థానిక కాలమానం ప్రకారం.. ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు ఈ దారుణం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం ప్రకారం.. పర్యాటకులు ఉల్లాసంగా గడుపుతున్న సమయంలో.. నల్లటి ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు షాట్‌గన్స్‌తో బీచ్‌కు సమీపంలోని క్లబ్ పక్కనే ఉన్న పాదచారుల వంతెనపైకి చేరుకొని కాల్పులు జరిపారు. కాల్పుల్లో 11 మంది పర్యాటకులు చనిపోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. వెంటనే రంగంలోకి క్షతగాత్రులను కాపాడేందుకు హెలికాప్టర్లు, 30 అంబులెన్స్‌లు ఘటనా స్థలానికి చేరుకొన్నాయి. బాండి బీచ్‌లో యూదులు జరుపుకొంటున్న హనుక్కా వేడకలను దుండగులు లక్ష్యంగా చేసుకున్నారు. ఈ ఘటనపై ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తాను ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీస్ కమిషనర్, న్యూసౌత్‌వేల్స్ ప్రీమియర్‌తో మాట్లాడినట్లు వెల్లడించారు.

దుండగుడితో పోరాడిన పౌరుడు..

బీచ్‌లోకి చొరబడిన దుండగులు విచ్చలవిడిగా కాల్పులు జరుపుతున్న వేళ ఓ స్థానికుడు వారిని అడ్డుకున్నాడు. ఓ సాయుధుడిని వెనుక నుంచి వెళ్లి బలంగా పట్టుకొని అతడి చేతిలో గన్‌ను లాగేసుకొన్నాడు. ఆ తర్వాత చేతికందిన వాటితో అతడిని తరిమికొట్టాడు. దీంతో అతడితో ఉన్న మరో దుండగుడు కూడా వెనక్కి తగ్గాడు. ఈ వీడియో వైరల్‌గా మారింది.

పొందూరు ఖాదీకి జిఐ ట్యాగ్‌పై అచ్చెన్నాయుడు హర్షం



ప్రజాశక్తి - కోటబొమ్మాళి

పొందూరు ఖాదీకి జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్ (జిఐ) ట్యాగ్ 1049 రావడంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పొందూరు ఖద్దరుకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు దక్కేలా నిర్ణయం వెలువరించడం టిడిపి కూటమి ప్రభుత్వ విజయంగా అభివర్ణించారు. జిఐ ట్యాగ్‌తో నకిలీలు నివారించవచ్చని, నేతన్నల వస్త్రాల ఎగుమతులు ఇకపై సులభ సాధ్యమని అభిప్రాయపడ్డారు. ఉపాధి అవకాశాల మెరుగుదలకు, ఖాదీ వస్త్రాల బ్రాండింగ్‌కు మరిన్ని అవకాశాలు దక్కుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నేతన్నలకు సుదీర్ఘ కాలంగా జిఐ ట్యాగ్ విషయమై ఉన్న కల సాకారం కావడం గొప్ప మలుపుగా పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

భిన్నత్వంలో ఏకత్వమే రాజ్యాంగ స్ఫూర్తి

- హైకోర్టు రిటైర్డు జడ్జి కె.చంద్రు
- ఐలు, జెవివి ఆధ్వర్యంలో 'అనంత'లో సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి కె.చంద్రు

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

'భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ గొప్పదనం. ఇదే భారత రాజ్యాంగ స్ఫూర్తి. ఇందుకు విరుద్ధంగా మతతత్వం పేరుతో మనుషుల మధ్య విభజన తెచ్చి ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలను ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి చేస్తున్నాయి' అని రిటైర్డ్ హైకోర్టు జడ్జి కె.చంద్రు పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో 'ఇన్ డిఫెన్సు ఆఫ్ ఇండియన్ కాన్స్టిట్యూషన్' అన్న అంశంపై ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు), జన విజ్ఞాన వేదిక (జెవివి) సంయుక్త ఆధ్వర్యంలో సదస్సును ఆదివారం నిర్వహించారు. అనంతపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురుప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జస్టిస్ చంద్రు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆర్‌ఎస్‌ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రాజ్యాంగాన్ని మార్చేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నాయని వివరించారు. గాంధీ పేరు కన్పించకూడదన్న ఉద్దేశంతో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం పేరును పూజ్య బాపూ గ్రామీణ రోజ్‌గార్ యోజనగా మార్చారన్నారు. రాజ్యాంగ పరిరక్షణలో కీలకంగా వ్యవహరించాల్సిన న్యాయ వ్యవస్థ కొన్ని చోట్ల పాలకులకు అనుకూలంగా వ్యవహరిస్తుండటం శోచనీయమన్నారు. పాలస్తీనాకు మద్దతుగా ముంబయి సిపిఎం ఒక సభను నిర్వహించాలని చూస్తే అక్కడి పోలీసు అధికారులు అనుమతినివ్వలేదని గుర్తు చేశారు. కర్ణాటకలో హిజాబ్ విషయంలోనూ ఇదే స్పష్టంగా కనిపిస్తోందన్నారు. దేశంలో ఇలాంటి ఘటనలూ అనేకమున్నాయని వివరించారు. ఇవి భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం కల్పించడమే అవుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాణ సమయంలోనే రాజ్యాంగ పరిషత్‌లో అత్యధికులు హిందువులే ఉన్నప్పటికీ భారత దేశం లౌకికంగా ఉండాలని నిర్ణయించారని గుర్తుచేశారు. అందుకు అనుగుణంగానే రాజ్యాంగ నిర్మాణం జరిగిందన్నారు. ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలని పాలకులు చూస్తున్నారన్నారు. జెఎన్‌యు విద్యార్థి ఉమర్ ఖాలీద్‌ను ఐదేళ్లగా జైల్లో పెట్టిన ఉదంతమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వం ఉండటం కారణంగానే దేశం సమిష్టిగా నడుస్తోందని వివరించారు. రాబోయే రోజుల్లో దేశంలో ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం, బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ఐలూ జాతీయ కార్యదర్శి నర్ర శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటస్వామి, నాయకులు నరసింహ, మానవ హక్కుల వేదిక నాయకులు చంద్రశేఖర్, ప్రముఖ వైద్యులు వంశీకృష్ణ, జెవివి జిల్లా కార్యదర్శి వీరరాజు, ఐలూ నాయకులు సతీష్, వీర పాల్గొన్నారు.


ఎంబి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

ప్రజలను వర్గ పోరాటాల వైపు నడిపిన మేధావి ఎంబి

- మాకినేని బసవపున్నయ్య జయంతిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలను వర్గ పోరాటాల వైపు నడిపిన మేధావి మాకినేని బసవపున్నయ్య అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. అవినీతి, అక్రమాలు లేకుండా మార్క్సిస్ట్ ఆలోచన ధోరణితో శాస్త్రీయమైన సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేశారని అన్నారు. బసవపున్నయ్య 111వ జయంతి కార్యక్రమం విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. విజ్ఞాన కేంద్రం ఇన్‌చార్జ్ తులసిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. చదువుకుంటున్న రోజుల్లోనే బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా బసవపున్నయ్య పోరాటం చేసి కళాశాల నుంచి బహిష్కరణకు గురయ్యారని చెప్పారు. కరడుగట్టిన కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేశారని తెలిపారు. వ్యవసాయ కార్మికులను కూడగట్టి భూమికోసం, కనీస వేతనాల కోసం పోరాడారని చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నాయకత్వ పాత్ర వహించి దిశానిర్దేశం చేశారని తెలిపారు. అంతర్జాతీయంగా కార్పొరేట్ శక్తుల దాడి, అనేక ఒత్తిళ్లను ఎదుర్కొని కమ్యూనిస్టు ఉద్యమం నిలబడటానికి కారణం బసవపున్నయ్య అందించిన సిద్ధాంతం అని తెలిపారు. గత 35 ఏళ్లలో సమాజంలో అనేక అసమానతలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి అంశంలోనూ మతోన్మాదం విజృంభిస్తోందని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమానికి చిహ్నంగా నిలిచిన వందేమాతరం గేయాన్ని కూడా మతం రంగు పులిమి తద్వారా ఘర్షణలను పెంచేందుకు ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్‌పరివార్ కుట్రలు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో హిందూ, ముస్లిముల ఐక్యతకు తోడ్పడిన వందేమాతరం నినాదాన్ని ఇప్పుడు విభజన కోసం ఉపయోగిస్తున్న తీరు దేశ భద్రతకు ఆందోళనకరమని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బసవపున్నయ్య వంటి సిద్ధాంతవేత్తలు, పోరాట యోధులు సమాజానికి అవసరమని చెప్పారు. భూములు కాపాడుకునే కర్తవ్యం ప్రధానంగా ముందుకొచ్చిందన్నారు. భూ సంస్కరణల పేరుతో పేదలు, రైతుల నుంచి పాలకులు భూములు లాక్కొని కార్పొరేట్లకు అప్పగిస్తున్నారని తెలిపారు. 'మా భూమి - మా హక్కు' నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా పెద్దయెత్తున భూపోరాటాలు నిర్వహించాలని చెప్పారు. ఇందుకు రైతు, వ్యవసాయ, కార్మిక ఉద్యమాలు సంసిద్ధం కావాలని, ఇదే బసవపున్నయ్యకు నివాళి అని తెలిపారు.

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి రమాదేవి మాట్లాడుతూ.. బసవపున్నయ్య స్ఫూర్తితో ప్రజలపై దాడులు చేస్తున్న కార్పొరేట్ శక్తులను ఎదుర్కొనాలని చెప్పారు. లేబర్ కోడ్ల పేరుతో కార్మికవర్గం సాధించుకున్న హక్కులను కాలరాస్తూ చట్టం తీసుకొచ్చారని తెలిపారు. పోరాటాలతో కార్మికవర్గం తమ హక్కులను కాపాడుకోవాలని కోరారు. ఎంబి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి మురళీకృష్ణ వందన సమర్పణ చేసిన ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, బి తులసీదాస్, వి రాంభూపాల్, వి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, జయరామ్, ఎంబివికె బాధ్యులు యువి రామరాజు, టి.క్రాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణలో పాల్గొన్న తెలకపల్లి రవి, ఎంవిఎస్ శర్మ, సత్యాజి, కెంగార మోహన్, శాంతిశ్రీ, సుధా, సత్యరంజన్, రఘుబాబు తదితరులు

సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణలు

ప్రజాశక్తి - విజయవాడ

విజయవాడ ఎంబివికె భవనంలో సాహితీ స్రవంతి రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో సాహితీ స్రవంతి, జన విజ్ఞాన వేదిక విజయనగరం సంయుక్తంగా ప్రచురించిన 'గురజాడ యుగస్వరం ఎందుకని' పుస్తకాన్ని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి ఆవిష్కరించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ కవిత్వీకరించిన దీర్ఘ కవిత దు:ఖసంచారి కవిత్వాన్ని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ ఆవిష్కరించారు. పుస్తకాన్ని జంధ్యాల రఘుబాబు పరిచయం చేశారు. ఈ ఆవిష్కరణ సభలో సాహిత్య ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ కె.సత్యాజి, సాహితీ స్రవంతి రాష్ట్ర నాయకులు శాంతిశ్రీ, సుధా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్య రంజన్ పాల్గొన్నారు.

నెల్లూరు మేయర్ రాజీనామా సమర్పణ

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు మేయర్ స్రవంతి ఆదివారం తన రాజీనామా పత్రాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వాట్సాప్ ద్వారా పంపారు. ఆ కాపీని తమ అనుచరులతో కలెక్టరేట్‌లో అందజేశారు. టిడిపి నాయకులు స్పీడ్ కావడం, కార్పొరేటర్లను క్యాంపునకు తరలించడం, భారీ తాయిలాలతో ఎక్కడికక్కడ కార్పొరేటర్లను లాక్ చేయడంతో వైసిపి నేతల సలహాతో శనివారం రాత్రి తాను రాజీనామా చేస్తున్నట్లు ఆమె ప్రకటించారు. విజయం సాధించలేమని తెలియడంతో అవిశ్వాస సమావేశానికి అవకాశం లేకుండా చేశారు. కలెక్టర్ అమోదం తెలిపిన వెంటనే డిప్యూటీ మేయర్‌గా బాధ్యతలు తీసుకుంటారు. తర్వాత నూతన మేయర్ ఎన్నిక జరగనుంది.

గొల్లప్రోలులో ప్రశాంతంగా ప్రార్థనలు

- చర్చిల వద్ద పోలీసుల బందోబస్తు

ప్రజాశక్తి - గొల్లప్రోలు(కాకినాడ ప్రతినిధి)

కాకినాడ జిల్లా గొల్లప్రోలు నగర పంచాయతీ లోని కొత్తపేట ప్రాంతంలో అధికారుల అనుమతితో క్రైస్తవులు ఆదివారం ప్రార్థనలను ప్రశాంతంగా నిర్వహించుకున్నారు. ఈ నెల 7న కొత్తపేట ప్రాంతంలోని రెండు చర్చిల్లో క్రైస్తవులు నిర్వహించుకుంటున్న ప్రార్థనలను విహెచ్‌పి నాయకులు అడ్డుకున్నారు. దీంతో క్రైస్తవులు పోలీసులను ఆశ్రయించారు. ఆ సమయంలో కాకినాడ ఆర్‌డిఒ మల్లిబాబు ఘటనా ప్రాంతానికి చేరుకుని నివాస ప్రాంతాల్లో అనుమతి లేకుండా ప్రార్థనలు నిర్వహించరాదంటూ చర్చిలను మూయించేశారు. గ్రామంలో పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి కొత్తపేట ప్రాంతంలోని 13వ వార్డు పరిధిలో 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో క్రిస్మస్ సందర్భంగా చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వాలని క్రైస్తవ పెద్దలు జిల్లా ఉన్నతాధికారులను ఆశ్రయించారు. ప్రార్థనలు నిర్వహించుకునేందుకు శనివారం కొన్ని షరతులతో అనుమతిని అధికారులు ఇచ్చారు. ఎటువంటి వివాదాలూ తలెత్తకుండా పోలీసులు పహరా కాశారు. హిందూ ధర్మ రక్షా సమితి రాష్ట్ర అధ్యక్షుడు చేదులూరి గవరయ్యను ముందస్తుగా గృహనిర్బంధం చేశారు. పట్టణ శివారు అయ్యప్పస్వామి దేవాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. చర్చిలు ఉన్న కొత్తపేట ప్రాంతాన్ని ఎఎస్‌పి దేవారాజ్ పాటిల్, సిఐ జి.శ్రీనివాస్, తహశీల్దార్ రాంకుమార్, ఎస్‌ఐ రామకృష్ణ పరిశీలించారు.


నేవీ మారథాన్‌లో భారీ సంఖ్యలో పాల్గొన్న ఔత్సాహికులు

సాగర తీరంలో ఉత్సాహంగా నేవీ మారథాన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

నేవీ డే వేడుకల్లో భాగంగా విశాఖ సాగరతీరంలో తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 10వ వైజాగ్ నేవీ మారథాన్ ఉత్సాహంగా సాగింది. ఆరోగ్యం, ఫిట్‌నెస్, సామాజిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మారథాన్‌లో దేశ నలుమూలల నుంచి 17,500 మందికిపైగా రన్నర్లు పాల్గొన్నారు. అందులో 17 దేశాల నుండి 35 మంది విదేశీయులు, 3500 మంది మహిళలు ఉండడం విశేషం. రన్నర్ల సామర్థ్యానికి అనుగుణంగా మారథాన్‌ను నాలుగు ప్రధాన విభాగాలుగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున బీచ్ రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద ఫుల్ మారథాన్ (42 కిలోమీటర్లు) పరుగును జెండా ఊపి ప్రారంభించారు. తూర్పు నావికా దళ విభాగాధిపతి, వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా, హాఫ్ మారథాన్ (21 కిలోమీటర్లు)ను నేవీ వెల్ఫేర్ అండ్ వెల్‌నెస్ అసోసియేషన్ అధ్యక్షులు, సిఎన్‌సి సతీమణి ప్రియ భల్లా, 10కె రన్‌ను విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, 5కె రన్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. విజేతలకు రూ.పది లక్షలకుపైగా నగదు బహుమతులు అందించారు.

'ఏ టేల్ ఆఫ్ టూ స్టేట్స్' పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ప్రముఖ జర్నలిస్టు ఐ వెంకట్రావు రచించిన 'ఏ టేల్ ఆఫ్ టూ స్టేట్స్' పుస్తకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆదివారం పుస్తక రచయితలతో కలిసి దీనిని ఆవిష్కరించారు. పరిశోధకులకు, భవిష్యత్తు తరాలకు ఈ పుస్తకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చంద్రబాబు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. 'విలీనం - విభజన' పేరుతో ఈ పుస్తకాన్ని తెలుగులో అనువదించిన ఎన్ అనురాధను సిఎం అభినందించారు.

ప్రైవేటీకరణ విరమించే వరకూ పోరాటం ఆగదు

- మాజీ ఎమ్మెల్యే టిజెఆర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్న కూటమి ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ వైసిపి పోరాటం ఆగదని ఆ పార్టీ ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్ బాబు తెలిపారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు ఉచిత వైద్యం, విద్య అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్న మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడంతో పేదలకు విద్య, వైద్యాన్ని దూరం చేస్తున్నారని విమర్శించారు. సిఎం చంద్రబాబు నిర్ణయం వల్ల 2,450 వైద్య సీట్లు పేదలకు దూరమవుతున్నాయని తెలిపారు. కేంద్ర స్థాయి సంఘం పేరుతో పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు.

క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలి

- అర్జున్ అవార్డు గ్రహీత సతీష్ శివలింగం
- అట్టహాసంగా ఇంటర్ ఐఐటి స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి - ఏర్పేడు (తిరుపతి జిల్లా)

క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, సహనాన్ని ప్రతి రంగంలో కొనసాగించాలని ఇంటర్ ఐఐటి కంటిజెంట్లకు అర్జున్ అవార్డు గ్రహీత సతీష్ శివలింగం పిలుపునిచ్చారు. తిరుపతి ఐఐటి స్పోర్ట్స్ మీట్ ప్రధాన మైదానంలో ఆదివారం ఉత్సాహభరితంగా ప్రారంభ మయ్యింది. 58వ ఇంటర్ ఐఐటి స్పోర్ట్స్ మీట్-2025ను సెక్రటరీతో కలిసి ప్రారంభించి స్పోర్ట్స్ బెలూన్లను ఆకాశంలోకి వదిలారు. ఈ వేడుకల్లో ఐఐటి తిరుపతి హోస్ట్‌గా ఐఐటి హైదరాబాద్, ఐఐటి మద్రాస్ సహకారంతో ఈ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించింది. దేశ నలుమూలల నుంచి 23 ఐఐటిల నుంచి వచ్చిన కంటిజెంట్లు మార్చ్‌పాస్ట్ అందరినీ ఆకట్టుకుంది. అనంతరం వెంకటేశ్ సైనిక్ స్కూల్ బ్యాండ్ దేశభక్తి సంగీత ప్రదర్శన ఇచ్చింది.


కర్రసాము చేస్తున్న విద్యార్థులు

ఐఐటి తిరుపతి స్పోర్ట్స్ సెక్రటరీ పవన్ మశాల్ (టార్చ్) వెలిగించి, దీపప్రజ్వలన చేశారు. అనంతరం ప్రమాణ స్వీకారం జరిగింది. దీనికి ఐఐటి తిరుపతి తరఫున ప్రతినిధి నేతృత్వం వహించగా, అన్ని కంటిజెంట్లు సమైక్యంగా పునరావృతం చేశారు. ఐఐటి తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ ఇంటర్ ఐఐటి క్రీడలు విద్యకు మించి వ్యక్తిత్వం, జట్టు స్ఫూర్తి, సహనం, నాయకత్వంను పెంపొందిస్తాయని అన్నారు.

ఐఐటి విద్యార్థులు క్రీడారంగంలో భాగస్వామ్యం కావాలి : సతీష్ శివలింగం

సతీష్ శివలింగం మాట్లాడుతూ భారతదేశం బహుక్రీడా దేశంగా ఎదుగుతున్న తీరు గురించి ప్రసంశించారు. అనంతరం కర్రసాము, ఇతర నృత్య ప్రదర్శనలతో కూడిన సంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. చివరలో స్పోర్ట్స్ ఆఫీసర్ మార్చ్ పాస్ట్ పోటీ ఫలితాలను ప్రకటించారు. ఈ పోటీలలో శ్రద్ధ, సమన్వయం, క్రమశిక్షణలో అత్యుత్తమంగా ఉన్న కంటిజెంట్లను గౌరవించారు. అనంతరం చదరంగం, టెన్నిస్, వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి.

వసతి గృహ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వసతి గృహ విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. విద్యార్థుల భద్రతకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సత్యసాయి జిల్లా ఓడి చెరువు మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు గాయాలపాలవ్వడంపై ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్‌పి సతీష్ కుమార్‌తో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. వసతి గృహంలో ఉండాల్సిన విద్యార్థులు రోడ్డుపైకి ఎందుకు వచ్చారనే విషయంపై వివరాలు తెలుసుకుని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఘటనలో సాంఘిక సంక్షేమ వసతి గృహంలో 9వ తరగతి చదువుతున్న లక్ష్మీ నరసింహ, 8వ తరగతి చదువుతున్న భార్గవ్ గాయాలపాలయ్యారని పేర్కొన్నారు. తలకు బలమైన గాయం కావడంతో లక్ష్మీ నరసింహను అనంతపురం జిల్లా ఆస్పత్రిలో, భార్గవ్‌కు కదిరి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తున్నారని తెలిపారు. వసతి గృహం సమీపంలోని బైపాస్ రోడ్డులో ఉన్న అయ్యప్ప స్వాములు ఏర్పాటు చేసుకున్న మండపానికి ప్రసాదం కోసం వంట పాత్రలతో ఇద్దరు విద్యార్థులు వెళ్లినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టరుకు సూచించారు. వంట పాత్రలు ఇచ్చి ప్రసాదం ఎవరు తీసుకురమ్మన్నారే విషయాన్ని తెలుసుకోవాలని డిఎస్‌సిడబ్ల్యుఒ రెడ్డి బాలాజీని ఆదేశించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేయాలన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- యుఎంహెచ్‌ఇయు మహాసభలో ఎవి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్యారోగ్య శాఖలోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర 8వ మహాసభ విజయవాడలోని ఎంబివికెలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఖాళీ పోస్టులను వెంటనే శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలన్నారు. ఈ దిశగా యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాచరణ ఉండాలని సూచించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలలను, వైద్యారోగ్య శాఖను ప్రైవేటీకరించాలని చూస్తోందన్నారు. పిపిపి విధానాన్ని విడనాడి వైద్య కళాశాలలను పూర్తి స్థాయిలో ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించాలన్నారు. అనంతరం రాష్ట్రంలో మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో చర్చించారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన భవిష్యత్తు కార్యాచరణను రూపొందించారు. పలు తీర్మానాలు చేశారు. 12వ పిఆర్‌సిని వేయడం, ఐఆర్ ప్రకటించడం, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయడం, ఎంప్లాయీస్ హెల్త్ స్కీం పటిష్టంగా అమలు చేయడం, ఉద్యోగులకు యాప్ భారాన్ని తగ్గించడం వంటి అంశాలపై చర్చించి 12 తీర్మానాలను మహాసభ ఆమోదించింది. గడిచిన కాలంలో యూనియన్ పని విధానంపై కార్యదర్శి, ఆర్థిక లావాదేవీలపై కోశాధికారి నివేదికను ప్రవేశపెట్టగా, ఈ నివేదికలను మహాసభ ఆమోదించింది.

నూతన కార్యవర్గం ఎన్నిక

యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఈ మహాసభల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీలో రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా ఎవి నాగేశ్వరరావు, అధ్యక్షులుగా కె జగన్మోహనరావు, ప్రధాన కార్యదర్శిగా తాళ్లూరు వెంకటేశ్వర్లు, కోశాధికారిగా చుక్కల సత్యనారాయణ, 9 మంది ఉపాధ్యక్షులు, 9 మంది కార్యదర్శులు, 15 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు సహా మొత్తం 36 మందితో నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాలువ పూడ్చి..ప్లాట్లుగా మలిచి..

- అడ్డగోలుగా వెంచర్లు
- 1400 ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకం
- పోడు సాగుకు దూరమైన గిరిజనులు


గుర్లగెడ్డ ప్రాజెక్టు కాలువను పూడ్చివేసి వెంచరు వేసిన స్థలం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉత్తరాంధ్రకు చెందిన రాష్ట్ర మంత్రి అండదండలతో ఎటోర్ సిటీ అనే రియల్‌ఎస్టేట్ సంస్థ ఏకంగా ఓ సాగునీటి ప్రాజెక్టు కాలువను ఆక్రమించి వెంచర్ ఏర్పాటు చేసింది. అంతటితో ఆగలేదు... ఆ సాగునీటి ప్రాజెక్టుకు చెందిన పది ఎకరాల మిగులు భూములను కూడా ఆక్రమించుకుంది. దీంతో 1400 ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. 50 గిరిజన కుటుంబాలు జీవనోపాధి కోల్పోయాయి.

విజయనగరం జిల్లా మెంటాడ మండలం, అల్లూరి జిల్లా అనంతగిరి సరిహద్దులో సుమారు మూడు వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో గుర్ల గెడ్డ సాగునీటి ప్రాజెక్టును 2000 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం రూ.4.28 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టింది. 90 శాతం పనులు పూర్తయినప్పటికీ అటవీ శాఖ అభ్యంతరాల వల్ల మిగతా పనులు నిలిచిపోయాయి. ఈ సంగతి కాస్త అటుంచితే... 1400 ఎకరాలకు సాగునీరందించే ఎడమ కాలువకు ఆనుకుని ఎటోర్ అనే రియల్ ఎస్టేట్ సంస్థకు కొంత భూమి ఉంది. ఏడాది క్రితం ఆ యజమాని ఈ కాలువను ఆక్రమించి కొబ్బరి మొక్కలు నాటారు. తాజాగా ఆ మొక్కలను తొలగించి వెంచర్ వేశాడు. దీంతో, ఈ కాలువ జలాశయానికి 300 మీటర్ల వరకు ఉన్న అక్విడెక్టు నిలిచిపోతుంది. ఫలితంగా మెంటాడ మండలంలోని చీపురువలస, వానిజ, గుర్ల, తమ్మిరాజుపేట, పిట్టాడ, కుపానాయుడు వలస, అనంతగిరి మండల పరిధిలోని రొంపిల్లి, కరకవలస, తదితర గ్రామాలకు సాగునీరు అందే పరిస్థితి లేదు. మరోవైపు ప్రాజెక్టుకు ఆనుకుని ఉన్న సుమారు పది ఎకరాల మిగులు భూముల్లో అనంతగిరి మండలం రొంపిల్లి పంచాయతీ పరిధిలోని రొంపల్లి, కరకవలస గ్రామాలకు చెందిన గిరిజనులు పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందేవారు. ఈ భూమిపై కూడా ఎటోర్ సంస్థ కళ్లు పడ్డాయి. ఇటీవలే వీరిని ఇక్కడి నుంచి ఖాళీ చేయించి బుల్డోజర్లతో చదువును చేయించింది. ఈ నేపథ్యంలో కరకవలస గిరిజనులను 'ప్రజాశక్తి' కలవగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. 'చాన్నాళ్లుగా అక్కడే వరి, అలసందర్లు, కందులు, బొబ్బర్లు ఇతర పంటలు సాగుచేసేవాళ్లం. ఈ మధ్యకాలంలో ఖాళీచేసి వెళ్లపోమన్నారు' అంటూ బాధితురాలు గన్ని చిట్టెమ్మ, అర్జపు పోలమ్మ అనే గిరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. 'మమ్మల్ని కొండపైకి వెళ్లిపోమంటున్నారు' అంటూ మరికొందరు ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణదారుడికి ఉత్తరాంధ్రలోని ఓ మంత్రి అండదండలు పుష్కలంగా ఉన్నట్టు చర్చ నడుస్తోంది.

సర్వే చేయించి చర్యలు తీసుకుంటాం

కాలువ ఆక్రమణ తమ దృష్టికి వచ్చింది. ఇదే విషయమై తహశీల్దార్‌కు తెలియజేయడంతోపాటు సర్వే చేయించి, తమ కాలువ గుర్తించాలని కూడా లెటర్ రాశాను. రెండు మూడు రోజుల్లో సమస్య కొలిక్కివస్తుంది.

నవీన్, గుర్లగెడ్డ ప్రాజెక్టు డిఇ

బాపట్ల జిల్లాలో దారుణం

- భార్యను హత్య చేసిన భర్త
- మృతదేహాన్ని బైకుపై పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి లొంగిపోయిన వైనం

ప్రజాశక్తి-సంతమాగులూరు (బాపట్ల జిల్లా)

బాపట్ల జిల్లాలో ఆదివారం దారుణం జరిగింది. భార్యను భర్త హత్య చేసి ఆమె మృతదేహంతో బైకుపై పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయిన ఘటన కలకలం రేపింది. మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామ ఎస్‌సి కాలనీకి చెందిన అల్లడి వెంకటేష్‌కు మాచవరం గ్రామానికి చెందిన మహాలక్ష్మికి (28) తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. వెంకటేష్ బేకరీలో పనిచేస్తుంటారు. వివాహమైన నాటి నుంచి వెంకటేష్‌తో పాటు అయన అక్కలు రమణ, శబరి, తన అన్న శ్రీను మహాలక్ష్మిని వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో వేధింపులు ఎక్కువవడంతో రెండు నెలల క్రితం మహాలక్ష్మి మాచవరంలోని తన తల్లి దగ్గరికి వెళ్లిపోయారు. వెంకటేష్ గత శనివారం రాత్రి ఆమె వద్దకు వెళ్లి మన ఇంటికి వెళదామని భార్యతో నమ్మబలికారు. ఆదివారం వేకువజామున ఆమెను తన మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం మాచవరం గ్రామ పరిధిలోని ఎన్‌ఎస్‌పి కాలువ సమీపంలోకి రాగానే మహాలక్ష్మిని బైక్ మీద నుంచి కింద పడవేసి ఆమె ధరించిన చలి కోటు లేస్‌తో మెడ భాగం బిగించి దారుణంగా హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని బైక్‌పై వేసుకొని సంతమాగులూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి పోలీసులకు లొంగిపోయారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారని రొంపిచర్ల పోలీసులు తెలిపారు.

ట్రేడ్ యూనియన్ ఉద్యమ నిర్మాణంలో తొలి అడుగులు

విశాలమైన భారత ఉపఖండంలో వలస పాలన వల్ల తీవ్ర అసమానతలు ఏర్పడ్డాయి. బెంగాల్‌లో కలకత్తా, మహారాష్ట్రలో బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీలోని మద్రాసు నగరాలు దేశ ఆర్థిక, రాజకీయ కార్యకలాపాలకు ప్రధాన కేంద్రాలై బయట ప్రపంచానికి, ప్రపంచ పెట్టుబడిదారీ మార్కెట్‌కు ముఖద్వారాలయ్యాయి. 1905లో బెంగాల్ విభజన వల్ల ప్రజల్లో రగుల్కొన్న ఆగ్రహ జ్వాల జాతీయ వెల్లువగా పరిణమించింది. జాతీయ కాంగ్రెస్ నాయకత్వం దాదాభాయి నౌరోజి, సురేంద్రనాథ్ బెనర్జీ వంటి మితవాదుల చేతుల్లో నుంచి అతివాదులు బాలగంగాధర తిలక్, లాలా లజపతిరాయ్ చేతుల్లోకి వచ్చింది. ఈ రాజకీయ పరిణామాలు భారత కార్మికవర్గం ఆర్థిక పోరాటాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు, ఉద్యమాలను తీవ్రతరం చేసేందుకు సానుకూల పరిస్థితులను ఏర్పరిచాయి. 20వ శతాబ్ది ప్రారంభంలో పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. 1914 నాటికి దేశంలో పారిశ్రామిక కార్మికుల సంఖ్య 9,50,973కు చేరింది.


1905లో కలకత్తాలో వెల్లువెత్తిన కార్మిక ఆందోళనలు

స్వదేశీ ఉద్యమం ప్రభావంతో బెంగాల్‌లో కార్మికవర్గం అనేక పోరాటాలు సాగించింది. భారత రాజకీయ చరిత్రలో, జాతీయ బూర్జువావర్గ నినాదాలతో నిర్వహించిన సంఘటితమైన, చైతన్యయుతమైన ప్రజా ఉద్యమంగా పరిణతి చెందింది. కలకత్తాలోని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ప్రెస్‌లో పనిచేసే సుమారు రెండు వేల మంది కార్మికులు ఆదివారాలకు, ప్రకటించిన సెలవు రోజులకు జీతాలివ్వాలని తదితర సమస్యలపై నెలరోజులపాటు సమ్మె చేశారు. అనంతరం బెంగాల్ సెక్రటేరియట్ ప్రెస్ కార్మికులు కూడా సమ్మెలో చేరారు. ఆర్థిక శాఖ అండర్ సెక్రటరీ రైనీని కార్మికుల సమస్యలపై దర్యాప్తు చేసేందుకు బెంగాల్ ప్రభుత్వం నియమించినా, ఆ కమిటీ దర్యాప్తు న్యాయంగా జరగలేదని అమృత్ బజార్ పత్రిక రాసింది. విచారణ అనంతరం ఒప్పందం కుదిరింది. ఆ వెంటనే ఏడుగురు కార్మికులను విధుల నుంచి తొలగించి, అరెస్టు చేయించడంతో సమ్మె ప్రారంభమైంది. స్వదేశీ ఉద్యమ నాయకులు మద్దతివ్వడంతో బ్రిటీష్ ప్రభుత్వం సమ్మె విచ్ఛిన్నానికి పూనుకుంది. బెంగాల్ ట్రేడ్ యూనియన్ నాయకుల్లో మొదటి తరానికి చెందిన ఎకె ఘోష్ ఆ సమ్మెకు నాయకత్వం వహించారు. ఆ తరువాత కార్మికుల సమావేశంలో యూనియన్ నిర్మించాలని నిర్ణయించారు. దేశంలో తొలిసారి ప్రారంభమైన ట్రేడ్ యూనియన్లలో బెంగాల్ ప్రెస్ వర్కర్ల యూనియన్ ఒకటి. ఇది 1905 అక్టోబర్ 21న ఆవిర్భవించింది. ఈ తరువాత కొన్ని సమస్యలు పరిష్కారం కావడంతో కార్మికులు తిరిగి విధుల్లో చేరారు.

సమ్మెల వెల్లువ

1905లో ప్రారంభమైన సమ్మెల వెల్లువ అనేక పారిశ్రామిక సంస్థలను కుదిపేసింది. అదే ఏడాది సెప్టెంబర్‌లో హౌరాలోని బర్న్ అండ్ కంపెనీ కార్మికులు, కలకత్తా ట్రామ్ వే కంపెనీ కార్మికులు సమ్మె చేశారు. కలకత్తా కార్పొరేషన్‌లో దాదాపు రెండు వేల మంది కూలీలు, పారిశుధ్య కార్మికులు జీతాల పెంపుదల కోసం సమ్మె చేసి కొంతమేర విజయం సాధించారు.

ఈస్టిండియా రైల్వేలోని 950 మంది గార్డులు నాటి వేతన విధానానికి వ్యతిరేకంగా అక్టోబర్‌లో సమ్మె చేశారు.

పని పరిస్థితులను మెరుగుపర్చాలని, బ్రిటిష్ యాజమాన్యం తమ పట్ల అవమానకరంగా ప్రవర్తించడం మానుకోవాలని డిమాండ్ చేస్తూ కలకత్తాలో సుమారు వెయ్యి మంది బడ్జ్ బడ్జ్ క్లైవ్ జూట్ మిల్లు కార్మికులు 1906 ఆగస్టులో సమ్మె చేశారు. ఈ సమయంలోనే జూట్ వర్కర్స్ యూనియన్ ఏర్పడింది.

1906 జూన్‌లో కలకత్తాలోని థాకర్‌స్పింక్ అండ్ కంపెనీ ఆధ్వర్యాన నడుస్తున్న ప్రెస్‌లో సమ్మె జరిగింది. బాలగంగాధర తిలక్, కపర్ధీ, డాక్టర్ మున్‌జీ తదితర జాతీయ నాయకులు ర్యాలీలో ప్రసంగించారు. కంపెనీతో ఒప్పందం కుదరడంతో 1906 జూన్ 13న కార్మికులు తిరిగి విధుల్లో ప్రవేశించారు.

1906 జులై నుంచి సెప్టెంబర్ మధ్య ఈస్టిండియన్ రైల్వేలోని బెంగాల్ సెక్షన్‌లో సమ్మెతో హౌరా నుంచి అసన్‌సోల్ వరకూ బర్ధ్వాన్‌తోసహా అన్ని రైల్వే స్టేషన్లు మూతపడ్డాయి. జీతాలు పెంచాలని, పని పరిస్థితులు మెరుగుపరచాలని, వర్ణవివక్షను రద్దు చేయాలని, ప్రాంతీయులు అన్న పదం బదులు భారతీయులు అన్న పదం వాడాలని కార్మికులు డిమాండ్ చేశారు. రైల్వే స్టేషన్లను పోలీసులు ఆక్రమించినా సమ్మె కొనసాగింది. సమ్మెలో పాల్గొన్న ముఖ్య కార్యకర్తలను విధుల నుంచి తొలగించారు. జాతీయోద్యమంతో ప్రత్యక్ష సంబంధం ఉన్న సమ్మెలో ఇది మొదటిది. ప్రముఖ జాతీయ నాయకులు చిత్తరంజన్ దాస్, బిపిన్ చంద్రపాల్ మద్దతుగా నిలిచారు.

1906 డిసెంబర్‌లో బ్రిటిష్ యాజమాన్యంలోని హుగ్లీ జూట్ మిల్లులో రాత్రి షిఫ్టులు ప్రవేశపెట్టడాన్ని, జీతాలు తగ్గించడాన్ని నిరసిస్తూ సమ్మె చేశారు. ఆ సమయంలోనే బెంగాల్ బొగ్గు గని కార్మికులు ట్రేడ్ యూనియన్ చైతన్యం లేకపోయినా సమ్మెలో పాల్గొన్నారు.

1905లో విద్యుత్ దీపాలు రావడంతో బొంబాయిసహా అనేక ప్రాంతాల్లో టెక్స్‌టైల్ సహా అనేక పరిశ్రమల్లో పనిగంటలు విపరీతంగా పెంచడంతో పలు మిల్లుల్లో కార్మికులు సంఘటితంగా పోరాడారు.

1908లో బొంబాయిలో 500 మంది పోస్టుమెన్లు వారం రోజులు సమ్మె చేయడంతో పోస్టల్ సర్వీసులన్నీ స్తంభించిపోయాయి.

అహ్మదాబాద్‌లో ఫ్యాక్టరీల సంఖ్య పెరగడంతో కార్మికులకు కొరత ఏర్పడింది. వేతనాల పెంపుకోసం అనేక పాక్షిక సమ్మెలు జరిగాయి.

లాంక్‌షైర్‌కు చెందిన బ్రిటీష్ పెట్టుబడిదారులు భారత పరిశ్రమల్లో వివాదాలను పరిష్కరించాలని బ్రిటీష్ ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో ఫ్రీయర్ స్మిత్ కమిటీ ఏర్పడింది. కార్మికులను నిర్దాక్షిణ్యంగా దోపిడీ చేస్తున్నారని, వారి గృహవసతి దయనీయంగా ఉందని, రోజుకు 12 గంటలు, వారానికి 72 గంటలకు మించి పని ఉండరాదని 1907 జూన్ 1న ఆ కమిటీ సిఫార్సు చేసింది.

12 గంటల పనిని భారతీయ, బ్రిటీష్ పరిశ్రమల యజమానుల్లో అత్యధికులు వ్యతిరేకించారు. నూలు బట్టలతోపాటు ఇతర పరిశ్రమల్లోని కార్మికుల స్థితి గతులను పరిశీలించేందుకు 1907 సంవత్సరాంతంలో మారిసన్ అధ్యక్షతన ఫ్యాక్టర్ లేబర్ కమిషన్ ఏర్పాటైంది.

భారతీయుల యాజమాన్యంలోని పరిశ్రమల విషయంలో మౌనం వహించడం, బ్రిటీష్ వారి పరిశ్రమల్లో కార్మిక పోరాటాలకు మద్దతు తెలపడం అనే విధానాన్ని నాటి జాతీయోద్యమ నాయకులు అనుసరించారు.

ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

కంప్యూటర్ ఇంటర్‌నెట్

మేధా శ్రమలో పుట్టు
సాంకేతిక సమర్థతంతా
శ్రమేలేనిదే కుదరబోదులే
టెక్నాలజితో నీ ఆర్డర్
తేవాలే మా గిగ్ సోల్జర్



కార్మికోద్యమ యోధులు
పర్సా సత్యనారాయణ




జననం : 2.06.1924
మరణం : 22.05.2015

గుంటూరు జిల్లా కంభంపాడులో జన్మించిన పర్సా సత్యనారాయణ తెలంగాణ రాష్ట్రంలోని సింగరేణి కార్మిక ఉద్యమం లో కీలక పాత్ర పోషించారు. కంపెనీలో యూనియన్ కార్యక్రమాలు పెరుగుతున్న కొద్ది యాజమాన్యం చూపు ఆయనపై పడింది. నిబంధనలు ఉల్లంఘించారనే సాకుతో యాజమాన్యం ఆయనను పనినుండి తొలగించింది. దీంతో కార్మికులు తిరగడటంతో పర్సాకు మళ్లీ ఉద్యోగం ఇవ్వాల్సివచ్చింది. ఆ తరువాత కొంత కాలానికి ఆయన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి యూనియన్ బాధ్యతలు చేపట్టారు. 1946లో మేడేను మొదటిసారి యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 1947 చివర్లో అరెస్ట్ అయిన పర్సా 1949 మార్చిలో ఔరంగాబాద్ జైలు నుండి తప్పించుకున్నారు. తర్వాత మళ్లీ పట్టుబడ్డారు. 1953లో విడుదలయ్యి తెలంగాణ సాయుధపోరాటంలో పాల్గొన్నారు. నిజాం ప్రభుత్వం ఆయన్ను జైలులో పెట్టడమే కాకుండా, నెలల తరబడి చీకటి గదిలో బంధించింది. ఒక దశలో పర్సాను కాల్చివేయాలని నిజాం సైన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన నిబద్ధతను చూసి పోలీస్ అధికారి ఆ పని చేయలేకపోయారు. సిఐటియే ఆవిర్భావంలో కీలక పాత్ర పోషించిన పర్సా సుదీర్ఘకాలం ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించారు. 1962లో పాల్వంచ ఎంఎల్‌ఏగా ఎన్నికయ్యారు.

సాంస్కృతికోత్సవాలతో మహాసభ ప్రచారం

- లేబర్ కోడ్స్ ప్రమాదాన్ని కార్మికులకు వివరించాలి
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు


విశాఖ త్రినాధపురంలో శ్రామిక సాంస్కృతిక ఉత్సవాల్లో చిన్నారుల నృత్యం

ప్రజాశక్తి - యంత్రాంగం

విశాఖలో ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ జరగనున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలంటూ ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రచారం జోరందుకుంది. శ్రామిక సాంస్కృతికోత్సవాలతో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల బహుముఖ కార్యక్రమాలు చేపడుతున్నారు. విశాఖలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ మహాసభ నేపథ్యంలో జిల్లాలో శ్రామిక ఉత్సవాల పేరిట పలు కార్యక్రమాలు జరుగనున్నాయని తెలిపారు. ఈ నెల 15న వాడవాడలా ఎర్రజెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం చేపట్టిన ఉద్యమాలను అందరికీ తెలియజేయాలని కోరారు. లేబర్ కోడ్స్ ప్రమాదాన్ని కార్మికులకు వివరించాలని అన్నారు. మహాసభను జయప్రదం చేయాలంటూ సిఐటియు మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన త్రినాధపురం జంక్షన్ వద్ద శ్రామిక సాంస్కృతిక ఉత్సవాలు జరిగాయి. కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎలైట్ డెంటల్, మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో సిఐటియు ఏర్పాటు చేసిన శిబిరంలో వంద మంది పరీక్షలు చేయించుకున్నారు. బిపి, సుగర్, థైరాయిడ్, కీళ్ల నొప్పులు, దంత సమస్యలను వైద్యులు తనిఖీ చేసి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం రెడ్డిపాలెం గ్రామంలో పోస్టర్లను ఆవిష్కరించారు. నర్సీపట్నం మండలం వేములపూడిలో మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి సిఐటియు నేతలు ప్రచారం నిర్వహించారు. జివిఎంసి 70వ వార్డు పరిధి దశమకొండలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని జై కిసాన్ పార్కులో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యేసురత్నం, నాగరాజు, పట్టణ కార్యదర్శి టి.గోపాలకష్ణ, మున్సిపల్ కార్మికులతో కలిసి ఆయన చలో విశాఖ పోస్టర్లను ఆవిష్కరించారు. నెల్లూరులో సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. బాలాజీ నగర్‌లోని డాక్టర్ రామచంద్ర రెడ్డి భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఆటో కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సిఐటియు జెండా ఎగురవేశారు. శ్రీకాకుళం జిల్లా కొమరాడ మండలంలోని గుమడ సంతలో సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి, ప్రజాసంఘాల నాయకులు ప్రచారం చేశారు. గరుగుబిల్లి మండలంలోని పెదగుడబ, గరుగుబిల్లిలో సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ సిఐటియు జెండాను ఎగురవేసి ప్రచారం చేశారు. ఒంగోలులో 49వ డివిజన్ (సత్యనారాయణపురం) విజేత హాస్పిటల్ సెంటర్‌లో సిఐటియు జెండాను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ ఆవిష్కరించారు. సిఐటియు నాయకులు వి.మాలకొండయ్య అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ప్రకాశం జిల్లాలో సిఐటియు జిల్లా నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు.

24 వ కామన్‌వెల్త్ క్రీడల వేదిక..?

జనరల్ నాలెడ్జ్ - కరెంట్ అఫైర్స్



-కొపనాతి వీర్రాజు
కరెంట్ అఫైర్స్ ఫ్యాకల్టీ,
పాతూరుగ్రామం,
నిజాంపట్నం మండలం, బాపట్ల జిల్లా,
సెల్ : 8106525320



1.ఇటీవల దిత్వా తుపాను కారణంగా అతలాకుతలమైన శ్రీలంక దేశానికి మానవతా సాయం కోసం భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ పేరేమిటి?
(ఎ) ఆపరేషన్ సహాయ్ (బి) ఆపరేషన్‌మిత్ర
(సి) ఆపరేషన్ సాగరమబంధు (డి) ఆపరేషన్ సద్భావ్
2.నైసార్ ఉపగ్రహాన్ని ఈ క్రింది ఏ రెండు దేశాలు సంయుక్తంగా అభివృద్ధి చేశాయి?
(ఎ) భారత్-జపాన్ (బి) భారత్-ఇజ్రాయెల్
(సి) భారత్-రష్యా (డి) భారత్-అమెరికా
3.ఆసియా పవర్ ఇండెక్స్-2025 భారత్ (40.0) ర్యాంక్ ఎంత?
(ఎ) 1 (బి) 2 (సి) 3 (డి) 4
4. 24వ కామన్ వెల్త్ క్రీడలు-2030 వేదిక?
(ఎ) అబూజు-నైజీరియా (బి) అహ్మదాబాద్-భారత్
(సి) గ్లాసో-సాట్లాండ్ (డి) బర్మింగ్‌హామ్-ఇంగ్లాండ్
5.ఫుట్‌బాల్ దిగ్గజం 'లియోనల్ మిస్సీ ఏ దేశానికి చెందిన క్రీడాకారుదు?
(ఎ) అర్జెంటీనా (బి) పోర్చుగల్ (సి) ఫ్రాన్స్ (డి) బ్రెజిల్
6.హృదయ స్పందనను తెలియజేసే సైతస్కోప్‌ను ఎవరు రూపకల్పన చేశారు?
(ఎ) అలెగ్జాండర్ ఫ్లెమింగ్ (బి) ఐజక్ న్యూటన్
(సి) రెన్ లానెక్ (డి) అలెగ్జాండర్ గ్రహంబెల్
7.ఇటీవల నైరుతి బంగాళాఖాతంలో సంబవించిన 'దిత్వా' తుపాన్‌కు నామకరణం చేసి దేశం పేరు?
(ఎ) థాయ్‌లాండ్ (బి) ఇండోనేషియా
(సి) శ్రీలంక (డి)యెమెన్
8.ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో వ్యాపిస్తున్న సబ్‌టైపస్ జ్వరం ఈ క్రింది బ్యాక్టీరియా ద్వారా వస్తుంది?
(ఎ) ఓరియంటియా సుట్సు గయుషి (బి) సాల్మోనెల్లా టైఫీ
(సి) లాక్టోబాసిలస్ (డి) ఏదీకాదు
9. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఎంతశాతం మేర కాలుష్య ఉద్గారాలు తగ్గించాలని పారిస్ ఒప్పందంలో నిర్ణయించారు?
(ఎ) 45 (బి) 60 (సి) 75 (డి) 100
10. గౌర్ మారియా జానపద నృత్యం ఏ రాష్ట్రానికి సంబంధించింది?
(ఎ) గుజరాత్ (బి) రాజస్థాన్ (సి) చతీష్‌ఘడ్ (డి) అస్సాం



11. నవంబర్ 1, 2025న నూతన ఆర్థిక సలహాదారు (రక్షణసేవలు)గా ఎవరు బాధ్యతలు స్వీకరించారు?
(ఎ) వి.అనంతనాగేశ్వరన్ (బి) టి.వి.సోమనాథన్
(సి) శ్రీరాజ్ కుమార్ అరోరా (డి)అజయ్ త్యాగి
12. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఏ ఫుట్‌బాల్ క్రీడాకారుడు ఇటీవల నైట్‌హుడ్ అవార్డు అందుకున్నారు?
(ఎ) లియోనల్ మిస్సి (బి) పీలె
(సి) డేవిడ్ బెక్ హామ్ (డి) క్రిస్టియానా రోనాల్డ్
13.ఇటీవల యునెస్కో భారతదేశంలోని ఏ నగరాన్ని క్రియేటివ్ సిటీ ఆఫ్ గ్యాస్ట్రోనమిగా ఎంపిక చేసింది?
(ఎ) హైదరాబాద్ (బి) లక్నో (సి) జైపూర్ (డి) గ్వాలియర్
14.2029 నాటికి వందశాతం అక్షరాస్యత సాధించేందుకు ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వయోజనులకు (15-19) కోసం చేపట్టిన కార్యక్రమం పేరు?
(ఎ) వయో ఆంధ్ర (బి) అక్షర ఆంధ్ర
(సి) సాల్ట్ కార్యక్రమం (డి) స్వర్ణాంధ్ర
15.ఇటీవల ఏ రాష్ట్ర శాసనసభ బహు భార్యాత్వాన్ని నేరంగా పరిగణిస్తూ చట్టాన్ని రూపొందించింది?
(ఎ) హర్యానా (బి) చత్తీష్‌ఘడ్ (సి) అస్సాం (డి) రాజస్థాన్
16.తుపాన్లు-2025కి సంబంధించి సరికాని జతను గుర్తించండి?
(ఎ) దిత్వా తుపానుకు పేరు సూచించిన దేశం-యెమెన్
(బి) సైన్యా తుపాన్‌కు పేరు సూచించిన దేశం-యుఎఇ
(సి) మొంథా తుపానుకు పేరు సూచించిన దేశం-థాయ్‌లాండ్
(డి) ఫెంగల్ తుపానుకు పేరు సూచించిన దేశం -సౌదీ అరేబియా
17.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అధికారికంగా ఈ క్రింది ఏ స్వాతంత్ర్య సమరయోధుడి పేరు పెట్టారు?
(ఎ) భగత్‌సింగ్ (బి) అల్లూరి సీతారామరాజు
(సి) సర్దార్ వల్లభాయ్‌పటేల్ (డి) కొండా వెంకటప్పయ్య
18.మహిళల వన్డే క్రికెట్ ప్రపంచకప్-2025 విజేత భారత్ ఏ దేశంపై గెలుపొందింది?
(ఎ) ఆస్ట్రేలియా (బి) దక్షిణాఫ్రికా
(సి) న్యూజిలాండ్ (డి) ఇంగ్లాండ్
19.గ్లోబల్ హంగర్ ఇండెక్స్-2025 భారత్ ర్యాంక్ ఎంత?
(ఎ) 105 (బి) 107 (సి) 102 (డి) 111

20.ఆగస్టు 15, 2025న రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన ఉచిత బస్సు ప్రయాణం పథకం పేరేమిటి?
(ఎ) స్త్రీ శక్తి (బి) ఆదిపరాశక్తి (సి) ఉచితబస్సు (డి) అబల
21.అసెంబ్లీ ఎన్నికలు -2025 జరుపుకున్న ఈ క్రింది రాష్ట్రాన్ని గుర్తించండి?
(ఎ) ఢిల్లీ (బి) బీహార్ (సి) అస్సాం (డి) 1 మరియు 2
22.ఇటీవల ఏ దేశం 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా వినియోగంపై నిషేధం విధించింది?
(ఎ) మాల్దీవులు (బి) ఆస్ట్రేలియా
(సి) స్విట్జర్లాండ్ (డి) ఫ్రాన్స్
23.ఇటీవల వార్తల్లో నిలిచిన 'సర్' పూర్తిపేరేమిటి?
(ఎ) స్పెషల్ ఇంటిలిజెన్స్ రివిజన్
(బి) స్పెషల్ ఇంటరెస్ట్ రీసెర్చ్
(సి) స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్
(డి) స్పెషల్ ఇంటరెస్టింగ్ రీడింగ్
24.ఇటీవల నరేంద్రమోడీ ప్రారంభించిన ప్రపంచంలోనే ఎత్తైన (77 అడుగుల) శ్రీరాముడి కాంస్య విగ్రహ రూపశిల్పి ఎవరు?
(ఎ) అరుణ్‌యోగిరాజ్ (బి) సుదర్శన్ పట్నాయక్
(సి) రామ్‌సుతార్ (డి) విఠల్ బాలకృపదోషే
25.పురుషుల హాకీ జూనియర్ ప్రపంచకప్-2025 వేదిక?
(ఎ) చెన్నై (భారతదేశం) (బి) ఎడిలైట్ (ఆస్ట్రేలియా)
(సి) కొలంబో (శ్రీలంక) (డి) అమస్టర్‌డాం(నెదర్లాండ్స్)
26.ఇటీవల ఈ క్రింది ఏ భారతీయుడి విగ్రహాన్ని యునెస్కో ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరించారు?
(ఎ) బి.ఆర్.అంబేద్కర్ (బి) మహాత్మాగాంధీ
(సి) బిర్సాముండా (డి) మహాత్మాజ్యోతిబా పూలే
27.సుల్తాన్ అజ్లాన్‌షా కప్ ఏ క్రీడకు సంబంధించింది?
(ఎ) క్రికెట్ (బి) హాకీ (సి) ఫుట్‌బాల్ (డి) చెస్
28.ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులు ఎవరు?
(ఎ) నన్నెపరెడ్డి (బి) భోగరాజు పట్టాభి సీతారామయ్య
(సి)ఆర్‌ఎం రామస్వామి (డి) లాలా లజపతిరాయ్
29. ప్రపంచ అత్యున్నత సాహిత్య ద్వితీయ బహుమతి బుకర్‌ప్రైజ్ -2025 విజేత?
(ఎ) డేవిడ్ సలై (ఫ్లెష్) (బి) మారియా రెవ (ఎండ్లింగ్)
(సి) కిరణ్ దేశాయ్ (దిలోన్లీనెస్ ఆఫ్ సోనియా అండ్ సన్నీ)
(డి) సూజున్ చోయ్ (ఫ్లాష్‌లైట్)
30. జనవరి1, 2007 తర్వాత పుట్టిన వారెవ్వరూ సిగరెట్లు ముట్టుకోకూడదని ఇటీవల ఆదేశాలు జారీచేసిన ప్రపంచంలోని తొలి దేశం ఏదీ?
(ఎ) ఆస్ట్రేలియా (బి) సింగపూర్ (సి) జింబాబ్వే (డి) మాల్దీవులు
31.నవంబర్ 24, 2025న భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన వ్యక్తి ఎవరు?
(ఎ) జస్టిస్ బిఆర్ గవాయ్ (బి) జస్టిస్ సూర్యకాంత్ శర్మ
(సి) జస్టిస్ విక్రమ్‌నాథ్ (డి) జస్టిస్ హెచ్‌జె కానియా
32.సదస్సులు-వేదికలు-2025 జతపర్చండి
(1)కాప్-30-ఎ-బెలెమ్ (బ్రెజిల్)
(2) జి-21-20-బి-జోహన్స్‌బర్గ్ (దక్షిణాఫ్రికా)
(3)బ్రిక్స్-17-సి-రియోడేజనీరో (బెజిల్)
(4)బిమ్స్‌టెక్-6-డి-బ్యాంకాక్ (థాయ్‌లాండ్)
1.1ఎ 2బి 3సి 4 డి
2.1బి 2 సి 3 డి 4 ఎ
3.1 సి 2 బి 3 డి 4ఎ
4.1డి 2సి 3 బి 4ఎ
33.వరల్డ్ హెరిటేజ్ కమిటీ-2025 గుర్తించిన భారతీయ వారసత్వ ప్రదేశాన్ని గుర్తించండి?
(ఎ) మహారాష్ట్ర మిలటరీ ల్యాండ్‌స్కేప్స్
(బి) మొయిడామ్స్ (సి) శ్రీ హరిమందిర్ సాహిబ్
(డి) నియోరా వ్యాలీ నేషనల్ పార్కు
34. క్రీడలు - వేదికలు జతపరచండి?
1.సమ్మర్ ఒలింపిక్స్-2028-(ఎ)లాస్ ఏంజెల్స్ (యుఎస్‌ఎ)
2.కామన్ వెల్త్ క్రీడలు-2026-(బి)గ్లాస్గో (స్కాట్లాండ్)
3.ఎఫ్‌ఐఎఫ్‌ఎ-2026-(సి) మెక్సికో, కెనడా, యుఎస్‌ఎ
4.మెన్ హాకీ వరల్డ్‌కప్-2026-(డి)-బెల్జియం(నెదర్లాండ్స్)
1.1.ఎ 2.బి 3.సి 4.డి
2.1.డి 2.సి 3.బి 4.ఎ
3.1.ఎ 2.బి 3.డి 4.సి
4.1.బి 2.ఎ 3.సి 4.డి
35. ఇటీవల భారత నౌకాదళంలో చేరిన ఐఎన్‌ఎస్ మాహే (సైలెంట్ హంటర్) నౌకను ఏ సంస్థ తయారుచేసింది?
(ఎ) కొచ్చిన్ షిఫ్ బిల్డర్స్ లిమిటెడ్ (కేరళ)
(బి)యజుగాన్ డాక్ షిఫ్ బిల్డర్స్ లిమిటెడ్ (మహారాష్ట్ర)
(సి)డిఆర్‌డిఒ (డి) ఎ మరియు బి
36.ఈ క్రింది సరికాని వాక్యాన్ని గుర్తించండి?
(ఎ) విశ్వసుందరి-2025 విజేత-ఫాతిమా బాష్ (ఫెర్నాండెజ్-మెక్సికో)
(బి) 74వ విశ్వ సుందరి పోటీల వేదిక-థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్
(సి) ఈ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన మిస్ యూనివర్స్ ఇండియా-మణికా విశ్వకర్మ కిరీటం దక్కించుకోలేకపోయారు
(డి) ఈ పోటీలకు భారత బ్యాడ్మింటన్ స్టార్ పి.వి.సింధు న్యాయనిర్ణేతల్లో ఒకరుకు వ్యవహరించారు.
37.భారత దేశంలో అత్యధికకాలం (24 సంవత్సరాలు)ముఖ్యమంత్రిగా సేవలందించిన వ్యక్తి ఎవరు?
(ఎ) నిలీష్‌కుమార్-భీహార్ (బి) పవన్‌కుమార్ ఛామ్లింగ్ (సిక్కిం)
(సి) నవీన్ పట్నాయక్-ఒడిశా (డి) జ్యోతిబసు (పశ్చిమబెంగాల్)
38.హెన్లీపాస్‌పోర్ట్ ఇండెక్స్-2025 భారత్‌స్థానం 85.అయితే ఎన్నిదేశాలకు వీసా లేకుండా ప్రయాణం చేయొచ్చు?
(ఎ) 67 (బి) 85 (సి) 57 (డి) 75
39.వరల్డ్ టాయిలెట్ డే-2025 థీమ్
(ఎ) శానిటేషన్ ఇన్ ఎ ఛేజింగ్ వరల్డ్
(బి) శానిటేషన్ ఫర్ పీచ్ (సి) యాక్సెప్టింగ్ ఛేంజ్
(డి) సస్టైనబుల్ శానిటేషన్ అండ్ గ్రౌండ్ వాటర్
40.పురుషుల టి-20 వరల్డ్‌కప్-2026 ప్రచార కర్తగా ఎవరు నియమితులయ్యారు?
(ఎ) విరాట్‌కోహ్లీ (బి) సచిన్ టెండూల్కర్
(సి) రోహిత్‌శర్మ (డి) యువరాజ్ సింగ్
41.ఇటీవల మరణించిన డిఎన్‌ఎ (డీ ఆక్సీ రైబో న్యూక్లిక్ యాసిడ్స్) ఆవిష్కర్త ఎవరు?
(ఎ) ఫ్రాన్సిస్ క్రిక్-బ్రిటన్ (బి) జేమ్స్‌వాట్సన్-యుఎస్‌ఎ
(సి) జాన్‌గుడెనఫ్-యుఎస్‌ఎ (డి) మారిస్ విలీన్స్-న్యూజిలాండ్
42.ప్రస్తుత జిఎస్‌టి రేట్లు (5,18) ఏ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి?
(ఎ) జులై 1,2025 (బి) మార్చి 31,2025
(సి) జనవరి1, 2025 (డి) సెప్టెంబర్ 22, 2025
43. 2027లో కేంద్రప్రభుత్వం చేపట్టబోయే జనగణన ఎన్నోది?
(ఎ) 14 (బి) 15 (సి) 16 (డి) 17
44.మన జాతీయగేయం వందేమాతరంను భారత రాజ్యాంగ సభ ఏ తేదీన అధికారికంగా ప్రకటించింది.
(ఎ) 26, నవంబర్ 1949 (బి) 24 జనవరి 1950
(సి) 26 జనవరి 1950 (డి)9 డిసెంబర్ 1952
45.దేశంలోని ఏ రాష్ట్రం దుర్భర పేదరికాన్ని నిర్మూలించిన తొలి రాష్ట్రంగా నిలిచింది?
(ఎ) ఉత్తరాఖండ్ (బి) కేరళ (సి) గోవా (డి) హర్యానా
46.భారత దేశంలో అతిపెద్ద గ్రంథాలయం ఎక్కడ ఉంది?
(ఎ) చెన్నై (బి) కోల్‌కొతా (సి) బెంగుళూరు (డి) ముంబై
47.ట్రీ ఉమెన్ ఆఫ్ కర్నాటక ప్రసిద్ధి చెందిన సాలు మరద తిమ్మక్క ఏ సంవత్సరంలో పద్మశ్రీ అవార్డు పొందారు?
(ఎ) 2015 (బి) 2017 (సి) 2018 (డి) 2019
48.క్రీడాకారులు-క్రీడలను జతపర్చండి?
(1)మంజుబాల-ఎ-వ్యోమర్‌త్రో
(2) సుమిత్-బి-బాక్సింగ్
(3) శివేంద్ర-సి-బాస్కెట్‌బాల్ (4) నితిన్‌వర్మ-డి-కనోయ్
1.1ఎ 2బి 3 సి 4డి 2.1బి 2.ఎ 3.సి 4.డి
2.1.బి.2.ఎ 3.సి 4.డి.
3.1.సి 2.డి.3.బి 4.ఎ
4.1.డి.2.సి 3.బి.4.ఎ
49.బి.రాయ్ అవార్డును ఏ రంగంలో ప్రదానం చేస్తారు?
(ఎ) సినిమా (బి) జర్నలిజం (సి) వైద్యం (డి) శాస్త్ర, సాంకేతిక
50.రామ్‌సర్ ప్రదేశాలు-జతపర్చండి
1.గోగాబీల్ సరస్సు (ఎ) బీహార్
2.ఖిచాన్ (బి) రాజస్థాన్
3.సక్కర్ కోట్టై (సి) తమిళనాడు
4.ఉధ్వా సరస్సు (డి) జార్ఖండ్
1.ఎ 2.బి.3.సి 4.డి
2.1.బి. 2.ఎ 3.సి 4.డి
3.1.సి.2.డి 3.బి 4.ఎ
4.1.డి. 2.బి.3.ఎ.4.సి

జవాబులు :

(1) 3 (2) 4 (3) 3 (4) 2 (5) 1 (6) 3 (7)4 (8) 1 (9) 1 (10) 3 (11) 3 (12) 2 (13) 2 (14)2 (15) 3 (16) 4 (17) 2 (18) 2 (19) 3 (20) 1 (21) 4 (22) 2 (23) 3 (24) 3 (25) 1 (26) 1 (27) 2 (28) 2 (29) 1 (30) 4 (31) 2 (32) 1 (33) 1(34) 1 (35) 1 (36) 4 (37) 2 (38) 3 (39) 1 (40) 3 (41) 2 (42) 4 (43) 3 (44) 2 (45) 2 (46) 2 (47) 4 (48) 1 (49) 3 (50) 1



"సాహిత్యం రాజకీయాలకు అతీతంగా ఉండాలని ఎవరైనా అంటే- వాళ్లు కచ్చితంగా మోసపుచ్చేవాళ్లో, మోసపోయినవాళ్లో అయి ఉండాలి."
- కొడవటిగంటి కుటుంబరావు

రికవరీ

సౌరాష్ట్ర పటంలో పడమటి నొక్కులాంటి
పదును ముక్కున్న గద్ద
తూరుపు తీరం తలాడ వాలింది
ఇక్కడొక కొత్త పోర్టు పురుడుపోసుకుంది
పెద్ద ఆశ్చర్యమేం లేదు
దండకలో జరిగే మైనింగుకు
దగ్గరి దారులు వెదుక్కుందేమో...!
ఊహించని ఉత్పాతంలా ఉద్దానం భూముల్లో
విమానం రెక్కలు కొలతకు దిగాయి

ఈ తీరమనీ, ఆ అడవనీ తేడా లేదు
పవిత్ర ద్వీపకల్పం మొత్తం
ఇప్పుడొక దేవుడి మాన్యం
గారడీల గొడుగు కింద దూరిపోయి
సంపన్న జంపన్నలు కొద్దిమంది
అశ్వమేధయాగం చేస్తున్నారు
వాళ్ళొదిలిన రెక్కల గుర్రాలకు
అంధభక్తులు దోవ జూపుతున్నారు
వాటిని అడ్డగించాల్సిన యువతరం కవలలు
కాళ్ళు కడిగి నీళ్ల తలమీద చల్లుకుని
తలనీలాలు ఇచ్చుకుంటున్నారు

కొండలూ భూములూ నదులూ గనులూ
ఏ వనరులు నొళ్ళుకున్నా ఎదురు లేదు
అడవి చుట్టుముట్టి లోపట పొగబెట్టించాక
అదురు లేదు బెదురు లేదు
రాజ్యం ఆస్తులూ వారివే
ప్రజల ఆస్తులూ వారికే
దేశ సంపదనంతా కార్పొరేట్ ఆస్తులుగా
మార్చిడి చెయ్యడమే కొత్త నమూనా!

ప్రశ్నించే గొంతుల్ని అభివృద్ధి నిరోధకులనే
ముద్ర వేసి నోళ్ళు మూయిస్తారు
సమిష్టి చైతన్యం సచ్చుబడ్డది కనుక
సమాజ సంపద ఆహుతైపోతుంది
రాజముద్ర చాటుగా తరలిపోయే సొత్తు
రాజపీఠాన్ని కాపుగాస్తుంది
పొరపాట్లు తప్పులు దోషాలు నేరాలు
అన్నీ చరిత్ర ఖాతాలోనే జమవుతుంటాయి
అర్ణబ గోవు స్వాముల భజనల్లో వర్తమానం
నిత్యం క్లీన్‌చిట్ బొంకుల్తో ప్రసారమౌతుంది

ఎన్నికల గెలుపొక్కటే పాలనకు పరమావధా?
కాలం కళ్లుగప్పి నోటి తుంపర్లు పంచి
ఈ నేలకు ద్రోహం చేసే వారిని
ఎంతటి సహనశీలైనా ఎంతని భరిస్తుంది?
గెలిచిన ఓటు ఓడిన ఓటరు ఇద్దరూ
విలోమ బాధ్యతలు రద్దు చేసుకుంటారు
ఒకనాటికి ప్రతియజ్ఞం మొదలౌతుంది
ప్రజల మూల్గులు పీల్చి నేల నెత్తురు తాగి
కొండలెత్తున పోగేసిన కార్పొరేట్ల ఆస్తులన్నీ
జాతీయం చేయబడతాయి
ప్రజల సొత్తు తిరిగి ప్రజలకు చేరుతుంది
పీడ పోయిన చేనులా నేల నవ్వుతుంది!

– కంచరాన భుజంగరావు, 94415 89602

ప్రశ్నోపనిషత్తు

ప్రశ్నించవద్దంటే ఎలా?
దుష్ట సంప్రదాయాలు యథేచ్ఛగా
ఒళ్ళు విరుచుకుంటున్నప్పుడు
ప్రశ్నతో అడ్డు కట్టేయకపోతే ఎలా?

న్యాయాన్యాయాలు మసిబారినపుడు
అవినీతి అంతటా తానై
వికటాట్టహాసం చేస్తున్నప్పుడు
ప్రశ్నించకపోతే ప్రాణం పోయినట్లుండదూ?
విష పురుగులా పాకుతున్న
అసమతుల్యతను సవాలు చేస్తూ
సరైన ప్రశ్న సంధించకపోతే..
సమాజ పురోగతికి చెదలు చుట్టుకోదూ?

ప్రశ్నయే కదా ప్రక్షాళనకు దారి చూపేది
ప్రశ్నలోనే కదా సమస్త వికాసం
పురుడు పోసుకునేది?
అక్రమాలపై ఆగ్రహించేది
అమానుషానికి ఎదురొడ్డి నిలిచేది
చురకత్తి లాంటి ఓ ప్రశ్నే కదా!

మలినమంటని ఐక్య భారతం కోసం
అరమరికల్లేని సుభిక్షిత సమాజం కోసం
చీకటి కడిగిన సూర్యోదయాల కోసం
బాణంలా దూసుకొచ్చే
చేవ నిండిన ప్రశ్నలే కదా
సామాన్యుడికి దన్నుగా నిలబడేది

ప్రశ్నల తూటాలు గర్జిస్తేనే కదా
సామాన్యుల బతుకుల్లో పచ్చని పంట పండేది!

వెలుగు పూలు వికసించేది..
వెన్నెల ద్వారాలు తెరుచుకునేది..
నిక్కచ్చి ప్రశ్నకు ప్రాణం పోస్తేనే కదా..!?
సమాధానాలు పరిష్కార దిశగా
పరుగులు తీసేది!

– సునీత గంగవరపు
94940 84576

కొత్త కవితలకు, పాటలకు ఆహ్వానం


సాహితీ మిత్రులారా!, విశాఖ సాగరతీరాన ఎయు కన్వెన్షన్ సెంటర్ ఆవరణలో ఈ నెల 27 నుండి జనవరి 2 వరకు శ్రామిక ఉత్సవాలు జరుగుతున్నాయి. సిఐటియు అఖిల భారత మహాసభలు విశాఖలో జరుగుతున్న నేపథ్యంలో సామాన్య ప్రజల, శ్రామికుల సంస్కృతిని ప్రతిబింబించేలా సాంస్కృతిక ఉత్సవాలు, సాహిత్య కార్యక్రమాలు జరుగుతాయి. తెలుగు సాహితీరంగంలోని ప్రముఖులనందరినీ ఆహ్వానిస్తున్నాం. అక్కడ సాహితీ వేదిక మీద ప్రతిరోజూ ఇతర సభాకార్యక్రమాలతోబాటు కవితాగానం, పాటల ఆలాపన కూడా ఉంటాయి. ఈ కవితలు, పాటలు కొత్తగా ఉండి యువతరాన్ని కదిలించేవిగా ఉంటే ఎక్కువ ప్రయోజనకరం. మీరు ఇప్పుడు కొత్తగా కాని, ఇటీవలి కాలంలో గాని రచించిన కవితలు, పాటలు వాట్సప్ ద్వారా దిగువ తెలిపిన ఫోను నెంబర్‌కు ఈనెల 25లోగా పంపండి. వాటిని ఆయా తేదీల వారీగా వేదిక మీద గానం చేయడానికి టైమ్‌టేబుల్ రూపొందించి మీకు తెలియజేస్తాం. ఒకవేళ మీరు వ్యక్తిగతంగా రాలేని పక్షంలో కూడా మీ కవితలను గాని, పాటలను గాని అక్కడ పాడే ఏర్పాటు చేస్తాం. మీరు వ్యక్తిగతంగా పాల్గొనగలిగితే చాలా బాగుంటుంది. మీ రచనతోబాటు పేరు, ఫోను నంబరు కూడా పంపండి.

ఇతివృత్తం : సామాన్య ప్రజల జీవితాలను, సమస్యలను ప్రతిబింబిస్తూ, వారిని సమైక్యపరుస్తూ, వారికి ప్రేరణ కలిగించే విధంగా ఏ ఇతివృత్తమైనా అభిలషణీయమే. విద్వేషాలను, వివక్షను, విచ్చలవిడితనాన్ని ప్రదర్శించే ఇతివృత్తాలకు తావు లేదు.

మీ రచనను పంపాల్సిన వాట్సప్ నెంబరు : 94402 56065 (జి.వి.ఎన్.చలపతి)

– శ్రామిక ఉత్సవ్ నిర్వహణ కమిటీ, విశాఖపట్నం

కవిత్వ సృజనలో నిరలంకారత, నిమగ్నత



పరిశీలన

కవిత్వం పాఠకుడి మనసులో నిలిచిపోవడానికి టెక్నిక్ చాలా ప్రధానమైనది. కవి తాను ఒక వస్తువును ముందుగా ఉంచుకోవడం లేదా అప్రయత్నంగానే వస్తువైపు కవితం మళ్లడం అనేది ఒక ప్రక్రియ. కవితగా మరిచే సందర్భంలో వస్తువుతో కవిత ముడిపడి ఉందా లేదా తీసుకున్న వస్తువును కళా విలువలు ద్వారా కవిత్వం చేశాడా అనేది చదువురులను ఆకర్షిస్తుంది. కవి తాను వ్యక్తం చేసే భావాలు అవి ఎట్లాంటి భావాలైనా సరే కవిత్వం కావడమే ప్రధానం . ఏదో సరికొత్త నిర్మాణం ఏమీ లేకుండా,గొప్ప గొప్ప ఊహలు లేకుండా వచనం కవిత్వంగా నిలబడే సందర్భాలు కూడా ఉన్నాయి.

పసి ప్రార్థన
బడులు తెరిచారు
పసి తరగతి
ప్రారంభమైంది
పిల్లలు
బోరు బోరున
విలపించారు
ఆ రోజుకి
అదే తొలి ప్రార్థన

ఈ కవిత కొండూరి రామరాజు అనే కవిది. అతను ఇంతవరకు కవిత సంకలనం వేయలేదు. యువకుడు కూడా కాదు. ఇందులో కవి ఏం చెప్తున్నాడో ఇట్టే పసిగట్టవచ్చు. నిరలంకారత కూడా పాఠకుడిలో రసాయనిక చర్యను జరుగుతుంది. కేవలం గంభీరమైన పదాలు, ఉపమానాలు వరుసలు, రూపకాల దండయాత్ర లేకుండానే ఈ కవిత తన ప్రయోజనాన్ని సాధించింది. మన విద్యా విధానాల్లోని ఒత్తిడి, తొందరపాటుకు సంబంధించి 9 పాదాల్లో చెప్పేశాడు. ఆరు సంవత్సరాలు నిండకముందే బడికి పంపే తల్లిదండ్రులు , ఆ పసిపిల్లల కళ్ళలోకి ఒకసారి చూడగలిగితే ఇట్లాంటి కవితలు పుట్టవు. పాఠశాలలో అడుగుబెట్టే పిల్లలు ఆనందంగా హదయాలు పెట్టగలిగితే ఈ కవిత చనిపోతుంది. అట్లా జరిగే అవకాశం ఉండక పోవచ్చు. దేశ భవిష్యత్తు తరగతి గది నాలుగు గోడల మధ్య నిర్మాణం అవుతుందని కొఠారి అంటాడు. ఆయన ఈనాటి పరిస్థితిని ఊహించి ఉండడు. పుస్తకాల బరువు దగ్గర నుంచి, పిల్లవాడు వయసుకు మించిన జ్ఞానాన్ని నేర్పించే యాలని చేసే ఆలోచనలు క్రూరమైనవి.

కుర్రతనం
కుర్రాళ్ళు
దారిలో దొరికిన నాణెంతో
పప్పు ఉండలో గాలి బుడగలో
కొనుక్కోవాలనుకున్నారు
చివరకి
వెర్రిగా
రైలు వస్తోన్నప్పుడు
పట్టా మీద పెట్టి
సాగదీశారు
ఇప్పుడు అది ఎందుకూ కొరగాదు
కొందరు కవులూ అంతే
పద్యాల్ని సాగదీసి...!

– ఎస్.హనుమంతరావు

ఈ కవితను రాసిన కవి కవిత్వ నిర్మాణానికి సంబంధించి ఎంత వ్యంగంగా చెప్పాలో అంతా చెప్పాడు. కవుల్లో సాగదీసే లోపాన్ని, కవితల్లో అనవసరపు పొడిగింపుని తగ్గించుకోవలసిన అవసరం ఉంటుంది. ఈ కవితను చదివాక పద్యాన్ని సాగ దీయడం మానేయాలి. ఏ కవిత ఎంతవరకు అవసరమో అంతవరకే ఆగిపోవాలి. అట్లా లేని కవితల్ని విమర్శకులు సులభంగా గుర్తుపట్టాలి. మరో కవితలోకి వెళదాం.

హా! హతవిధీ...
నన్ను అనాకారిని చేసి
మీ ఇంటి ముందు వేలాడదీశావు
అయినా నేను బాధ పడలేదు
నీ పంట పొలంలో పిట్టలను అదిలించమని
నేలలో పాతి నిలబెట్టావు
దానికి నేను దిగులు చెందలేదు
కానీ నువ్విప్పుడు
నాకు రాజకీయ నాయకుని పేరును తగిలించి
ఊరంతా తిప్పి
నాలుగు రోడ్ల కూడలిలో
నిలబెట్టినందుకు మాత్రం
అవమాన జ్వాలల మధ్య
దగ్ధమవుతున్నాను! – పక్కి రవీంద్ర నాథ్

ఈ కవిత కవి ఎలాంటి టోన్లు చెప్పాడో అలాంటి టోన్ లోనే చెప్పాడు. శిల్ప పరంగా కూడా కవి చక్కగా ఉన్నాడు. ఈ మధ్యకాలంలో వచన కవితకు సంబంధించి ఒక సమస్య ఉంది.

వచన కవిత నిర్మాణపరంగా లోపాలు లేనప్పుడు అందులో ఒక అంతర్లయను కలిగి ఉన్నప్పుడు ఆ కవితను మనం సులభంగా గుర్తు పెట్టుకోగలం. అయితే ఈ మధ్యకాలంలో వస్తున్న కవితలను గుర్తు పెట్టుకోవడం చాలా కష్టంగా కూడా ఉంటోంది. ఈనాటి రాజకీయ నాయకుడి జీవితం ఎంత దిగజారిందో ఈ కవితకు మించిన పరాకాష్ట మరొకటి లేదు. ఈ కవితలో రాజకీయ భావాన్ని ప్రభావ వంతంగా కవి వ్యక్తం చేయగలిగాడు. ఈ కవితను మూడు నాలుగు మార్లు చదవగానే పాఠకుడు గుర్తుపెట్టుకోగలడు

గుంజీళ్లు
"ఇన్నేళ్ల జీవితంలో వాడు ఏనాడూ ఇలా వంగి
తల్లిదండ్రులకు గురువులకు నమస్కరించి ఉండడు
ఇంతలా వంగి వాళ్ళ మాట పాటించి ఉండడు
ఇవాళ వాడు మోకాళ్ళ భూమ్మీద ఆనించి నడుము వంచి
తల పూర్తిగా కిందకు దించి
మంచం కింద కుర్చీ కింద వెతుకుతున్నాడు
ఎందుకంటే
వాడు డబ్బు లెక్క పెడుతుండగా చేయి లోంచి జారి
రూపాయి బిళ్ళ ఎక్కడో దొర్లి పడింది
అది వాడి చేత
ఇలా మాటిమాటికి
గుంజిళ్ళు తీయిస్తోంది"

– దీవి సుబ్బారావు

ఈ కవిత నిర్మాణాన్ని కూడా పరిశీలిస్తే కవిత మొత్తం వచనం లానే కనిపిస్తుంది. కవిత్వ భాష చాలా తక్కువ. కానీ ఒక సత్యాన్ని చాలా తేలికగా ఆవిష్కరించింది. చివరి మూడు పాదాలు మనం చదువుతూ ఉన్నప్పుడు గుంజీళ్లు తీస్తున్నట్టే ఉంటుంది. కవితను బిగ్గరగా చదివినప్పుడు ఇట్లాంటి పరిస్థితిని మనం గమనించవచ్చు.

అట్లాగే జి.లక్ష్మి అనే కవయిత్రి ఫ్లెక్సీ వస్తువుగా స్వీకరించి కవిత రాశారు. అంటే ఈ ఫ్లెక్సీ చనిపోయిన వాళ్లకి నివాళులు గానో ఆ ఇంటి చిరునామా చూపిస్తున్నట్టుగానో, వచ్చే పోయే వాళ్ళని పలకరిస్తూ ఉంటుంది. చనిపోయిన వ్యక్తి ఆ ఫోటోలో నవ్వుతూ ఉంటాడు. అతను ఇప్పుడు మన మధ్య ఉండడు. అతను వెళ్ళిపోవడానికి గల కారణాలు మనకు తెలియదు. వీధి మొదట్లో మాత్రం అతని ఫోటో చిరునవ్వుగా పూసి ఉంటుంది. కన్నీరై రాలుతూ ఉంటుంది. కాలం తీరిపోతే కాలం ఎవరినైనా వీధి మొదట నిలబెట్టేస్తుంది. ఇది అందరికీ తెలిసిన విషయమే. ఇట్లాంటి నేపథ్యంలో కవిత రాసిన కవయత్రి ఆ కవిత ముగింపుతో, ఒక్కసారిగా ఆ దిశను మార్చేస్తుంది.

వీధి మొదట్లో ఫోటో
వచ్చే పోయే వాళ్ళని చూస్తూ
నవ్వుతూనే ఉంటుంది
కానీ ఇల్లే ఏడుస్తూ ఉంటుంది

చివరి 4 వాక్యాలకు వచ్చేసరికి పాఠకుడు కూడా ఆ ఇంటి దుఃఖంలో భాగమవుతాడు. కవి వస్తువును ఎంత బలంగా లోపలికి తీసుకోగలిగితే, అంతే బలంగా కవిత పాఠకుడిలోకి ప్రవహిస్తుంది. కదిలిస్తుంది. కవిత ఎన్ని పాదాల వరకు వచ్చి ఆగిపోతే ప్రభావవంతంగా ఉంటుందో అక్కడే ఆగిపోవాలి. కవికి, కవితకు మధ్య జరిగిన మానసిక సంభాషణ, వాళ్ళిద్దరి మధ్య జరిగే చర్యపునాదిగా నిలుస్తుంది. ఎంచుకున్న వస్తువు పట్ల కవికి పూర్తి పట్టు ఉండాలి. వస్తు స్వభావానికి అనుగుణ మైన విషయం, చుట్టూ అలముకున్నకవిత్వ వాతావరణం, కళా తీవ్రత కవితను దాని ఫలితాన్ని పాఠకుడిలోకి చేరవేస్తాయి. పైన ఉదహరించిన నాలుగు కవితల్లోనూ వ్యర్థపదాలు కనిపించవు. విషయ అవగాహనను త్వరగా కలిగిస్తాయి. సంక్లిష్టత కూడా లేదు. కవిత్వ నిర్మాణానికి సంబంధించి కవికి నిమగ్నత ఎంత అవసరమో ఈ నాలుగు కవితలు మనకు తెలియజేస్తాయి. వస్తువు పట్ల విషయాన్ని పాఠకుడికి అందించే వ్యక్తి పట్ల అప్రమత్తంగా ఉన్న కవి ఇలాంటివి ఏ కాలంలోనైనా సాధిస్తాడు.

– డాక్టర్ సుంకర గోపాలయ్య
94926 38547

అల్లూరికి అండగా నిలిచిన ముస్లిం యోధులు



తెలుగు ప్రజల విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు. ఆధునిక ఆయుధాలు, సుశిక్షితులైన సైన్యం కలిగిన బ్రిటీష్ ప్రభుత్వంతో గిరిజన ప్రజలను కూడదీసి పోరాడిన అల్లూరి శ్రీరామరాజు సదా స్మరణీయుడు, నిత్య విప్లవజ్వాల. దేశ స్వాతంత్ర్యం కోసం 27 ఏళ్ళ వయసులో బ్రిటిష్ తూటలకు బలైన ఆ యోధుడు, ఆయనతో పాటు అమరులైన గిరిజన నేతల చరిత్ర ప్రజల మదిలో వుంది. ఆ మన్యం వీరుడుకి ఫజులుల్లా ఖాన్, షేక్ మదీనా కొండత అండగా నిలిచారు. కొద్దిమంది పండితులకు, పరిశోధకులకు మాత్రమే తెలిసిన ఈ ముస్లిం యోధుల గురించి సయ్యద్ నశీర్ అహమ్మద్ రచించిన 'అల్లూరికి అండగా నిలిచిన ఫజులుల్లాఖాన్– షేక్ మదీనా' పుస్తకంలో అనేక వివరాలు వున్నాయి.

1922–24 మధ్య మన్యం ప్రాంతంలో సామ్రాజ్యవాద వ్యతిరేక స్వాతంత్రోద్యమం మహోజ్వలంగా సాగింది. ఆ సమయంలో బ్రిటిష్ ప్రభుత్వంలో డిప్యూటీ తహసీల్దార్, డిప్యూటీ కలెక్టరు, డివిజనల్ అధికారిగా బాధ్యతలు నిర్వహించిన ఫజులుల్లా ఖాన్ అల్లూరికి అనేక రూపాల్లో తోడ్పాటు అందించారు. బ్రిటిష్ ప్రభుత్వంలో ఉద్యోగం చేస్తున్నప్పటికీ ఆయనలో దేశభక్తి అణువణువునా వుండేది. అధికారిగా తనకున్న పరిమిత అధికారాలతోనే ప్రజలకు మెరుగైన సేవలు అందించేవారు. ప్రస్తుత అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలో ఫజులుల్లాఖాన్ పేరిట 'ఫజల్లాబాద్' అనే గ్రామం ఏర్పడేంతగా ఆయన ప్రజా విశ్వాసాన్ని పొందారు. ఈ గ్రామానికి సమీపాన కొండమీద 'శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరి స్వామి' వున్న ఆలయాన్ని ఆయన కట్టించి, ధూపదీప నైవేద్యాలకు 15 ఎకరాల భూమిని కేటాయించిన ఫజులుల్లా ఖాన్ మత సామరస్యత గొప్పతనాన్ని ఈ పుస్తకంలో రచయిత వివరించారు.

మన్యం ప్రాంతంలోని కృష్ణదేవిపేటలో అల్లూరి శ్రీరామరాజు తిరుగుబాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు బ్రిటిష్ ప్రభుత్వానికి సమాచారం అందింది. ఈ విషయాన్ని నిర్ధారించుకోవడానికి కృష్ణదేవిపేటకు చేరుకున్న బ్రిటిష్ అధికారుల బృందంలో ఫజులుల్లా ఖాన్ ఉన్నారు. అల్లూరి గురించి స్థానిక ప్రజలు చెప్పిన విషయాలు తెలుసుకున్న ఈయన అల్లూరి పట్ల ప్రత్యేక గౌరవాభిమానాలతో ఆయనకు తోడుగా నిలవాలని నిర్ణయించుకున్నారు. సరైన సన్నాహాలతో మన్యం పోరాటం ప్రారంభమయ్యేందుకు, అల్లూరి ప్రాణాలు కాపాడేందుకు విశేష కృషి చేశారు. ఇందులో భాగంగా నేరుగా అల్లూరితో చర్చలు జరపడానికి బ్రిటిష్ ప్రభుత్వ అనుమతి తీసుకుని పోలవరంలోని ఒక ఇంట్లో సమావేశం అయ్యాడు. ఇందులో ఫజులుల్లా ఖాన్‌కు ద్విముఖ వ్యూహం ఉన్నట్లు ఈ పుస్తకం ద్వారా అర్థమవుతుంది. అల్లూరి చేయాలనుకుంటున్న పోరాటంపై బ్రిటిష్ ప్రభుత్వ దృష్టిని కొద్దికాలం మళ్లించి, మరోవైపు ఉద్యమానికి సరైన సన్నాహాలు చేసుకోవడానికి తోడ్పడ్డారు. 1922 జులై 27న ఫజులుల్లాఖాన్ మరణించిన తర్వాత అదే సంవత్సరం ఆగస్టు 22న చింతపల్లి పోలీసుస్టేషన్ మీద అల్లూరి సీతరామారాజు దాడిచేసి తన సమర పోరాటాన్ని ప్రారంభించాడు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపిన బ్రిటిష్ ప్రభుత్వం ఇందుకు ఫజులుల్లాఖాన్ కారకుడని, ఆయన ఉరిశిక్షకు అర్హుడని హప్పెల్ అనే బ్రిటిష్ అధికారి రిపోర్టు ఇచ్చినట్లు ఈ పుస్తక రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్ ఆధారాలతో వివరించారు.

అల్లూరి సీతారామరాజుకు తుపాకి శిక్షణ ఇచ్చి మన్యం పోరాటంలో కీలకపాత్ర పోషించిన వ్యక్తి షేక్ మదీనా. ఈయన బ్రిటిష్ ప్రభుత్వంలో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేశారు. ఉద్యోగ విరమణ చేసి ప్రస్తుత కాకినాడ జిల్లా పెద్దాపురంలో వుండేవారు. 1922లో ప్రారంభమైన మన్యం తిరుగుబాటు క్రమంగా సాయుధ తిరుగుబాటుగా మారింది. అయితే ఆ ఉద్యమ నాయకుడు అల్లూరికి గాని, ఆయన బృందంలోని ఇతరులకు గాని తుపాకి వినియోగించడం కొత్త. ఈ పరిస్థితుల్లో షేక్ మదీనాను రామరాజు సంప్రదించి శిక్షణ పొందినట్లు అందుబాటులో వున్న అనేక చారిత్రక ఆధారాలను ఈ పుస్తకంలో సయ్యద్ నశీర్ అహమ్మద్ పేర్కొన్నారు.

స్వాతంత్రోద్యమంలో ముస్లింల పాత్ర గురించి ఇప్పటికి 25 పుస్తకాలను అనేక ఆధారాలతో సయ్యద్ నశీర్ అహమ్మద్ ప్రచురించారు. లోతైన పరిశీలన, విభిన్న కోణాల్లో నిర్ధారించుకుని ఈ పుస్తకాలను ముద్రించడం ఈ రచయిత ప్రత్యేకత. కేంద్రంలో అధికారంలోవున్న శక్తులు చరిత్రను వక్రీకరించి, మతతత్వ వ్యాప్తికి ఉపయోగించుకుంటున్న పరిస్థితుల్లో వాస్తవ చరిత్ర ప్రజలకు కావాలి. ముఖ్యంగా చరిత్రపుటల్లో సరైన స్థానం లేని అనేకమంది చీకటి వీరుల జీవితాలు నేడు వెలుగులోకి తీసుకరావాలి. అందుకు సయ్యద్ నశీర్ అహమ్మద్ ఏడు పదుల వయసులో కృషి చేస్తుండడం అభినందనీయం. ఫుజులుల్లా ఖాన్– షేక్ మదీనాల గురించిన ఈ పుస్తకాన్ని విస్తృతంగా అధ్యయనం చేయాలి.

– లెనిన్ అన్విత్


సంగిశెట్టి శ్రీనివాస్‌కి ఎదిరెపల్లి మశమ్మ స్మారక పురస్కారం

ఎదిరెపల్లి మశమ్మ స్మారక జాతీయ పురస్కారానికి ఈ ఏడాది ప్రముఖ రచయిత చరిత్ర పరిశోధకులు డా.సంగిశెట్టి శ్రీనివాస్ ఎంపికయ్యారని పురస్కార కమిటీ చైర్మన్ ఎదిరెపల్లి కాశన్న తెలిపారు. 21.12.2025 ఆదివారం ఉదయం 10 గంటలకు నాగర్ కర్నూల్ సింగిల్ విండో హాల్లో జరిగే పురస్కార ప్రదాన సభకు ముఖ్య అతిథులుగా డాక్టర్ గోరటి వెంకన్న, డా.సుంకిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతారని, ఈ పురస్కారం కింద రూ.20 వేల నగదు, జ్ఞాపిక అందచేస్తామని తెలిపారు.

కలిమిశ్రీకి ఆచార్య రవ్వా శ్రీహరి స్మారక సాహితీ పురస్కారం

ద్రావిడ విశ్వవిద్యాలయం తొలి ఉపకులపతి, ఆధునిక తెలుగు నిఘంటుకర్త ఆచార్య రవ్వా శ్రీహరి స్మారక సాహితీ పురస్కారాన్ని మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కలిమిశ్రీకి అందజేస్తున్నట్టు అఖిల భారత పద్మశాలీయ సేవాసంఘం అధ్యక్ష కార్యదర్శులు తుమ్మ సత్యనారాయణ, సూరేపల్లి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగులో 50 గ్రంథాలు, సంస్కృతంలో 25 గ్రంథాలు రాసిన ఉభయ భాషా ప్రవీణుడి పేరుతో ఇస్తున్న పురస్కారాన్ని మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ ద్వారా సేవలందిస్తున్న కలిమిశ్రీకి ఇవ్వడం సముచితంగా భావిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ అవార్డును డిసెంబరు 21న విజయవాడలో నిర్వహిస్తున్న ప్రత్యేక సాహితీ కార్యక్రమంలో అందజేయనున్నారు.

ఎన్నో రంగుల జీవితం 'వర్ణం'



జీవితం ఒక కాన్వాస్. సప్త వర్ణాల కలబోత. అది రోజుకో రంగును పులుముకుంటుంది. ఎరుపులో చైతన్యం, పసుపులో ఆశ, ఆకుపచ్చలో నమ్మకం, నీలంలో విశాలత్వం, ఊదాలో ఊహలు. ఇంకా కొన్నిసార్లు తెలుపు లాంటి ప్రశాంతత ఉంటుంది. మరి కొన్నిసార్లు నలుపు లాంటి బాధ ఉంటుంది. కానీ రంగు లేని రోజు లేదు. ఈ సత్యాన్ని అవగతం చేసుకున్న ఈ యువ కవి అక్షరాలకు రంగులద్ది కాగితం అనే కాన్వాస్‌పై అద్భుతమైన భావాలను సృష్టించారు ఈ కవి. పేరు బోణం గణేష్. వృత్తి పాత్రికేయం, ప్రవృత్తి సాహిత్య సాంగత్యం. ఆయన రాసిన తొలి కవితా సంకలనమే ఈ వర్ణం.

గణేష్ పశ్చిమ గోదావరి జిల్లాలోని రామన్నగూడెం అనే ఓ పల్లెటూరిలో పుట్టారు. గోదావరి గుండెల్లో తీపి గురుతులెన్నో.. అంటూ ఆయన గోదారమ్మ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పచ్చని చేల మధ్య, నిశ్చలమైన కొలను చుట్టూ పూబంతిలా ఉండే మా ఊరు.. అంటూ తొలి పలుకుల్లో తన ఊరిని వర్ణించారు. 'పచ్చని పొలాల మట్టిలో సాగెను రైతు పయనం.. ప్రపంచానికి అన్నం పెట్టే అన్నదాతకు వందనం..' అనితన కవితల్లో మట్టివాసన చూపించారు. ఈ కవితా సంపుటిలో చైతన్యం, ప్రేమ సమపాళ్లలో కనిపిస్తున్నాయి. వృక్షవిలాపం కవితలో పర్యావరణంపై కవికి ఉన్న ప్రేమను వివరించారు. విలువైన ఓటు గురించి, మాతృభూమిని పరిరక్షించే సైనికుల గురించి, ఆడవారిపై జరుగుతున్న అకృత్యాల గురించి ఆయన తన కవితల ద్వారా చైతన్యం నింపే ప్రయత్నం చేశారు.

వర్ణం కవితా సంపుటి రెండు అధ్యాయాలుగా ఉంది. మొదటి దానిలో భిన్న కోణాలలో రాసిన కవితలు ఉండగా.. రెండో అధ్యాయంలో ప్రేమ భావాల సమాహారంగా సాగింది. ఇందులో మొత్తం 22 కవితలు ఉన్నాయి. అందులో ఆకర్షణ, తపన, వియోగం, ఆనందం, బాధ, ఆశ, నిరాశ.. ఇవన్నీ వివిధ వర్ణాలుగా కనిపిస్తాయి. ఈ కవితలన్నిటిలో ఓ భగ్న ప్రేమికుడి ఆవేదన విరహ వేదన కనిపిస్తుంది. 90వ దశకంలో ఇటువంటి భావావేశం కలిగిన కవితలను విని ఉన్నాం. కాలం మారిపోయింది. సెల్ ఫోన్ ప్రపంచాన్ని తీసుకువచ్చి అరచేతిలో పెట్టింది. ప్రేమలు కనుమరుగయ్యాయి. స్పందనలు కరువయ్యాయి. అయినా ఇటువంటి కాలంలో గణేష్ రాసిన కవితలు, వాటిలోని ప్రేమ ఆర్ధత చదివించేలా చేస్తాయి.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జర్నలిజం పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన బోణం గణేష్‌లో విభిన్న కళలు ఉన్నాయి. ఓ వైపు పాత్రికేయుడిగా విధులు నిర్వర్తిస్తూనే రచనలు చేస్తున్నారు. రెండు వైపులా అక్షరం సేద్యం కొనసాగిస్తున్నారు. మరోవైపు డాక్యుమెంటరీలు, షార్ట్ ఫిలింలు తీశారు. ఈ క్రమంలోనే ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి 'తెలుగు భాష సేవారత్న' అవార్డును అందుకున్నారు. ప్రతులకు : 95539 55798

– అనిల్ కుమార్ శిఖా
90100 70540

గంగవరపు సునీతకు సాహితీ పురస్కారం

ఉయ్యూరు కేంద్రంగా పనిచేస్తున్న డా. శ్రీమతి శ్రీకాకుళపు జాయ్ అడియల్ మేరీ రాయ్ స్మారక ట్రస్ట్ రెండవ ఏడాది ఉత్తమ సాహితీ పురస్కారానికి ప్రముఖ కవయిత్రి గంగవరపు సునీత ఎంపికయినట్లు ట్రస్టు చైర్మన్ శ్రీకాకుళపు రాజ్‌కుమార్ తెలిపారు. 2026 జనవరిలో విజయవాడలో ఎం3 (మాదిగ మిత్ర మండలి) ఆధ్వర్యంలో జరిగే సభలో ఈ అవార్డు కింద రూ. 25 వేల నగదు, షీల్డ్, శాలువాతో సత్కరిస్తారు. కార్యక్రమాన్ని అనిల్ డ్యాని నిర్వహిస్తారు.

– ఎం3 సాహితీ విభాగం

గూండ్ల వెంకటనారాయణకు యువ పురస్కారం

సాహిత్య స్ఫూర్తిని పెంపొందించేందుకు ఈశ్వర వరప్రసాద పరిషత్తు, గుంటూరు వారు ఇచ్చే యువ పురస్కారానికి ఈ ఏడాది యువకవి గూండ్ల వెంకటనారాయణ ఎంపికయ్యారు. ఆయన రాసిన 'ద్రావిడ మహాసముద్రం' వచన కవితా సంపుటికి ఈ అవార్డు దక్కింది. 21.12.2025 ఆదివారం ఉదయం 10 గంటలకు గుంటూరు బ్రాడీపేటలోని కొరటాల మీటింగ్ హాల్లో పురస్కార ప్రదానం జరుగుతుంది. గుంటూరు జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షులు కె.జె రమేష్ అధ్యక్షతన జరిగే సభలో ప్రముఖ కవి డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, ఈశ్వర్ వరప్రసాద పరిషత్తు కార్యదర్శి డాక్టర్ శెట్లం చంద్రమోహన్ పాల్గొంటారు.

– ఎస్ఎం సుభాని, నానా, శ్రీవశిష్ఠ,
నిర్వాహకులు



ఉద్భవ్ 2025 ఓ కళా ఉత్సవం

ఈ నెల 3, 4, 5 తేదీల్లో తాడేపల్లి దగ్గరలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ప్రాంగణంలో 6వ జాతీయ ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాలల కళా సాహిత్య సాంస్కృతిక పోటీలు– ఉద్భవ్ 2025 వైభవపేతంగా జరిగింది. ఇందులో 22 రాష్ట్రాల్లోని 405 ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల నుంచి 1644 మంది పాల్గొన్నారు. వీరికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆతిథ్యం కల్పించింది.

ఉద్భవ్ 2025 ప్రారంభోత్సవంలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం, రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో కలిసి మూడో తేదీ ఉదయం అట్టహాసంగా ప్రారంభించారు. ఇందులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు, NESTS కమిషనర్ అజిత్ కుమార్ శ్రీవాత్సవ, EMRS.. ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి ఎం.గౌతమితో పాటు ఇంకా గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మూడు రోజులపాటు వివిధ వేదికలపై సీనియర్, జూనియర్ విభాగాల్లో శాస్త్రీయ గిరిజన పాటల పోటీలు, కవితా పఠనం ఆంగ్ల కవిత్వం, ఆంగ్ల హిందీ భాషలలో వక్తృత్వ పోటీలు, సంగీత వాద్య పోటీలు, నాటికలు, దృశ్యకళల సంప్రదాయ కథనాల పోటీ మిమిక్రీ క్లాసికల్ సెమి క్లాసికల్ గాత్రకచేరి పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు శాస్త్రీయ సంగీతం, ఆశు కవిత్వ విభాగాల్లో బంగారు పతకాలను, దేశభక్తి బృంద గీతాలాపనలో రజతం... ఇలా మొత్తం మూడు పసిడి పతకాలతో సహా 12 పతకాలను గెలుచుకొని ఏడవ స్థానంలో నిలిచారు.. ఓవరాల్ ఛాంపియన్‌గా తెలంగాణ, 2, 3 స్థానాల్లో ఝార్ఖండ్, ఒడిస్సా; 4, 5, 6 స్థానాల్లో వరుసగా హిమాచల్ ప్రదేశ్, సిక్కిం, గుజరాత్ నిలిచాయి. ఉద్భవ్ 2025 కళా ఉత్సవంలో శ్రీకాళహస్తికి చెందిన శివ అనే విద్యార్థి మట్టితో నంది విగ్రహాన్ని పోటీ విభాగంలో రూపొందించి ప్రదర్శించి, కాళహస్తి ప్రాశస్త్యాన్ని గుర్తు చేస్తూ దేశం నలుమూలల నుండి విచ్చేసిన గిరిజన బాలబాలికల దృష్టిని విశేషంగా ఆకర్షించాడు.

ఉద్భవ్ 2025 లక్ష్యాలైన జాతీయ సమైక్యత సమగ్రతలను పెంపొందించడం, గిరిజన విద్యార్థుల్లో సామాజిక అవగాహన పెంపు చేయటం, విద్యార్థులలో జాతీయ సంస్కృతిపై గౌరవ ప్రతిష్టలు పెంపు చేసే సందర్భాలను కల్పించడం, గిరిజన వారసత్వాన్ని నిలబెట్టుకోవడంలో తమదైన సంగీతం సంస్కృతి నాట్యం, నాటక చిత్రకళలతో పాటు ఇతర ప్రదర్శనా కళలు అంతరించిపోకుండా కొనసాగించడంతోపాటు విద్యార్జనలో భాగంగా ఉన్నత ప్రమాణాలను సాధిస్తూనే విద్యేతర సాంస్కృతిక క్రీడా సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవడం అనే లక్ష్యాలను పరిపూర్ణంగా వ్యక్తం చేసుకునే వేదికగా ఈ ఉద్భవ్ 2025 సంపూర్ణ విజయాన్ని సాధించింది.

– మల్లేశ్వర రావు ఆకుల
79818 72655

పుదుచ్చేరిలో కొత్త రాజకీయ పార్టీ

● ఎల్‌జెకెను స్థాపించిన వ్యాపారవేత్త జోస్ ఛార్లెస్

పుదుచ్చేరి : వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ముందు పుదుచ్చేరిలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటయింది. లచ్చియా జననాయక కచ్చి (ఎల్‌జెకె) అనే పేరుతో వ్యాపారవేత్త జోస్ ఛార్లెస్ ఆదివారం ఒక పార్టీని స్థాపించారు. లాటరీ కింగ్‌గా పేరుగడించిన శాంటియాగో మార్టిన్ కుమారుడైన జోస్ ఛార్లెస్ తన సంస్థ జెసిఎం మక్కల మండ్రం ద్వారా గత కొన్ని నెలలుగా 'సంక్షేమ కార్యక్రమాలు' నిర్వహిస్తున్నారు. రానున్న పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఈ సంస్థను రాజకీయ సంస్థగా మార్చాలని జోస్ ఛార్లెస్ నిర్ణయించుకున్నారు. ఆదివారం పుదుచ్చేరిలోని పాండి మెరీనాలో జరిగిన కార్యక్రమంలో పార్టీని ప్రారంభిస్తున్నట్లు ఛార్లెస్ ప్రకటించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రపాలిత ప్రాంతాన్ని అభివృద్ధి చెందిన ప్రాంతంగా మారుస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం అధికారంలోఉన్న ఎఐఎన్‌ఆర్‌సి-బిజెపి ప్రభుత్వం నిరుద్యోగం, గృహనిర్మాణం, స్వచ్ఛమైన తాగునీరు, వైద్య సౌకర్యాలు వంటి సమస్యలను పరిష్కరించడంలో విఫలమయిందని విమర్శించారు. అలాగే, ఈ కార్యక్రమానికి అధికార బిజెపికి అనుబంధంగా ఉన్న ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు ఎం శివశంకర్, పి.అంగాలనే హాజరయ్యారు. ఎల్‌జెకె ప్రధాన కార్యదర్శుల్లో ఒకరిగా బిజెపి మంత్రి ఎ జాన్‌కుమార్ కుమారుడు రీగన్ జాన్ కుమార్‌ను నియమించారు.

ప్రేమ్‌చంద్‌కు బంగారు పతకం

ప్రజాశక్తి- విజయనగరం టౌన్



దుబాయ్ వేదికగా జరుగుతున్న యూత్ ఏషియన్ పారా గేమ్స్ - 2025లో పారా బాడ్మింటన్ క్రీడాకారుడు పొట్నూరు ప్రేమ్‌చంద్ బంగారు పతకం సాధించాడు. దీంతో, ప్రేమ్‌చంద్‌కు కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో దేశానికి మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించారు. ప్రేమ్‌చంద్ విజయం పట్ల పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్ హర్షం వ్యక్తం చేశారు.

విజయనగరంలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- కంటోన్మెంట్ (విజయనగరం)

ఎస్‌పి ఎఆర్ దామోదర్ ఆదేశాలతో విజయనగరంలో 80 ప్రాంతాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది ఆదివారం సాయంత్రం ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టారు. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు డిఎస్‌పిల ఆధ్వర్యాన సుమారు 400 మంది పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. రహదారి భద్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, నిబంధనలకు విరుద్ధంగా, వాహన పత్రాలు సక్రమంగా లేని వాహనాలను సీజ్ చేయడంతోపాటు హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. ఈ తనిఖీల్లో నలుగురు డిఎస్‌పిలు, 12 మంది సిఐలు, 33 మంది ఎస్‌ఐలతో సహా సుమారు 350 మంది సిబ్బందిని వినియోగించామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన సుమారు 50 మందికి జైలుశిక్ష విధించే విధంగా చర్యలు చేపట్టామన్నారు.

మెస్సి ఈవెంట్‌లో ఉద్రిక్తతల కేసు

శతద్రు దత్తాకు బెయిల్ నిరాకరణ

కొల్‌కతా : అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి కొల్‌కతా పర్యటన సందర్భంగా స్టేడియంలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటన కేసులో అరెస్టయిన ఈవెంట్ నిర్వాహకుడు శతద్రు దత్తాకు కోర్టు బెయిల్ నిరాకరిచింది. 14 రోజుల పోలీస్ కస్టడి విధించింది. ఈ కేసులో అరెస్టు అనంతరం శతద్రును బిధాన్నగర్ కోర్టులో హాజరుపరిచారు. కోర్టు 14 రోజుల కస్టడి విధించడంలో ఈవెంట్ ప్రణాళిక, అనుమతులు, కార్యచరణ నిర్ణయాలపై పోలీసులు అతడిని విచారించే అవకాశం ఉంది. ఇదిలాఉండగా.. ఉద్రిక్తతలు చోటుచేసుకోవడంపై విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. కొల్‌కతా హైకోర్టు రిటైర్డ్ జడ్జీ జస్టిస్ అషిమ్ కుమార్ నేతృత్వంలోని ఆ కమిటి ఆదివారం స్టేడియంను పరిశీలించింది. సిసిటివి దృశ్యాలను కూడా పరిశీలించనుంది ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్, హోం కార్యదర్శి నందిని చక్రవర్తి ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. ఉద్రిక్తలకు దారి తీసిన పరిస్థితుల గురించి, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలు గురించి ఈ కమిటీ సిఫార్సు చేయనుంది.

'గోట్ టూర్ ఆఫ్ ఇండియా'లో భాగంగా మెస్సి తొలుత కొల్‌కతాకు వెళ్లాడు. అక్కడి సాల్ట్‌లేక్ స్టేడియంలో చెప్పినదాని కంటే తక్కువ సమయం గడపడంతో అభిమానులు ఆగ్రహానికి గురయ్యారు. దీంతో స్టేడియంలో సీసాలు, ప్లాస్టిక్ కుర్చీలను మైదానంలోకి విసిరేశారు. ఫలితంగా అక్కడ ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. అనంతరం పోలీసులు రంగంలోకి దిగి వారి చెదరగొట్టారు.




పొలం గట్లు మీదుగా రేషన్ తెచ్చుకుంటున్న గిరిజన మహిళలు

రేషన్ కోసం గిరిజనుల పాట్లు

ప్రజాశక్తి- వీరఘట్టం (పార్వతీపురం మన్యం జిల్లా)

ప్రతి నెలా రేషన్ కోసం పాట్లు తప్పడం లేదని వీరఘట్టం మండలంలోని దశమంతపురం సచివాలయం పరిధిలోగల పెద్దూరు గిరిజన గ్రామానికి చెందిన ఆరిక సంపంగి, జయమ్మ, బాపమ్మ, నిమ్మక సోమమ్మ, సరోజిని తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా గ్రామానికి వచ్చి వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేసేవారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాహనాలకు స్వస్తి పలకడంతో రేషన్ కోసం ప్రతి నెలా 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న దశమంతపురానికి పొలం గట్లు, తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ దాటి ఆ గ్రామానికి వెళ్లి రేషన్ సరుకులు మోసుకొని రావాల్సిన పరిస్థితి నెలకొందని వారు తెలిపారు. గ్రామంలో సబ్ డిపో ఏర్పాటు చేయాలని గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేసినా ఫలితం లేకపోయిందని వాపోయారు. ఆర్థిక ఇబ్బందులతో పాటు వ్యయ ప్రయాసలకు గురువుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తమ గ్రామంలో సబ్‌డిపో ఏర్పాటు చేసి రేషన్ సరుకులు అందించేలా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.



పురస్కారాలు అందుకుంటున్న వర ముళ్లపూడి, అరసవల్లి గిరిధర్, హరి వెంకటరమణ

తెలుగును వెలిగించిన చిరస్మరణీయులు బాపు

పురస్కారాల ప్రదానోత్సవంలో గజల్ శ్రీనివాస్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

తెలుగువారు ఉన్నంతకాలం బాపు సినిమాలు, చిత్రాలు, కార్టూన్లు సజీవంగా ఉంటాయని సుప్రసిద్ధ గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. గుంటూరులోని భారతీయ విద్యాభవన్‌లో ఆదివారం బాపు-రమణ-బాలు కళాపీఠం, మల్లెతీగ సంయుక్త ఆధ్వర్యంలో బాపు జయంతి సందర్భంగా బాపు స్మారక పురస్కారాల సభ జరిగింది. సభలో సినీ దర్శకులు వర ముళ్లపూడి, చిత్రకారుడు అరసవల్లి గిరిధర్, కార్టూనిస్టు హరి వెంకటరమణకు బాపు స్మారక పురస్కారాలను సంస్థ అధినేత డాక్టర్ ఎస్‌ఎస్‌వి రమణ అందజేశారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీతలు మాట్లాడుతూ బాపుతో వారికున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన గజల్‌శ్రీనివాస్ మాట్లాడుతూ అందమైన స్త్రీని బాపు బొమ్మగా మనం ప్రశంసిస్తున్నామంటే అది బాపు చిత్రాలకున్న గొప్పతనమన్నారు. తెలుగు అమ్మ ఒడి భాష కావాలని, తెలుగును అధికార భాషకంటే ముందు మన మమకార భాషగా గుర్తించాలని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. బాపు-రమణ-బాలు కళాపీఠం వ్యవస్థాపకులు డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ బాపును స్మరించుకోవడం మన అదృష్టంగా భావించాలన్నారు. స్మరణ కూడా మరణాన్ని కొంతకాలం వాయిదా వేస్తుందన్నారు. సుప్రసిద్ధ రచయిత డాక్టర్ ఎం.ప్రభాకర్ మాట్లాడుతూ బాపు సినిమాల్లోని కొన్ని ముఖ్య సన్నివేశాల్ని, పాటల్ని గుర్తు చేసి సభకుల్ని అలరించారు. బాపు ప్రతిభను తెలిపే సంగతుల్ని సాహితీ సమాఖ్య గుంటూరు కార్యదర్శి ఎస్‌విఎస్.లక్ష్మీనారాయణ గుర్తు చేశారు. మల్లెతీగ కలిమిశ్రీ మాట్లాడుతూ దర్శకుడిగా, చిత్రకారుడిగా, కార్టూనిస్టుగా సేవలందించి బాపు తన ప్రతిభను కళా సాంస్కృతిక సంపదను రేపటి తరాలకు దాచి ఉంచారని చెప్పారు.

ఇక 'ఉన్నత విద్య'పై కేంద్రం నజర్

● నియంత్రణ వ్యవస్థలో భారీ మార్పులు
● వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు-2025తో సిద్ధం
● ఒకే 'గొడుగు సంస్థ' కిందకు యుజిసి, ఎఐసిటిఇ, ఎన్‌సిటిఇ వంటి సంస్థలు
● బిల్లుపై విద్యావేత్తలు, నిపుణుల ఆందోళన



న్యూఢిల్లీ : ఇక దేశంలోని ఉన్నత విద్య నియంత్రణ వ్యవస్థపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ నియంత్రణ వ్యవస్థను పూర్తిగా మార్చేందుకు కేంద్రం సిద్ధమైంది. ఈ శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు-2025 ద్వారా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజిసి) సహా పలు నియంత్రణ సంస్థలను రద్దు చేసి, ఒకే 'గొడుగు సంస్థ' కిందకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ బిల్లు ద్వారా 12 మంది సభ్యులతో కూడిన వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ (విబిఎస్‌ఎ) అనే అత్యున్నత కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీని కింద నియంత్రణ (వినిమయన్), అక్రిడిటేషన్ (గుణవత్త), ప్రమాణాలు (మానక్) అనే మూడు వేర్వేరు కౌన్సిళ్లు పని చేస్తాయి. ఈ మూడు కౌన్సిళ్లు ఒక్కోటి గరిష్టంగా 14 మంది సభ్యులతో పని చేయనున్నది.

ఈ బిల్లు అమల్లోకి వస్తే ఇప్పటి వరకు ఉన్న యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజిసి), టెక్నికల్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ (ఏఐసిటిఇ), టీచర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్(ఎన్‌సిటిఇ) వంటి సంస్థల బాధ్యతలు విబిఎస్‌ఎ అనే ఈ కొత్త వ్యవస్థలో విలీనం అవుతాయి. అలాగే యుజిసికి ఉన్న నిధుల (గ్రాంట్లు) పంపిణీ అధికారం ప్రభుత్వం చేతికి వెళ్లనున్నది. ఆ బాధ్యతను నేరుగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుంది. అయితే ఆ యంత్రాంగం ఎలా పని చేస్తుందో బిల్లులో స్పష్టత లేదు. కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, కాలేజీలు, సాంకేతిక, ఉపాధ్యాయ శిక్షణ సంస్థలు, జాతీయ ప్రాధాన్యత గల సంస్థలు, ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎమినెన్స్ వంటి సంస్థలు ఈ చట్టం కిందకు వస్తాయి. మెడిసిన్, లా, డెంటిస్ట్రీ వంటి వృత్తి విద్యా కోర్సులు మినహాయింపులో ఉన్నాయి. అలాగే విదేశీ విశ్వవిద్యాలయాలు భారత్‌లో క్యాంపస్‌లు పెట్టేందుకు ప్రమాణాలు నిర్ణయించే అధికారం, భారత విశ్వవిద్యాలయాలు విదేశాల్లో క్యాంపస్‌లు ఏర్పాటు చేయడానికి అనుమతులు ఈ కొత్త నియంత్రణ మండలికి ఉంటాయి. ఈ బిల్లుపై విద్యావేత్తలు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యా స్వతంత్రత, ఫెడరలిజంపై సందేహాలు వెలుబచ్చుతున్నారు. 2018లో తీసుకొచ్చిన హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (హెచ్‌ఈసీఐ) బిల్లు లాగే ఈ తాజా బిల్లును పోల్చుతున్నారు. ఈ బిల్లు.. చట్టంగా మారితే కేంద్రానికి ఎక్కువ అధికారాలుంటాయనీ, రాష్ట్రాల పాత్ర పరిమితమవుతుందనీ, అకడమిక్ స్వతంత్రతకు ముప్పు ఉంటుందని చెబుతున్నారు. కాబట్టి విద్యా స్వతంత్రత, ఫెడరలిజం, రాష్ట్రాల పాత్రపై విస్తృత చర్చ అవసరమని స్పష్టం చేస్తున్నారు.

విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

మార్చి 18న చలో ఢిల్లీ

● ఎన్‌సిసిఒఇఇఇ సమావేశం నిర్ణయం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లుకు వ్యతిరేకంగా మార్చి 18న చలో ఢిల్లీ చేపట్టనున్నట్లు నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అండ్ ఇంజనీర్స్ (ఎన్‌సిసిఒఇఇఇ) వెల్లడించింది. ఈ కార్యక్రమం తరువాత కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ ప్రయత్నాలను వెనక్కి తీసుకోకపోయినా, ముసాయిదా విద్యుత్ (సవరణ) బిల్లును ఉపసంహరించుకోకపోయినా విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు దేశవ్యాప్త సమ్మెకు దిగవలసి వస్తుందని హెచ్చరించింది. ఆదివారం నాడిక్కడ సిఐటియు కేంద్ర కార్యాలయం (బిటి రణదివే భవన్)లో విద్యుత్ రంగానికి సంబంధించిన ప్రధాన భాగస్వాములైన ఉద్యోగులు, వినియోగదారుల మధ్య విస్తృత ఐక్యతను, సమన్వయ చర్యలను నిర్మించడంతో విద్యుత్ హక్కును, మన దేశ ఇంధన భద్రతను పరిరక్షించడం కోసం సమావేశం జరిగింది. దర్శన్‌పాల్ సింగ్, మోహన్ శర్మ, విద్యా సాగర్ గిరి అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో ఎన్‌సిసిఇఇఇ, కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త వేదిక, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) జాతీయ నాయకత్వం పాల్గొన్నారు. దేశంలోని కార్మికులు, రైతాంగంపై జరుగుతున్న దాడులను ఈ సమావేశం తీవ్రంగా పరిగణించింది. విద్యుత్ ప్రైవేటీకరణ, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటరింగ్, ముసాయిదా విద్యుత్ (సవరణ) బిల్లుపై చర్చ జరిగింది. పూర్వాంచల్, దక్షిణాంచల్ విద్యుత్ వితరణ నిగమ్ లిమిటెడ్‌లను ప్రైవేటీకరించడానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న మొండి ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో అణుశక్తి చట్టం, సివిల్ లిబర్టీ ఆఫ్ న్యూక్లియర్ డమేజ్ చట్టానికి సవరణల బిల్లులను ప్రభుత్వం తీసుకొచ్చే అవకాశ ఉందని సమావేశంలో చర్చించారు. ఈ బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెడితే ఎన్‌సిసిఒఇఇఇ, కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త వేదిక, ఎస్‌కెఎం దేశవ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయించాయి. విద్యుత్ ప్రైవేటీకరణకు, ముసాయిదా విద్యుత్ (సవరణ) బిల్లుకు వ్యతిరేకంగా జనవరి-ఫిబ్రవరి నెలల్లో దేశవ్యాప్తంగా భారీ సదస్సులు, ర్యాలీలతో కూడిన ఉమ్మడి ప్రచార కార్యక్రమం నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఎన్‌సిసిఒఇఇఇ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు మార్చి 18న ఢిల్లీకి మార్చ్ నిర్వహించాలని, ఈ కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని అన్ని కార్మిక, రైతు సంఘాలకు ఎన్‌సిసిఒఇఇఇ విజ్ఞప్తి చేసింది.

శివానీకి రజతం

- 69వ జాతీయ స్కూల్ గేమ్స్



హైదరాబాద్ : 69వ జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ టోర్నమెంట్‌లో తెలంగాణకు చెందిన స్విమ్మర్లు కర్రా శివానీ, నందిగమ్ శివకుమారి సత్తా చాటారు. ఆదివారం న్యూఢిల్లీలో జరిగిన బాలికల 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఫైనల్లో శివానీ 31.98 సెకన్ల టైమింగ్‌తో రెండో స్థానంలో నిలిచి రజతం దక్కించుకోగా, శివకుమారి 33.56 సెకన్లతో కాంస్యం ఖాతాలో వేసుకుంది. ఇదే విభాగంలో పోటీపడ్డ శ్రేయా బినిల్ 31.67 సెకన్లతో స్వర్ణం సొంతం చేసుకుంది.

'యువ' భారత్ ఘన విజయం

- అండర్ -19 ఆసియా కప్‌లో పాకిస్తాన్ ఘోర ఓటమి

దుబాయ్: అండర్-19 ఆసియా కప్‌లో భారత్ వరుసగా రెండో విజయం అందుకుంది. ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో యువ భారత్ 90 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 49 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 46.1 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన పాకిస్తాన్.. భారత బౌలర్ల ధాటికి 41.2 ఓవర్లలో 150 పరుగులకే ఆలౌటైంది. హుజైఫా అహ్సాన్ (70; 83 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) మాత్రమే రాణించాడు. ఫర్హాన్ యూసుఫ్ (23), ఉస్మాన్ ఖాన్ (16) పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. భారత బౌలర్లలో దీపేశ్ దేవేంద్రన్ 3, చౌహాన్ 3, కిషన్ కుమార్ సింగ్ 2, ఖిలాన్ పటేల్, వైభవ్ సూర్యవంశీ ఒక్కో వికెట్ పడగొట్టారు. భారత బ్యాటర్లలో ఆరోన్ జార్జి (85; 88 బంతుల్లో, 12 ఫోర్లు, 1 సిక్స్), కనిష్క్ చౌహాన్ (46; 46 బంతుల్లో, 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఆయుష్ మాత్రే (38; 25 బంతుల్లో, 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. అభిజ్ఞాన్ కుండు (22). యుఎఇతో మ్యాచ్‌లో సూపర్ సెంచరీ చేసిన వైభవ్ సూర్యవంశీ (5) ఈ మ్యాచ్‌లో విఫలమయ్యాడు. పాక్ బౌలర్లలో మహ్మద్ సయ్యమ్ 3, అబ్దుల్ సుభాన్, నికబ్ సాఫిక్ చెరో రెండు, అహ్మద్ హుస్సేన్, అలీ రజా తలో వికెట్ తీసుకున్నారు.



వాంగ్‌చుక్ సంస్థకు పార్లమెంటరీ ప్యానెల్ ప్రశంసలు

న్యూఢిల్లీ : ప్రముఖ సామాజిక కార్యకర్త, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ నిర్వహిస్తున్న హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్స్ (హెచ్‌ఐఎల్)కు విద్య, మహిళలు, యువత మరియు క్రీడలపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ప్రశంసలు లభించాయి. ఈ సంస్థ ఆదర్శనీయంగా పనిచేస్తోందని, యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) గుర్తింపునకు అన్ని విధాల అర్హత కలిగియుందని కాంగ్రెస్ ఎంపి దిగ్విజయ్ సింగ్ నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ పేర్కొంది. అయితే ఇప్పటి వరకు యుజిసి గుర్తింపు ఇవ్వకుండా పెండింగ్‌లో ఉంచడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఇందుకు సంబంధించిన నివేదికను పార్లమెంటులో ప్రవేశపెట్టింది. హెచ్‌ఐఎల్ నమూనాను కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ నిశితంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని కమిటీ సూచించింది. విద్య, పరిశోధన, వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థతో పాటు స్థానిక సామాజిక-సాంస్కృతిక, పర్యావరణంలో అనుభవ పూర్వక విద్య, అభ్యాసాన్ని అమలు చేయడంలో హెచ్‌ఐఎల్ అపూర్వ విజయం సాధించిందని కమిటీ తెలిపింది. లడఖ్‌కు రాష్ట్ర హోదా మరియు ఆరవ షెడ్యూల్ హోదాను కోరుతూ సోనమ్ వాంగ్‌చుక్ పోరాడుతున్నారు. ఇదే డిమాండ్‌తో ఇటీవల ఆయన నిరాహారదీక్ష చేపట్టిన నేపథ్యంలో హింస చోటుచేసుకొని నలుగురు మరణించగా, 90 మంది గాయపడిన సంగతి తెలిసిందే. హింసను ప్రేరేపించారని ఆరోపిస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబర్ 26న వాంగ్‌చుక్‌ను కఠినమైన జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టు చేసింది కూడా. అనంతరం లడఖ్ యంత్రాంగం కక్షపూరితంగా హెచ్‌ఐఎల్‌కు భూమి కేటాయింపును రద్దు చేసింది. విదేశీ సహకార (నియంత్రణ) చట్టం (ఎఫ్‌సిఆర్‌ఎ) ఉల్లంఘించిందని ఆరోపిస్తూ కేంద్ర హోంశాఖ ఆ సంస్థ ఎఫ్‌సిఆర్‌ఎ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో పార్లమెంటరీ కమిటీ నివేదికకు ప్రాధాన్యత ఏర్పడింది.

పొగమంచుతో వాహనాల ఢీ

- హర్యానాలో వేర్వేరు చోట్ల ప్రమాదాలు

చండీగఢ్ : హర్యానాలో గత కొన్ని రోజులుగా తీవ్రమైన చలిగాలులు వీస్తున్నాయి. పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 4-6డిగ్రీల సెల్సియస్‌కి పడిపోయాయి. దట్టమైన పొగమంచు కప్పేయడంతో రహదారుల్లో ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేకపోవడంతో వాహనాలు పరస్పరం ఢీకొంటున్నాయి. శని, ఆదివారాల్లో ఇలాంటి ఘటనలు పలుచోట్ల చోటుచేసుకున్నాయి. హిసార్‌లోని 52వ జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో రెండు ప్రభుత్వ బస్సులు ఇతర వాహనాలను ఢీకొన్నాయి. ప్రభుత్వ బస్సు ట్రక్కును ఢీకొట్టిన తర్వాత ఈ రెండు వాహనాలను మరో ప్రభుత్వ బస్సు ఢీ కొట్టింది. అనంతరం కారు, మోటార్ సైకిల్‌లు వరుసగా ఢీకొట్టినట్లు అధికారులు వెల్లడించారు. మోటార్‌బైక్‌పై వ్యక్తి స్వల్పగాయాలు కాగా అతనిని ఆస్పత్రిలో చేర్చామని చెప్పారు. మరో ఘటన జాతీయ రహదారి 352పై చోటు చేసుకుంది. రేవారిలో పొగమంచుతో విజిబిలిటీ తక్కువగా ఉండటంతో సుమారు నాలుగు బస్సులు ఒకదానినొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో గాయపడిన వారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. శనివారం ఢిల్లీ -ఎన్‌సిఆర్ ప్రాంతంలో దట్టమైన పొగమంచుతో నొయిడా ఎక్స్‌ప్రెస్‌వే పై కార్లు, ట్రక్కులు సహా 12కి పైగా వాహనాలు ఢీకొన్న సంగతి తెలిసిందే.

దక్షిణాఫ్రికాలో కుప్పకూలిన అహోబిలం ఆలయం

- నలుగురు మృతి

పీటర్‌మార్టిజ్‌బర్గ్ : దక్షిణాఫ్రికాలో నిర్మాణంలో ఉన్న ఆలయం కుప్ప కూలిన ఘటనలో భారత సంతతికి చెందిన ఆలయ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు, నిర్మాణ ప్రాజెక్టు మేనేజర్ విక్కీ జైరాజ్ పాండే (52) సహా నలుగురు చనిపోయారు. క్వాజులు నాటల్ ప్రావిన్స్‌లోని వెరులంలో రెడ్‌క్లిప్ వద్ద ఈ ఘటన గత శుక్రవారం చోటుచేసుకుంది. శిథిలాల కింద ఎంత మంది చిక్కుకున్నారనే విషయంపై స్పష్టతలేదన్నారు. దీంతో చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావడానికి శని, ఆదివారాల్లోనూ సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. టన్నులకొద్దీ శిథిలాలు ఉండటంతో.. వాటిని తొలగించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదని తెలిపారు. ఇక్కడ స్థిరపడిన ఒక హిందూ కుటుంబం 'న్యూ అహోబిలం' పేరుతో నాలుగు అంతస్థుల ఆలయ నిర్మాణాన్ని చేపట్టింది. నిర్మాణ పనుల కొనసాగుతుండగా ప్రమాదం చోటుచేసుకుంది.

ఎగుమతుల్లో దక్షిణాది ముందడుగు

- పుంజుకుంటున్న తమిళనాడు, తెలంగాణ
- వెనుకబడిన గుజరాత్, మహారాష్ట్ర



న్యూఢిల్లీ : దేశం నుంచి జరుగుతున్న ఎగుమతుల్లో నయా ట్రెండ్ కన్పిస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో తమిళనాడు, తెలంగాణ నుంచి గణనీయంగా ఎగుమతులు జరిగాయి. అదే సమయంలో ఉత్తరాదిలోని గుజరాత్, మహారాష్ట్ర నుంచి ఎగుమతులు పడిపోయాయి. అయినప్పటికీ ఇప్పటికీ గుజరాత్ నుంచే అధిక ఎగుమతులు జరుగుతుండడం గమనార్హం. ఎగుమతి విలువలో తమిళనాడు 19.6 శాతం, తెలంగాణ 36.3 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నాయి. సంప్రదాయపరంగా చూస్తే మహారాష్ట్ర, గుజరాత్ నుంచి ఎక్కువగా ఎగుమతులు జరుగుతుంటాయి. అయితే గత ఆర్థిక సంవత్సరంలో గుజరాత్ ఎగుమతుల విలువ 13.4 శాతం, మహారాష్ట్ర ఎగుమతుల విలువ రెండు శాతం పడిపోయింది.

మొత్తంగా చూస్తే ఇప్పటికీ ఎగుమతుల్లో గుజరాత్‌దే అగ్రస్థానం. ఆర్‌బిఐ డేటా ప్రకారం గత ఆర్థిక సంవత్సరంలో ఆ రాష్ట్రం నుంచి 116.3 బిలియన్ డాలర్ల విలువ కలిగిన ఎగుమతులు జరిగాయి. అయితే 2023-24లో జరిగిన 134.4 బిలియన్ డాలర్ల విలువ కలిగిన ఎగుమతులతో పోలిస్తే ఇది 18 బిలియన్ డాలర్లు తక్కువ. తమిళనాడు నుంచి 2023-24లో 43.6 బిలియన్ డాలర్ల విలువ కలిగిన ఎగుమతులు జరగ్గా గత ఏడాది ఏకంగా 52.1 బిలియన్ డాలర్ల విలువ కలిగిన ఎగుమతులు జరిగాయి. అంటే ఎగుమతుల విలువలో 17.6 శాతం వృద్ధి కన్పించింది. 2021-22లో ఆ రాష్ట్రం నుంచి 26.15 బిలియన్ డాలర్ల విలువ కలిగిన ఎగుమతులు జరగ్గా అవి క్రమేపీ పెరుగుతూ వస్తున్నాయి. గడచిన ఐదు సంవత్సరాల కాలంలో తమిళనాడు నుంచి జరిగిన ఎగుమతుల విలువ దాదాపు రెట్టింపు అయింది. తమిళనాడు నుంచి ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతులు నిలకడగా పెరుగుతున్నాయి. మరో దక్షిణాది రాష్ట్రమైన తెలంగాణ విషయానికి వస్తే 2023-24లో జరిగిన ఎగుమతుల విలువ 14 బిలియన్ డాలర్లు. అది గత ఆర్థిక సంవత్సరంలో 19.1 బిలియన్ డాలర్లకు...అంటే 36.3 శాతం పెరిగింది. 2020-21లో జరిగిన ఎగుమతుల విలువ 8.7 బిలియన్ డాలర్లతో పోలిస్తే ఇది రెట్టింపు కంటే ఎక్కువే. సంప్రదాయ ఇంజినీరింగ్ వస్తువులకు తెలంగాణ హబ్‌గా కొనసాగుతుండగా తమిళనాడులో ఎలక్ట్రానిక్ వస్తువులకు సంబంధించిన కొత్త పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నాయి. ఎగుమతుల విషయానికి వస్తే తమిళనాడు, తెలంగాణ, కర్నాటక, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ మంచి పురోగతి సాధిస్తున్నాయి. 2023-24లో ఆంధ్రప్రదేశ్ ఎగుమతుల విలువ 19.8 బిలియన్ డాలర్లు ఉండగా గత సంవత్సరం అది 20.8 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఇదే కాలంలో కర్నాటక ఎగుమతులు విలువ కూడా 26.6 బలియన్ డాలర్ల నుంచి 30.5 బిలియన్ డాలర్లకు చేరింది.

కొన్ని దక్షిణాది రాష్ట్రాలు ఎగుమతుల విషయంలో మంచి పురోగతి సాధిస్తుంటే సంప్రదాయకంగా ఎగుమతులకు ప్రసిద్ధి చెందిన గుజరాత్, మహారాష్ట్ర వెనుకబడి పోతున్నాయి. 2023-24తో పోలిస్తే గత ఆర్థిక సంవత్సరంలో ఎగుమతుల విలువ గణనీయంగా పడిపోయిన రాష్ట్రాల్లో గుజరాత్, హర్యానా, ఢిల్లీ, పంజాబ్, కేరళ ఉన్నాయి. పెట్రోకెమికల్స్, రత్నాలు-ఆభరణాలు, వస్త్ర పరిశ్రమకు ప్రసిద్ధి చెందిన గుజరాత్‌లో 2023-24లో కూడా ఎగుమతుల విలువ తగ్గింది. ఎగుమతులకు పేరెన్నికగన్న మహారాష్ట్రలోనూ అది పరిస్థితి. అంతర్జాతీయ చమురు మార్కెట్లలో నెలకొన్న అస్తవ్యస్థ పరిస్థితుల కారణంగా గుజరాత్ నుంచి, ఇతర రాష్ట్రాలతో పోటీపడలేక మహారాష్ట్ర నుంచి ఎగుమతులు తగ్గుతున్నాయని నిపుణులు తెలిపారు.

మావోయిస్టుల ప్రభావం తగ్గిపోయింది !

- ఆర్థికంగా బాగా దెబ్బతీశాం
- కేంద్ర ప్రభుత్వ ప్రకటన

న్యూఢిల్లీ : దేశంలో మావోయిస్టుల ప్రభావం బాగా తగ్గిపోయిందని, వారి ఆర్థిఖ మూలాలను కూడా దెబ్బతీశామని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. గడచిన 11 సంవత్సరాల కాలంలో పలు భద్రతా సంస్థలు మావోయిస్టులను ఆర్థికంగా దెబ్బతీశాయని, రూ.92 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నాయని, వారి సమాచార యుద్ధ వ్యవస్థలలోకి ప్రవేశించి వాటిని తీవ్రంగా నియంత్రించడం ద్వారా అర్బన్ నక్సల్స్‌కు నైతిక, మానసిక నష్టాన్ని కలిగించాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 'ఎన్‌ఐఎలో మావోయిస్టులకు వ్యతిరేకంగా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడంతో అది రూ.40 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకుంది. రాష్ట్రాలు మరో రూ.40 కోట్లకు పైగా స్వాధీనం చేసుకున్నాయి. రూ.12 కోట్లను ఈడీ జప్తు చేసింది. ఏకకాలంలో తీసుకున్న చర్యల కారణంగా అర్బన్ నక్సల్స్ నైతికంగా, మానసికంగా నష్టపోయారు' అని వివరించింది. 2014లో దేశంలో మావోయిస్టు ప్రభావానికి తీవ్రంగా గురైన జిల్లాలు 36 ఉండగా ఈ ఏడాది వాటి సంఖ్య మూడుకు తగ్గిందని కేంద్రం చెప్పింది. భద్రతా బలగాల ఆపరేషన్లలో ఈ ఏడాది ఇప్పటి వరకూ 317 మంది మావోయిస్టులు మరణించారని, 862 మంది అరెస్టయ్యారని, 1,973 మంది లొంగిపోయారని పేర్కొంది. గత సంవత్సరం ఒక కేంద్ర కమిటీ సభ్యుడు, ఈ ఏడాది ఐదుగురు సహా మొత్తం 28 మంది కీలక మావోయిస్టు నేతలు లొంగిపోవడమో, అరెస్టవడమో లేదా ఎన్‌కౌంటర్లలో చనిపోవడమో జరిగిందని వివరించింది. 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్‌లో 27 మంది మావోయిస్టులు చనిపోయారు. మే 23న బీజపూర్‌లో 24 మంది లొంగిపోయారు. అక్టోబరులో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో 258 మంది లొంగిపోయారు. వీరిలో పది మంది సీనియర్ నేతలు. 2014లో దేశంలో మావోయిస్టు ప్రభావిత జిల్లాలు 126 ఉంటే ఇప్పుడు 11 మాత్రమే ఉన్నాయి. గత పది సంవత్సరాలలో పటిష్టవంతమైన పోలీస్ స్టేషన్ల సంఖ్య 66 నుంచి 586కు పెరిగింది. దేశంలో తీవ్రవాద సంబంధమైన ఘటనల సంఖ్య తగ్గింది. 2013లో 76 జిల్లాల్లో 330 ఘటనలు నమోదు కాగా ఈ ఏడాది జూన్ నాటికి 22 జిల్లాల్లో 52 ఘటనలు నమోదయ్యాయి. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ప్రభుత్వం తీసుకుంటున్న పలు చర్యల కారణంగా దేశంలో గడచిన 11 సంవత్సరాలలో నక్సల్స్ హింస 70 శాతం తగ్గింది' అని ప్రభుత్వం ఆ ప్రకటనలో వివరించింది. 2026 మార్చి 31 నాటికల్లా దేశాన్ని మావోయిస్టు రహితంగా మార్చాలని గడువు నిర్దేశించుకున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పదేపదే ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే.

ఇజ్రాయిల్ చర్యలు శాంతికి విఘాతం

- హమాస్ నేత వెల్లడి

కైరో : కాల్పుల విమరణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ ఇజ్రాయిల్ పదేపదే దాడులకు పాల్పడుతుండటం గాజా ప్రాంతంలో శాంతి ప్రయత్నాలకు తీవ్ర విఘాతం కలిగిస్తోందని హమాస్ తరపున శాంతి చర్చల్లో పాల్గొన్న ప్రధాన సంధానకర్త (ఛీఫ్ నెగోషియేటర్) ఖలీల్ అల్ హయ్యా అన్నారు. ఈ నెల 13న హమాస్ కమాండర్లను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో సీనియర్ కమాండర్ రయీద్ సయీద్ హత్యకు గురైనట్లు ఖలీల్ ధ్రువీకరించారు. ఇజ్రాయిల్ పదేపదే కాల్పుల విరమణను ఉల్లంఘించి ఇలా దాడులకు తెగించడం శాంతి ప్రక్రియకు తీవ్ర విఘాతం కల్గిస్తోందని తెలిపారు. కాల్పుల విరమణ ఒప్పందానికి హామీదారుగా ఉన్న అమెరికా ప్రభుత్వ యంత్రాంగం, ఆ దేశ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ తక్షణమే జోక్యం చేసుకొని ఇజ్రాయిల్ కాల్పుల విరమణకు కట్టుబడివుండేలా చర్యలు తీసుకోవాలని ఖలీల్ డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ హత్య చేసిన సయీద్ ..హమాస్‌లో అత్యంత కీలక నేత. సాయుధ దళానికి అధిపతిగా ఉన్న ఐజ్ ఎల్దీన్ అల్ హదద్ తర్వాతి నేతగా సయీద్‌కు పేరుంది.

ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ స్టెబిలైజేషన్ ఫోర్స్ (ఐఎస్‌ఎఫ్) ఏర్పాటుపైనా హయ్యా స్పందించారు. ఐఎస్‌ఎఫ్ బలగాలు కేవలం కాల్పుల విరమణ ఒప్పందం అమలయ్యేలా చూడడానికి, గాజా సరిహద్దుల వెంబడి ఇరు పక్షాలను వేరు చేయడానికి మాత్రమే పరిమితం కావాలన్నారు. అంతేగానీ గాజా స్ట్రిప్‌లో ఐఎస్‌ఎఫ్‌కు ఎటువంటి పాత్ర ఉండరాదని, అంతర్గత వ్యవహారాల్లో ఏపాటి జోక్యం కూడా చేసుకోరాదని హయ్యా పేర్కొన్నారు.

చికిత్స అందేదెన్నడో !

ఇజ్రాయిల్ బాధిత క్షతగాత్రుల కన్నీటి వ్యథ

గాజా స్ట్రిప్ : ఇజ్రాయిల్ మారణహోమంలో వికలాంగులుగా మారిన వేలాది మంది గాజా వాసులు తమ జీవితాలు తిరిగి ఎప్పుడు గాడిన పడతాయో తెలియక ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. వైద్య చికిత్స కోసం ఇతర దేశాలకు వెళ్లాలనుకుంటున్న బాధితులకు ఇజ్రాయిల్ అమానవీయంగా అనుమతి నిరాకరిస్తోంది. వేల సంఖ్యలో పాలస్తీనియన్లు ఎదురు చూస్తుంటే పదుల సంఖ్యలో మాత్రమే అనుమతి ఇస్తోంది. దీనికి తోడు కృత్రిమ అవయవాల కొరత క్షతగాత్రులను తీవ్రంగా వేధిస్తోంది. గాజా స్ట్రిప్‌లో ఎవరిని కదిలించినా కన్నీటి కథలు, వ్యథలే వినిపిస్తున్నాయి.

రెండేండ్లలో వచ్చింది ఒక్క ట్రక్కే

ఇజ్రాయిల్ మారణహోమంలో ఐదారు వేల మంది వికలాంగులుగా మారారు. వీరిలో నాలుగో వంతు మంది చిన్నారులేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది. వీరి జీవితాలు చక్కబడాలంటే కృత్రిమ అవయవాల అవసరం ఉంది.


అయితే వాటి కొరత అధికంగా ఉంటోంది. అవి గాజాకు చేరుకోవడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. గత రెండు సంవత్సరాల కాలంలో మొదటిసారిగా ఇటీవలే కృత్రిమ అవయవాలతో కూడిన ట్రక్కు గాజాకు చేరుకుంది. యుద్ధం మొదలైనప్పటి నుంచి దేశంలో కృత్రిమ అవయవాల తయారీకి కానీ, అందుకు అవసరమైన సమగ్రి రవాణాకు కానీ ఇజ్రాయిల్ అనుమతించలేదు. యుద్ధ సమయంలో ఎన్ని కృత్రిమ అవయవాలు గాజాకు చేరుకున్నాయని అడిగిన ప్రశ్నకు ఇజ్రాయిల్ సైన్యం నుంచి సమాధానమే కరువైంది. వైద్య చికిత్స నిమిత్తం గాజా నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారి సంఖ్య 16,500 వరకూ ఉంటుందని ఐక్యరాజ్యసమితి తెలిపింది. కేవలం కృత్రిమ అవయవాలను అమర్చుకోవడానికే కాదు...అనేక తీవ్రమైన ఆరోగ్య సమస్యలు, వేధిస్తున్న గాయాలతో బాధపడుతున్న ఎందరో వైద్య సాయం కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీ నాటికి కేవలం 1,235 మందిని మాత్రమే విదేశాలలో చికిత్సకు అనుమతించారు. అంటే రోజుకు కనీసం ఐదుగురికి కూడా అనుమతి ఇవ్వలేదన్న మాట. గాజా-ఈజిప్ట్ మధ్య తన అధీనంలో ఉన్న రఫా క్రాసింగ్ మీదుగా బాధితులను పంపేందుకు సిద్ధంగానే ఉన్నానని, అయితే క్రాసింగ్‌కు ఆవలి వైపున ఉన్న ప్రాంతం ఈజిప్ట్ అధీనంలో ఉన్నదని, గాజాలో పాలస్తీనియన్ల ప్రవేశానికి రఫాను కూడా తెరవాలని అది డిమాండ్ చేస్తోందని ఇజ్రాయిల్ చెబుతోంది. యుద్ధంలో 42 వేల మంది పాలస్తీనియన్లకు వివిధ రకాలుగా తీవ్రమైన గాయాలయ్యాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది.


ఇజ్రాయిల్ అమానీయ దాడుల్లో అవయవాలు పోగొట్టుకొని ఇలా కృత్రిమ అసరా కోసం ఎదురుచూస్తున్న బాలలు ఎందరో..

కాలు ఛిద్రమై చికిత్స కోసం ఎదురు చూస్తూ...

సెంట్రల్ గాజాలో నివసిస్తున్న హనీన్-అల్-మెబూహ్ గత సంవత్సరం జూలైలో తన ఇంటిలో నిద్రిస్తుండగా ఇజ్రాయిల్ జరిపిన దాడిలో అది పూర్తిగా ధ్వంసమైంది. ఆమె నలుగురు కుమార్తెలు చనిపోయారు. వారిలో ఐదు నెలల పసిపాప కూడా ఉంది. భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. అల్-మెబూహ్ రెండు కాళ్లు శిథిలాల కింద నలిగిపోయాయి. వైద్యులు ఆమె కుడి కాలిని తొలగించారు. కృత్రిమ కాలిని అమర్చుకునేందుకు ఆమె విదేశాలకు వెళ్లాలని అనుకుంటున్నారు. అల్-మెబూహ్ అనేక వారాల పాటు ఆస్పత్రిలోనే జీవచ్ఛవంలా గడిపారు. పిల్లలు చనిపోయిన విషయం కూడా ఆమెకు తెలీదు. అయితే ఇంకా ఆమెకు గాజాను వీడేందుకు అనుమతి లభించలేదు. 'ఇప్పుడు నా భవిష్యత్తు అంధకారంలో ఉంది. నా కలల్ని వారు నాశనం చేశారు' అని ఆమె వాపోయారు.

చైనాలో అంధులకు తోడుగా రోబో శునకం



బీజింగ్ : చైనాలో కృత్రిమ మేధ వినియోగంతో అనేక ప్రజా ప్రయోజనకర ఉత్పత్తులు అందుబాటులోకి వస్తున్నాయి. ఎఐ, రోబోటిక్స్ రంగాన చైనా దూసుకుపోతోంది. ఈ క్రమంలో తాజాగా దృష్టి లోపం ఉన్న ప్రయాణికుల కోసం షెన్‌జెన్ మెట్రో ఏఐ ఆధారిత రోబోటిక్ 'గైడ్ డాగ్'ను ప్రారంభించింది. ప్రపంచ రైలు రవాణా పరిశ్రమలో ఇలాంటి సాధనాన్ని ఉపయోగించడం ఇదే మొదటిసారి అని దేశీయ మీడియా సంస్థలు తెలిపాయి. క్సియాసాన్ అని పిలవబడే ఈ స్మార్ట్ రోబోటిక్ గైడ్ డాగ్ (చిన్న వెల్లుల్లి) దక్షిణ చైనాలోని గువాంగ్‌డాంగ్ రాష్ట్రం పుటియన్ జిల్లాలో ఉన్న హువాంగ్‌ముగాంగ్ రవాణా కేంద్రంలో ట్రయల్ కార్యకలాపాలు ప్రారంభించింది. దృష్టి లోపం తక్కువగా ఉన్న వారు మెట్రో స్టేషన్లలో తిరగడానికి ఇది సహాయకారిగా వ్యవహరిస్తుంది. రైలు రవాణా లో ఇలాంటి సర్వీసును ప్రారంభించడం ఇదే ప్రథమం. వికలాంగులకు మద్దతు ఇవ్వడంలో ఏఐ పాత్రను ఇది నొక్కి చెబుతోంది. రోబోటిక్ గైడ్ డాగ్‌కు భద్రతకు సంబంధించిన పరీక్షలు, తనిఖీలు పూర్తయ్యాయి. ఒక నెల రోజుల పాటు దృష్టి లోపం ఉన్న ప్రయాణికుల వెంట సిబ్బంది ఉంటూ సహకా రాన్ని అందిస్తారు. పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతం అయితే ఇతర స్టేషన్లలో కూడా దీనిని ప్రవేశపెడతా రు. 12వ జాతీయ వికలాంగుల క్రీడలకు మద్దతుగా ఈ ప్రాజెక్టును రూపొందించారు.

బాలికపై అత్యాచారం, హత్య కేసులో దోషికి క్షమాభిక్ష నిరాకరించిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ : మహారాష్ట్రలో రెండేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన కేసులో దోషిగా ఉన్న వ్యక్తి క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరస్కరించినట్లు సంబంధిత అధికారులు ఆదివారం తెలిపారు. 2012 మార్చి 6న రెండేళ్ల బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారం చేసిన అనంతరం హత్య చేసిన రవి అశోక్ ఘుమారేకి సుప్రీంకోర్టు మరణ శిక్ష విధించింది. సహజ, సామాజిక మరియు చట్టపరమైన అన్ని పరిమితులను అతిక్రమించాడని, అతనికి మరణశిక్షే సరైనదని 2019, అక్టోబర్ 3నలో సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించింది. తనకు క్షమాభిక్ష ప్రసాదించాలని రవి విజ్ఞప్తి చేయగా..అతడి పిటిషన్‌ను రాష్ట్రపతి తిరస్కరించారని అధికారులు తెలిపారు. ఇది రాష్ట్రపతి తిరస్కరించిన మూడవ క్షమాభిక్ష పిటిషన్‌గా పేర్కొన్నారు.

మామిడి రైతులకు మొండిచెయ్యి

(మొదటిపేజీ తరువాయి)

రైతుల నుంచి 3,67,116 మెట్రిక్ టన్నుల మామిడిని కొనుగోలు చేశాయి. అయితే, కొన్ని ఫ్యాక్టరీలు కిలోకు రూ.4 చొప్పున, మరికొన్ని ఫ్యాక్టరీలు రూ.5 చొప్పున మాత్రమే చెల్లించాయి. పైగా, 50 శాతం మంది రైతులకు మాత్రమే ఈ మేరకు చెల్లింపులు జరిగినట్లు సమాచారం. మిగిలిన 50 శాతం మందికి ఒక్క రూపాయి కూడా చెల్లించనట్లు తెలుస్తోంది. ఇంతవరకూ ఒక్క రూపాయి కూడా జమకాని వారు, సగంసగం అందిన వారు ఫ్యాక్టరీల చుట్టూ నెలల తరబడి ప్రదక్షిణలు చేస్తోన్నా సమాధానం చెప్పేవారే కరువయ్యారు. అయినా, ప్రభుత్వం గుజ్జు పరిశ్రమల యాజమాన్యంపై చర్యలు తీసుకోకుండా చేష్టలుడిగిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ప్రభుత్వం ప్రకటించిన రూ.4 ఇప్పటికే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. ఇకెవైసి పూర్తి కాని వారికి మాత్రం జమకాలేదు.

రూ.8 ఇస్తామని నమ్మించారు

నాకు రెండు ఎకరాల్లో మామిడి తోట ఉంది. తవణంపల్లి మండలంలోని నవ్య ప్యాక్ ఫుడ్స్ గుజ్జు పరిశ్రమకు నాలుగు టన్నుల మామిడి కాయలను తోలాను. నా బ్యాంకు ఖాతాలో ఐదు రూపాయల చొప్పున నాలుగు టన్నులకు 20 వేలు వేసింది. మిగిలిన డబ్బులు నేటికీ పడలేదు.

-రామయ్యగౌడు, ఐరాల

ఒక్క రూపాయి బిల్లూ చెల్లించలేదు

పది ఎకరాల్లో మామిడి తోట ఉంది. గుడిపాల మండలంలో ఫుడ్ అండ్ ఇన్స్ గుజ్జు ఫ్యాక్టరీకి 20 టన్నుల మామిడి కాయలు తోలాను. ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా ఫ్యాక్టరీ యాజమాన్యం చెల్లించలేదు. రూ.1.60 లక్షలు రావాల్సి ఉంది. డబ్బుల కోసం ఐదు నెలలుగా ఎదురు చూస్తున్నాను.

-భాగ్యనాథ్‌రెడ్డి, యాదమరి

ప్రజాస్వామ్య విలువలకు పాతర

(మొదటిపేజీ తరువాయి)

కూడా వారికి తెలియడం లేదని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఐడియాలజీ ఆఫ్ ఇండియా, ఐడియాలజీ ఆఫ్ హిందూయిజం' తమ సిద్ధాంతమన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను, మోడీ, అమిత్ షా ద్వయాన్ని సత్యంతోనే ఓడిద్దామని రాహుల్ పిలుపునిచ్చారు.

అధికారం నుండి తొలగించాలి: ఖర్గే

రాజ్యాంగాన్ని, పౌరులకు అది ఇచ్చిన ఓటు హక్కును కాపాడుకునేందుకు ప్రజాస్వామ్య విలువలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నవారిని ఓడించడమే మార్గమని ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం 'దేశాన్ని అంతం చేస్తుంది' అని పేర్కొన్నారు. బిజెపి వాళ్లే అసలైన దేశ ద్రోహులని, వీరిని అధికారం నుంచి తొలగించాల్సిందేనని అన్నారు.

నిష్పాక్షికత లేని ఎన్నికలు : ప్రియాంక గాంధీ

దేశంలో ఎన్నికలు నిష్పాక్షికంగా నిర్వహించడం లేదని, ప్రక్రియ ప్రతి దశలోనూ అనుమానం చుట్టుముట్టిందని వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ అన్నారు. ప్రజాస్వామ్య విలువలను పక్కా ప్రణాళికతో నీరుగారుస్తున్నారని ఆమె వాపోయారు. బీహార్‌లో ఎన్నికల పరాజయాలతో నిరాశ చెందవద్దని, ఫలితాలను తారుమారు చేశారని ఆమె పేర్కొన్నారు. ఇవిఎంలు కాకుండా బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహిస్తే బిజెపి వాళ్లు ఎప్పటికీ గెలవలేరని ఆమె పేర్కొన్నారు.

రేషన్ కార్డులూ తొలగించేస్తారు : రేవంత్ రెడ్డి

ఎస్‌ఐఆర్‌తో ఇప్పుడు ఓటు హక్కును తొలగిస్తున్నారని, రాబోయే రోజుల్లో ఇలాగే కొనసాగితే పేదలకు రేషన్ కార్డు కూడా ఉండనివ్వరని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. 'రాజ్యాంగ రచన సమయంలో దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, పేదలకు ఓటు హక్కు విషయమై చర్చ చర్చిస్తున్నప్పుడు ఆర్‌ఎస్‌ఎస్, గోల్వాల్కర్ ఈ తరగతులకు ఓటు హక్కు ఇవ్వవద్దన్నారు. కానీ.. మహాత్మా గాంధీ, అంబేద్కర్ పేదలకు ఓటు హక్కు కల్పించి దేశంలో ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం ఇచ్చారు' అని రేవంత్ గుర్తు చేశారు. ఇప్పుడు ఆర్‌ఎస్‌ఎస్, గోల్వాల్కర్ భావజాలంతో ఉన్న నరేంద్ర మోడీ, అమిత్ షా ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరువాత ఎస్‌ఐఆర్ పేరుతో దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, పేదల ఓట్లు తొలగించే పనిలోపడ్డారని విమర్శించారు.

తమిళనాడులో మతోన్మాద యత్నాలు..

- మత సామరస్యం కోసం

సిపిఎం 300 కి.మీ పాదయాత్ర

దేశంలో అనేక ప్రాంతాల్లో హిందూ, ముస్లీం ప్రార్ధనాలయాలు తరతరాలుగా పక్కపక్కనే వుంటూ మత సామరస్యానికి చిహ్నాలుగా వర్ధిల్లుతున్నాయి. ఈ ప్రాంతాల్లో ఎవరి మత విశ్వాసానికి అనుగుణంగా వారు పూజలు చేసుకుంటూ విలువైన భారతీయ సాంప్రదాయాన్ని ప్రజలు కాపాడుకుంటూ వస్తున్నారు. మతతత్వం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకునే శక్తులకు ఇలాంటి సామరస్య జీవనవిధానం నచ్చదు. సున్నితమైన ఇలాంటి ప్రాంతాల్లో మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి అనేక ప్రాంతాల్లో ప్రయత్నాలు సాగుతున్నాయి. అందులో భాగమే దక్షిణ తమిళనాడులోని మధురై కి 8 కి. మీ దూరంలో శైవాలయం, జైన ఆలయం వాటిని ఆనుకుని దర్గా వున్నాయి. ఈ ప్రాంతమే నేటి మత వివాద కేంద్రంగా వున్న 'తిరుప్పరంకుండ్రం'.

మతసామరస్య చిహ్నం

తమిళనాడు ప్రాంతాన్ని పాలించిన పాండ్యరాజులు శైవ మతవిశ్వాసకులు. వారి పాలనాకాలంలో అనేక ప్రాంతాల్లో శైవ ఆలయాలు నిర్మించబడ్డాయి. సుమారు క్రీ.శ 10వ శతాబ్దం ప్రారంభంలో 'పరంకుండ్రు' అని పిలవబడే పర్వతంపై శైవ ఆలయం నిర్మించారు (ఈ ప్రాంతాన్ని 'తిరుప్పరంకుండ్రం' అని పిలుస్తున్నారు). విజయనగర రాజులు ఈ ఆలయాన్ని మరింతగా విస్తరించినట్లు చరిత్రకారులు నిర్ధారించారు. విశాలమైన, అత్యంత ఎతైన పర్వతంపై జైనులు రెండు వేల సంవత్సరాల క్రితం ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ పర్వతం మధ్యలో సికందర్ బాద్షా అనే పకీరు దర్గాను నిర్మించారు. మూడు మతాల కేంద్రంగా 'తిరుప్పరంకుండ్రం' ఇప్పటి వరకు వర్ధిల్లింది.

వివాదం

తమిళులు అధికంగా పూజించే మురుగన్ (సుబ్రమణ్యంస్వామి) ఆరు పవిత్రక్షేత్రాల్లో ఈ ఆలయం ఒకటి. ఇక్కడికి రాష్ట్రంనుండే కాక పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు భారీగా వస్తుంటారు. గత డిసెంబరు తర్వాత ఈ ప్రాంతం ప్రస్తుతం వివాదస్పద కేంద్రంగా మారింది. గత కొద్దికాలంగా ఈ పర్వతంపై వున్న దర్గా గురించి, అక్కడ జరిగే బలి (కందూరి) గురించి సోషల్ మీడియాలో హిందూత్వ శక్తులు ప్రచారం చేసాయి. ఈ పర్వతం పేరు సికందర్ మలై గా మార్చేస్తున్నారని, ఆ పర్వతంపై వున్న స్తంభం హిందూ దీపస్తంభమని (బ్రిటిష్ పాలనలో భూ సర్వే కోసం నాటిన రాయిగా ప్రభుత్వం ప్రకటించింది) ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో గత డిసెంబర్‌లో ఒక వ్యక్తి కొండపైన వున్న దర్గా దగ్గర జంతు బలి (కందూరి)చేయడానికి ప్రయత్నించినప్పుడు హిందూత్వ సంస్థలు అడ్డుకున్నాయి.

పోలీసులు ఆ ఆచారాన్ని నిలిపివేశారు. ఈ సమస్యను పరిష్కరించడానికి, డిసెంబర్ 31న మత సంస్థలు మరియు స్థానిక రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మధ్య శాంతి చర్చలు జరిగాయి. చారిత్రాత్మకంగా కందూరి ఆచరిస్తున్నట్లు ఎటువంటి రికార్డులు లేవని ఆర్డీఓ తీర్పునివ్వడంతో ఉద్రిక్తతలు పెరిగాయి.

అవకాశవాద రాజకీయాలు

బిజెపి మద్దతు ఉన్న హిందూత్వ సంస్థలు ఈ అంశాన్ని రాజకీయ ప్రయోజనం పొందడానికి ఒక అవకాశంగా భావించాయి.

ఈ పర్వతం వున్న మధురై జిల్లాలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం టంగ్‌స్టన్ మైనింగ్ ప్రాజెక్టును చేపట్టింది. ఆ ప్రాంత రైతులు తీవ్రంగా ప్రతిఘటించడంతో దానిని ఉపసంహరించుకున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ ఆలయ వివాదాం మరింతగా ముందుకు వచ్చింది. మరోవైపు కొన్ని ఛాందస ముస్లిం సంస్థలు కూడా ఈ వివాదంలో భాగమయ్యాయి.

ప్రజల్లో మత సామరస్యం

తిరుపరంకుండ్రంలో రగులుతున్న మత వివాదంలో స్థానిక ప్రజలు కనీసంగా కూడా భాగస్వాములు కాకపోవడం మంచి పరిణామం. మతఉద్రిక్తతల కేంద్రంగా మా ప్రాంతాన్ని మార్చవద్దు అని రాష్ట్ర రాజధానిలో ప్రదర్శన చేయడానికి స్థానికులు ప్రయత్నించారు. అందుకు అనుమతి లభించకపోవడంతో కోర్టుకు వెళ్లారు. బయటి వ్యక్తుల వల్లే ఈ వివాదం సృష్టించబడుతుందని వారు తమ ఫిటిషన్‌లో పేర్కొన్నారు. ఫ్రంట్‌లైన్ పత్రిక విలేఖరి గిరివలం ఈ ప్రాంతాన్ని పరిశీలించి 'తాము ఎల్లప్పుడూ ఇక్కడ అన్ని మతాలతో శాంతియుతంగా జీవిస్తున్నామని, బయటి వ్యక్తులను నివారించడం, తగినంత సంఖ్యలో పోలీసులను నియమించడం చేయాలని' స్థానికులు తెలిపినట్లు ఆయన నివేదించారు.

సిపిఎం పాదయాత్ర

తమిళనాడులో కుల వివక్షపై సిపిఎం పార్టీ సుదీర్ఘపోరాటాలు అనేకం చేపట్టింది. కమ్యూనిస్టు ఉద్యమానికి కేంద్రంగా మధురై వుంది. స్థానిక ఎంపీ సిపిఎం పార్టీకి చెందినవారే. ఏప్రెల్‌లో సిపిఎం జాతీయ మహాసభలు ఇక్కడే జరిగాయి. తమిళనాడులో మతఉద్రిక్తతలను, మతోన్మాదుల చర్యలను అడ్డుకోవాలని ఐదు వామపక్ష పార్టీలు ఇటీవల ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసాయి. మత సామరస్యాన్ని కోరుతూ ఆదివారం నుండి 300 కిలో మీటర్ల పాదయాత్రను సిపిఎం చేపట్టింది.

-ఫీచర్స్ అండ్ పాలిటిక్స్



జీవన సారథం

చేసిన పొరపాటుకు చింతించే బదులు మళ్లీ చేయకుండా జాగ్రత్త పడటం ఉత్తమం.

మీ కోసం

కూరలు వండేటప్పుడు నూనె వేడెక్కగానే పసుపు వేస్తే కాయగూరలు వాటి సహజ రంగును కోల్పోవు.



JEEVANA జీవన the family

చెక్క బొమ్మల తయారీ చూశాం



హాయ్ ఫ్రెండ్స్,

నా పేరు సహస్ర. ఐదో తరగతి చదువుతున్నాను. ఈ సంవత్సరం మా స్కూలు యాజమాన్యం మా తరగతి పిల్లలని రాయపూడి గ్రామంలో నీమ్ టాయ్ ఇండస్ట్రీకి ఫీల్డ్ ట్రిప్‌కి తీసుకెళ్లారు. అక్కడ ఒక మెషిన్ బొమ్మలు తయారు చేస్తుంటే ఎంతోమంది ఆ బొమ్మల్ని పదునుగా చెక్కుతున్నారు. రంగులు అద్దుతున్నారు. వాళ్లతో కలిసి మేము కూడా ఆ బొమ్మల్ని ఎలా తయారు చేస్తున్నారో శ్రద్ధగా చూశాం. ఆ తరువాత మమ్మల్ని ఉండవల్లి గుహలు దగ్గరకి కూడా తీసుకెళ్లారు. పాఠశాలకి తిరిగి వచ్చాక ట్రిప్ ఎంత బాగా ఎంజాయ్ చేశామో మా స్నేహితులం అందరమూ మాట్లాడుకొన్నాం. ఆ రోజంతా చాలా హ్యాపీగా గడిచింది.



- ఎం.సహస్ర,
5వ తరగతి, అరవింద హై స్కూలు, కుంచనపల్లి.

నేలను రక్షించాలి

నేలను రక్షించాలి
పూలను పూయించాలి
చేలను పండించాలి
సేంద్రియాలు వాడాలి!
ధరణిని రక్షించాలి
తరువును బతికించాలి
పంటను పండించాలి
పేడ ఎరువు వేయాలి!
భూమిని రక్షించాలి
భూజములను పెంచాలి
భూధరములనుంచాలి
బూడిద నాపించాలి!
అవనిని రక్షించాలి
అడవిని రక్షించాలి
అవధిలేని కాలుష్యము
నాపించగ బూనాలి!
పచ్చదనం నింపాలి
స్వచ్ఛత సాధించాలి
సాగరాంత పర్యంతం
సహనంతో ఈదాలి!



- కిలపర్తి దాలినాయుడు,
సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
రామభద్రపురం.

నేను గీసిన బొమ్మ



గురిజాల ఏసురాజు,
6వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
పోతారెడ్డిపేట, సిద్దిపేట.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చలి బారిన పడకండి!

అసలే చలికాలం. అందునా చలి పంజా విసురుతోంది. సాయంత్రం 6 గంటల నుంచే చలి మొదలై ఉదయం 8 గంటల వరకూ కూడా చలితాకిడి తగ్గని పరిస్థితులు. చలి నుంచి శరీరానికి నిండుగా ఉంటూనే వెచ్చదనాన్ని పంచే దుస్తుల్లో ఉన్ని దుస్తులు మేలు చేస్తాయి. ఇలాంటి కోవకు చెందిన స్వెట్టర్లు, శాలువాలు వంటి దుస్తులను ఎంపిక చేసుకోవటానికి అందరూ ఆసక్తి చూపుతారు. సౌకర్యానికితోడు స్టైలిష్‌గా ఉండే వాటిని ధరిస్తారు.



కొంత కాలంగా చలి బాగా పెరిగింది. చలికాలంలో వీచే శీతల గాలులు మనిషిని సులభంగా అనారోగ్యానికి గురి చేస్తాయి. అందుకే చలికాలంలో శరీరం వెచ్చగా ఉండటానికి, చలి నుంచి మనల్ని మనం రక్షించుకోవడానికి మంచి ఉన్ని దుస్తుల్లోని దుప్పట్లు, రగ్గులు, స్వెట్టర్, మెఫ్లర్, టోపీ, జర్కిన్ వంటి వాటిని ధరించాలి. చలి నుంచి శరీరాన్ని రక్షించుకోవడానికి పొరలుగా ఉండే దుస్తులు ధరించడం ఎల్లప్పుడూ ఉత్తమం. నొప్పి, వేళ్లు, కాలి దురద లాంటి సమస్యలను నివారించడానికి, సాక్స్‌తో పాటు చేతి తొడుగులు ధరించాలి. స్వెటర్ ధరించి నిద్రపోవటం వల్ల శరీరం వేడిగా ఉండి సౌకర్యంగా అనిపిస్తుంది. స్వెటర్ శుభ్రంగా ఉండి, గాలి పీల్చుకునే ఫ్యాబ్రిక్‌తో తయారై ఉంటే ఇంకాస్త మేలు. పాతబడ్డవి, దుమ్ముపట్టినవి లేదా బిగుతుగా ఉండేవి చర్మానికి చికాకు కల్గించి దురద లేదా ఇతర ర్యాష్‌లకు కారణం కావచ్చు. నిద్రకు అనువుగా, మృదువుగా ఉండే స్వెట్టర్లను మాత్రమే ఉపయోగించాలి. రాత్రి నిద్రపోయేటప్పుడు శరీరానికి గాలి అందేలా ఉండే తేలికపాటి ఫాబ్రిక్‌లు కాటన్, లినెన్ వంటివి ఉత్తమం. ఇవి చర్మం చెమట పట్టకుండా చూడటమే కాదు, శరీర ఉష్ణోగ్రతను సరిగ్గా నిలబెట్టడంలో కూడా సహాయపడతాయి.

చలిలో పాదాలను వేడిగా ఉంచి నిద్రను మెరుగుపర్చటానికి సాక్స్‌లు దోహదపడతాయి. వాటిని శుభ్రంగా ఉంచుకోవాలి. లేనిపక్షంలో దుర్వాసన, ఇన్ఫెక్షన్లకు కారణం కావొచ్చు. సూర్యుడు బయటకు వచ్చినప్పుడు మాత్రమే ఇంటి వెలుపలకు రావటం మేలు. ముక్కు కవర్ చేయడానికి ఫేస్‌మాస్క్ ఉపయోగించండి. ఈ కాలంలో రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవటానికి అవసరమైన ఆహారాలు తీసుకోవాలి. చర్మం, జుట్టు శీతల గాలుల బారిన పడకుండా ప్రత్యేక శ్రద్ధ అవసరం.

అందుబాటులో ఉన్ని దుస్తులు

రాత్రిళ్లు చలి నుంచి వెచ్చదనం కోసం పిల్లలు, వృద్ధులు దుప్పట్లు కప్పుకోకపోతే చలిని భరించలేరు. నేడు అన్ని ప్రాంతాల్లోనూ మార్కెట్లలో తేలికపాటి దుప్పట్ల నుంచి బరువు ఉన్న రగ్గుల వరకూ దొరుకుతున్నాయి.

ఈ కాలంలో చలి నుంచి కాపాడటానికి దోహదపడతాయి.

బాగా చలిగా ఉన్నప్పుడు రెండు దుప్పట్లు కప్పుకోగానే క్షణాల్లో వెచ్చగా ఉంటుంది. మనం రెండు దళసరి దుప్పట్లు కప్పుకున్నప్పుడు వాటి మధ్య ఒక గాలి పొర ఇరుక్కుపోతుంది. ఇలాంటి గాలిపొర వేడిని తన గుండా అంత సులభవంగా పోనివ్వదు. దాంతో మన ఒంట్లో వేడి అంత సులభంగా గాల్లోకి పోదు. అందువల్లే రెండు దుప్పట్లను కప్పుకున్నప్పుడు మనకు వెచ్చగా ఉంటుంది.

చలి దుస్తులకు గిరాకీ

శీతాకాలంలో ధరించే దుస్తుల్లో ఉన్ని దుస్తులకు గిరాకీ ఉంటుంది. ఇవి ధరిస్తే శరీరానికి వెచ్చదనం వస్తుంది. పగటి ఉష్ణోగ్రతలు కూడా తగ్గుతుండటం, రాత్రిళ్లు వణికిపోయే చలిగాలులు వస్తున్నందున ఈ దుస్తుల ఎంపిక ఎంతో శ్రేయస్కరం. పిల్లల నుంచి పెద్దల వరకూ ఈ కాలంలో ఉన్ని దుస్తులు వెచ్చని నేస్తాలుగా ఉంటాయి. ప్రతి ఒక్కరూ తమ లైఫ్‌స్టైల్‌కు అనుగుణంగా వింటర్ దుస్తులు ఎంపిక చేసుకుంటారు. వెరైటీలను కూడా కోరుకుంటుండటం తెలిసిందే. ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెడితే ఇంటికే తెచ్చి ఇస్తుండటంతో కాలు బయట పెట్టకుండా పనులు అయిపోతున్నాయి. కాస్త ఫ్యాషనబుల్, స్టైల్‌గా ఉండేందుకు మార్కెట్లో ఊలు, సింథటిక్ దుస్తులు వివిధ డిజైన్లలో లభిస్తున్నాయి. మహిళలకు విత్ క్యాప్ లాంగ్ వింటర్ వేర్, స్కార్ఫ్‌తో కూడిన ఊలు దుస్తులు వీనెం, పోలో, రౌండ్‌నెక్, స్టెప్స్ తదితర రకాల్లో లభ్యమవుతున్నాయి. యువతీ యువకులు ధరించేందుకు ప్రింటెడ్ స్టైలిష్ జాకెట్స్, కోట్స్, కార్ డ్రే షర్ట్స్, కార్‌డ్రే బ్లేజర్స్, స్వెట్టర్ జాకెట్స్, స్లీవ్‌లెస్ స్వెట్టర్స్ కొలువు తీరాయి. మల్టీపర్పస్‌గా ఉపయోగించే షార్ట్ జీన్స్‌కోట్స్, జర్కిన్స్, లెదర్ జాకెట్లకు భలే క్రేజ్ ఉంటోంది. వీటిల్లో బ్రాండ్‌ను బట్టి ధరలు రూ.500 నుంచి రూ.5000 వరకు ఉన్నాయి. బ్రాండెడ్ దుస్తుల ధరలు చెప్పక్కర లేదు. ప్రత్యేకంగా డిజైనర్లు రూపొందించిన కలెక్షన్లు షాపుల్లో సందడి చేస్తున్నాయి. వీటికితోటు ఫార్మల్ వేర్, పార్టీ వేర్ కూడా అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం అన్ని మాల్స్, వస్త్ర దుకాణాల్లో వింటర్ కలెక్షన్లను ప్రత్యేక ఆఫర్లతో విక్రయిస్తున్నారు. ఎంతఖర్చుపెట్టి కొన్నా రెండు నెలలకు మించి ధరించే అవకాశం ఉండదు. వచ్చే ఏడాదికే పయోగపడతాయి. అందువల్ల నాసిరకం దుస్తులను కాకుండా నాణ్యమైనవి కొనుక్కుంటే ఉపయోగకరం. వన్ ప్లస్ వన్, 50 శాతం రాయితీ, 100 శాతం మనీ క్యాష్ బ్యాక్ పేరుతో మనల్ని ఆకట్టుకోవటానికి వ్యాపారులు చూస్తుంటారు. ఆఫర్‌లో వస్తున్నాయని పరిశీలించకుండా కొనుగోలు చేస్తే మోసపోవటం ఖాయం. బ్రాండెడ్ దుస్తులను ఎంపిక చేసుకుని కొనుగోలు చేయటం ఉత్తమం.

లేటెస్ట్ ఫ్యాషన్స్‌పై ఆసక్తి

చలికాలంలో ధరించే ఉన్ని దుస్తుల్లో యువత లేటెస్ట్ ట్రెండ్‌ను కోరుకుంటున్నారు. సౌకర్యవంతంగా ఉండే మోడళ్లను ఎంపిక చేసుకుంటున్నారు. చేతితో నేసిన ఊలు దుస్తులపైనా మక్కువ పెంచుకుంటున్నారు. వాటిల్లోనే అనేక మోడళ్లు, రకాలు, డిజైన్లు మార్కెట్లో కొలువు తీరి ఉంటున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో వీటికి ఆదరణ ఎక్కువగా ఉంటోంది. పొడవైన కోటు, క్యాప్స్, స్కర్ట్స్, హ్యాండ్ గ్లౌజెస్, ఊలు మఫ్లర్, జాకెట్లు, స్వెట్టర్లు ఇలా విభిన్న రకాల్లో లభిస్తున్నాయి. ఇవి ధరించటానికి అందంగా ఉంటాయి.

శాలువాలతోనూ మేలే...

శరీరానికి చలి నుంచి వేడిని పెంచేలా శాలువాలు కూడా దోహదపడతాయి. ఊదా, క్రీమ్ రంగులతోపాటు ప్లెయిన్, చెక్స్ వంటి రంగుల్లో ఉన్న శాలువా ప్రస్తుతం మార్కెట్లో విరివిగా అందుబాటులో ఉన్నాయి. మ్యాచింగ్ రంగులతోపాటు, ప్యాటర్న్లలో ఉండే శాలువాలు ఆకర్షణీయంగా ఉంటున్నాయి. కాంట్రాస్ట్ కలర్స్ కూడా ఆకర్షణీయంగా ఉంటున్నాయి. ప్రింటెడ్, ప్లెయిన్ శాలువాలు సరికొత్తగా కనిపిస్తున్నాయి. ఈ శాలువాల్లోనూ కాశ్మీర్ ఉన్ని, మఖ్మల్, పష్మీనా వంటి మెటీరియల్స్‌తో రూపొందించిన కూడా వెచ్చదనాన్ని ఇస్తాయి.

రంగవల్లులకు స్వాగతం!

సంక్రాంతి పండుగ హడావిడిలో ముగ్గులది ప్రత్యేక స్థానం. మరి ఇంకెందుకు ఆలస్యం? చకచకా ముగ్గులు వేసేయండి. 'జీవన' పాఠకులతో పంచుకోండి. తెల్ల కాగితంపై పెన్సిల్ లేదా బాల్‌పాయింట్ పెన్నుతో వేసిన ముగ్గులకు రంగులు నింపి పంపండి. అందరికీ అర్థమయ్యేలా నిలువు, అడ్డం చుక్కల వివరాలు కూడా పేర్కొనండి. మీ పేరు, చిరునామా, ఫొటో, ఫోన్ నెంబరు కచ్చితంగా పంపాలి. మెయిల్ ద్వారా పంపేవారు పూర్తి చిరునామా పంపాలి.

మా చిరునామా

రంగవల్లి

ప్రజాశక్తి దినపత్రిక, ప్రజాశక్తి భవనం, అరవింద హై స్కూలు దగ్గర,
అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com, వాట్సాప్ : 83329 25496

సునాయాసంగా..

మూడో టి20లో సౌతాఫ్రికాపై భారత్ ఘన విజయం
రాణించిన అర్ష్‌దీప్, వరుణ్, కుల్‌దీప్ యాదవ్
మెరిసిన అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్
2-1 ఆధిక్యంలో టీమిండియా



హైదరాబాద్ : ధర్మశాలలో టీమ్ ఇండియా ధనాధన్ విజయం నమోదు చేసింది. బంతితో బౌలర్లు.. బ్యాట్‌తో బ్యాటర్లు అంచనాలు అందుకోవటంతో ఆడుతూ పాడుతూ మూడో టి-20లో అదిరే విజయం సాధించింది. 118 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో ఓపెనర్ అభిషేక్ శర్మ (35, 18 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), శుభ్‌మన్ గిల్ (28, 28 బంతుల్లో 5 ఫోర్లు), తిలక్ వర్మ (26 నాటౌట్, 34 బంతుల్లో 3 ఫోర్లు) రాణించటంతో భారత్ 7 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై గెలుపొందింది. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 117 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ఎడెన్ మార్‌క్రామ్ (61, 46 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో ఒంటరి పోరాటం చేశాడు. డొనొవాన్ ఫెరీరా (20, 15 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), ఎన్రిచ్ నోకియా (12, 12 బంతుల్లో 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ (2/13), హర్షిత్ రానా (2/34), కుల్‌దీప్ యాదవ్ (2/12), వరుణ్ చక్రవర్తి (2/11) వికెట్ల వేటలో మ్యాజిక్ చూపించారు. ఐదు మ్యాచ్‌ల టి-20 సిరీస్‌లో 2-1తో భారత్ ముందంజ వేసింది. చివరి రెండు టి-20లు వరుసగా లక్నో, అహ్మదాబాద్‌లో జరుగుతాయి.

అభిషేక్ అదరహో..

స్వల్ప లక్ష్యాన్ని మెరుపు వేగంతో ఛేదించాలనే కసితో ఆడాడు ఓపెనర్ అభిషేక్ శర్మ (35). మూడు సిక్సర్లు, మూడు ఫోర్లతో దండెత్తిన అభిషేక్ శర్మ.. పవర్‌ప్లేలో సఫారీ బౌలర్లతో ఆడుకున్నాడు. మరో ఎండ్‌లో శుభ్‌మన్ గిల్ (28) సైతం రెచ్చిపోవటంతో పవర్‌ప్లేలో భారత్ పవర్‌ఫుల్‌గా కనిపించింది.

అభిషేక్ ఆరు ఓవర్లలోపే అవుటైనా.. భారత్ తొలి 36 బంతుల్లో 68 పరుగులు పిండుకుంది. కార్బన్ బాచ్ ఓవర్లో మార్‌క్రామ్ మెరుపు క్యాచ్‌తో అభిషేక్ ధనాధన్‌కు బ్రేక్ పడగా.. శుభ్‌మన్ గిల్‌ను యాన్సెన్ అవుట్ చేశాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (12, 11 బంతుల్లో 2 ఫోర్లు)), తెలుగు తేజం తిలక్ వర్మ (26 నాటౌట్, 34 బంతుల్లో 3 ఫోర్లు), శివం దూబె (10 నాటౌట్, 4 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) ఆ తర్వాత లాంఛనం ముగించారు. అభిషేక్ శర్మ ధనాధన్ జోరు తర్వాత మన బ్యాటర్లలో ఎవరూ ఆ తరహా దూకుడు చూపించలేదు. శుభ్‌మన్ గిల్, తిలక్ వర్మ సహా సూర్యకుమార్ యాదవ్ సావధానంగానే ఆడారు. అయినా, మరో 25 బంతులు మిగిలి ఉండగానే భారత్ అదిరే విజయం నమోదు చేసింది. ఆఖర్లో శివం దూబె ఓ సిక్సర్, ఫోర్‌తో సూపర్ ముగింపు అందించాడు.

బౌలర్లు భళా..

ధర్మశాలలో కీలక టాస్ నెగ్గిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. అర్ష్‌దీప్ సింగ్ తొలి ఓవర్లోనే భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. రీజా హెండ్రిక్స్ (0) అర్ష్‌దీప్ సింగ్ సంధించిన నాల్గో బంతికే ఎల్‌బిడబ్ల్యుగా నిష్క్రమించాడు. అర్ష్‌దీప్ సింగ్‌తో కలిసి కొత్త బంతిని పంచుకున్న హర్షిత్ రానా.. సైతం మెరవటంతో ఫామ్‌లో ఉన్న ఓపెనర్ క్వింటన్ డికాక్ (1), డెవాల్డ్ బ్రెవిస్ (2)లు పవర్‌ప్లేలోనే డగౌట్‌కు చేరుకున్నారు. 3.1 ఓవర్లలో 7 పరుగులకే దక్షిణాఫ్రికా మూడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో ఆ జట్టును ఎడెన్ మార్‌క్రామ్ (61) ఆదుకున్నాడు. మరో ఎండ్ నుంచి సహకారం లేకపోయినా.. ఆఖరు వరకు సఫారీ ఇన్నింగ్స్‌ను లాక్కొచ్చాడు. మిడిల్ ఆర్డర్‌లో ట్రిస్టన్ స్టబ్స్ (9), కార్బిన్ బాచ్ (4) ఆశించిన ప్రదర్శన చేయలేదు. డొనావాన్ ఫెరీరా (20) నుంచి చక్కటి సహకారం లభించటంతో ఎడెన్ మార్‌క్రామ్ విలువైన భాగస్వామ్యం నిర్మించాడు. ఆరు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 41 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన ఎడెన్ మార్‌క్రామ్.. సఫారీలకు గౌరవప్రద స్కోరు అందించేందుకు చెమటోడ్చాడు. పేస్ ఆల్‌రౌండర్ మార్కో యాన్సెన్ (2)ను వరుణ్ చక్రవర్తి సాగనంపటంతో సఫారీలు ఆఖర్లో పెద్దగా పుంజుకోలేదు. ఎన్రిచ్ నోకియా (12), బార్ట్‌మాన్ (1)లను కుల్‌దీప్ అవుట్ చేశాడు. లుంగి ఎంగిడి (2 నాటౌట్) అజేయంగా నిలిచాడు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ (2/13), హర్షిత్ రానా (2/34), వరుణ్ చక్రవర్తి (2/11), కుల్‌దీప్ యాదవ్ (2/12) రెండేసి వికెట్లు పడగొట్టగా.. హార్దిక్ పాండ్య (1/23), శివం దూబె (1/21) చెరో వికెట్ ఖాతాలో వేసుకున్నారు.

స్కోరు వివరాలు :

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ : 117/10 (ఎడెన్ మార్‌క్రామ్ 61, డొనొవాన్ ఫెరీరా 20, అర్ష్‌దీప్ సింగ్ 2/13, వరుణ్ చక్రవర్తి 2/11)

భారత్ ఇన్నింగ్స్ : 120/3 (అభిషేక్ శర్మ 35, శుభ్‌మన్ గిల్ 28, తిలక్ వర్మ 26, లుంగి ఎంగిడి 1/23, బాచ్ 1/18)

హైదరాబాద్ దూకుడు

- రాజస్థాన్‌పై ఘన విజయం

పుణె : సయ్యద్ ముస్తాక్ అలీ టి-20 టోర్నీలో హైదరాబాద్ వరుస విజయాల జోరుతో కొనసాగుతున్నది. సూపర్ లీగ్ దశ తొలి మ్యాచ్‌లో ముంబయిని చిత్తు చేసిన హైదరాబాద్ తాజాగా రాజస్థాన్‌పై గెలుపొందింది. ఆదివారం పుణెలో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 6 వికెట్ల తేడాతో రాజస్థాన్‌పై ఘన విజయం సాధించింది. సివి మిలింద్ (3/25), తనయ్ త్యాగరాజన్ (3/38) విజృంభించటంతో తొలుత రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 178/9 పరుగులకే పరిమితమైంది.

స్క్వాష్ ప్రపంచ విజేత భారత్

- ఫైనల్లో హాంకాంగ్‌పై ఘనవిజయం



చెన్నై : భారత్ జట్టు తొలిసారి స్క్వాష్ ప్రపంచకప్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో హాంకాంగ్‌పై 3-0తో భారత్ ఘన విజయం సాధించింది. ఈ క్రీడలో విశ్వ విజేతగా నిలవడం భారత్‌కు ఇదే మొదటిసారి. 2023లో కాంస్యం పతకం సాధించడమే భారత్‌కు ఇప్పటి వరకూ ఉత్తమ ప్రదర్శన. కాగా ఆదివారం ఫైనల్లో ముందుగా జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 42వ స్థానంలో ఉన్న కా యిలీపై జోష్నా చిన్నప్ప 7-3,2-7, 7-5,7-1తో విజయం సాధించింది. తరువాత మ్యాచ్‌లో అభయ్ సింగ్ 7-1, 7-4, 7-4 స్కోరుతో అలెక్స్ లౌపై విజయం సాధించారు. తరువాత మ్యాచ్‌లో అనాహత్ సింగ్ 7-2,7-5తో కేవలం 16 నిమిషాల్లో ఓడించారు. ఈ టోర్నీలో శనివారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 3-0తో రెండు సార్లు ఛాంపియన్ ఈజిప్ట్‌ను ఓడించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68